


జ్ఞాన యోగం

విచారణ

ఆత్మ సాక్షాత్కారము




సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్థం మహానుభావులైన **శ్రీ విద్యా సారధి** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **శ్రీ విద్యా సారధి** వారి వెబ్ సైట్: http://srividyasaradhi.org/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని
సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - **సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)**

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

శ్రీ విద్యా సారధి వారి వెబ్ సైట్:

http://srividyasaradhi.org/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఆత్మసాక్షాత్కారము



డా॥ క్రోవి పార్థసారథి

(పరమానందనాథ)

ఆత్మసాక్షాత్కారము



మైసూరు అవధూత దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తారణనామ సంవత్సర ఉగాది పురస్కార గ్రహీత,
ఉత్తమ ఉపాధ్యాయ, కనకాభిషేక గ్రహీత, గండపెండేర సన్మానిత,
సువర్ణఘంటాకంకణ, చక్రవిద, శ్రీవిద్యానిధి, శ్రీవిద్యారత్నాకర, శ్రీవిద్యా విశారద

డా॥ క్రోవి పార్థసారథి

(పరమానందనాథ)

ఆత్మసాక్షాత్కారము

గ్రంథకర్త :
డా॥ క్రోవి పార్థసారథి (పరమానందనాథ)
రీడర్ ఇన్ కామర్స్
శాతవాహన కళాశాల, విజయవాడ.

ప్రథమ ముద్రణ : జులై, 2005

ప్రతులు : 1000

వెల : రూ. 50-00

ప్రాప్తి స్థానములు :
కె. మంజూష
23-11/1-10/2, దేవీ నిలయం
ఓగిరాలవారి వీధి, సత్యనారాయణపురం,
విజయవాడ - 520 011.
ఫోన్ : 0866-2530672
సెల్ : 98497 85031

శివకామేశ్వరి గ్రంథమాల
41-22/4-36, భ్రమరాంబాపురం,
కృష్ణలంక, విజయవాడ - 13.
ఫోన్ : 0866-2522824

ముద్రణ :
నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్
26-6-3, పాపయ్య వీధి, గాంధీనగర్,
విజయవాడ-3. ఫోన్ : 0866 - 2574828

ప్రణతులు

'జ్ఞానాదేవతుకైవల్యం' జ్ఞానియైన వాడికి మాత్రమే మోక్షం సిద్ధిస్తుంది. భక్తి, యోగము అనేవి కూడా మోక్షానికి మార్గాలే. అయినప్పటికీ అందులో కూడా జ్ఞానానిదే ముఖ్యమైన పాత్ర అని చెబుతున్నాయి ఉపనిషత్తులు. అజ్ఞానానికి మూలమైనది మనస్సు. కాబట్టి ఆ మనసును నశింప చేయటమే అమనస్కయోగము. మనసును నశింపచేసినవాడే జ్ఞాని. అతడికే ఆత్మసాక్షాత్కారము కలుగుతుంది. అతడే జీవన్ముక్తుడు. మహాజ్ఞాని. అటువంటివాడు ఈ దేహాన్ని విడిచిన తరువాత అర్చిరాది మార్గంగుండా బ్రహ్మలోకం చేరి, కల్పాంతాన పరబ్రహ్మలో లీనమవుతాడు.

ఈ విషయాలు అందరికీ తెలియాలనే ఉద్దేశ్యంతోనే జీవి ఈ లోకంలో పుట్టటం దగ్గరనుంచీ, మోక్షం పొందేదాకా ఇందులో వివరించబడింది. అసలు పరబ్రహ్మ స్థూలశరీరాన్ని ఏ రకంగా పొందాడు? జ్ఞాని అంటే ఎవరు ? అతని కర్మ, స్థితి, ఏమిటి ? అవధూత ఎవరు ? పరమహంస ఎవరు ? మహావాక్యాల అర్థం ఏమిటి ? వాటి అనుసంధానం ఏమిటి ? ఆత్మసాక్షాత్కారం అంటే ఏమిటి ? అది ఎలా సిద్ధిస్తుంది ? ఎవరికి సిద్ధిస్తుంది ? ఇత్యాది విషయాలను పూర్తిగా ఉపనిషత్తుల ఆధారంగా ఈ గ్రంథంలో వివరించటం జరిగింది. ఉపనిషత్తులలో వేదాంతాన్ని గురించి వివరించేవి 24. వాటి ఆధారంగానే ఈ గ్రంథరచన చెయ్యటం జరిగింది.

ఈ గ్రంథ రచనలో నన్ను అన్నివిధాలా ప్రోత్సహించిన నా భార్య రమాదేవికి నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథ ముద్రణకు అన్నివిధాల ప్రోత్సహించిన శ్రీ వేమూరి వెంకట గాయత్రీరత్న ప్రసాద్ రిటైర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్, మహానగర్ టెలిఫోన్ నిగమ్, ముంబై (ఆత్మానందనాథ) వారికి ప్రత్యేకాభినందనలు.

శ్రీ వి.వి.జి. ప్రసాద్‌గారికి ఆయన ధర్మపత్ని లక్ష్మిగారికి, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను, మనశ్శాంతిని కలుగజెయ్యాలని ఆ పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను.

నేను పండితుణ్ణి కాను, తత్త్వవేత్తను అంతకన్నా కాను. అయినప్పటికీ ఆధ్యాత్మిక చింతనాపరులకు అందుబాటులో ఉండటం కోసం ఈ గ్రంథం వ్రాయటానికి సాహసించాను. ఆధ్యాత్మికవేత్తలు నా యీ సాహసాన్ని మన్నించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

గతంలో వ్రాసిన గ్రంథాలలాగానే ఈ గ్రంథాన్ని కూడా ఆదరిస్తారని భావిస్తూ...

బుధజనవిధేయుడు

క్రోవి పార్థసారథి

(పరమానందనాథ)

పార్థివనామ సంవత్సర
చైత్రశుద్ధ పూర్ణిమ, భానువారం
24-4-2005

విషయసూచిక

ఇందులో ఉటంకించిన ఉపనిషత్తులు

1. గర్భోపనిషత్తు
2. శారీరకోపనిషత్తు
3. మైత్రాయణ్యుపనిషత్తు
4. సుబాలోపనిషత్తు
5. మంత్రికోపనిషత్తు
6. సర్వసారోపనిషత్తు
7. నిరాలంబోపనిషత్తు
8. శుకరహస్యోపనిషత్తు
9. వజ్రశూచికోపనిషత్తు
10. ఆత్మబోధోపనిషత్తు
11. స్కందోపనిషత్తు
12. పైంగలోపనిషత్తు
13. మహోపనిషత్తు
14. అధ్యాత్మోపనిషత్తు
15. ఆత్మోపనిషత్తు
16. ముక్తికోపనిషత్తు
17. పరమహంసోపనిషత్తు
18. అవధూతోపనిషత్తు
19. బృహదారణ్యకోపనిషత్తు
20. ఐతరేయోపనిషత్తు
21. ఛాందోగ్యోపనిషత్తు
22. కైవల్యోపనిషత్తు
23. మహావాక్యోపనిషత్తు
24. అధర్వశిరోపనిషత్తు
25. బహ్వృచోపనిషత్తు
26. లలితారహస్యోపనిషత్తు
27. తేజోబిందూపనిషత్తు
28. సన్యాసోపనిషత్తు

డా॥ క్రోవి పార్థసారథి గారి ఇతర గ్రంథాలు

1. శ్రీవిద్యాసారథి (లలితా సహస్రనామ భాష్యము) 1004 పేజీలు
2. శ్రీకైవల్యసారథి (విష్ణు సహస్రనామ భాష్యము) 1288 పేజీలు
3. శ్రీవిద్యా దర్పణము (గౌడపాదుల సుభగోదయస్తుతికి వ్యాఖ్య)
4. శ్రీవిద్యా సర్వస్వము (కామకలావిలాసానికి వ్యాఖ్య)
5. శ్రీవిద్యా హృదయము (యోగినీ హృదయానికి వ్యాఖ్య)
6. శ్రీవిద్యా పంచదశి (పంచదశీ మహామంత్రానికి వివరణ)
7. శ్రీవిద్యా రహస్యము
8. శ్రీవిద్యా మహాయంత్రము (శ్రీచక్రానికి విశేష వ్యాఖ్య)
9. సప్తశతి భాష్యము (చండీ సప్తశతికి భాష్యము)
10. దేవీ కథాసుధ
11. శ్రీవిద్యా దర్శనము
12. ఉపనిషత్సర్వస్వము (దశోపనిషత్తులు వచన రూపంలో)
13. శ్రీచక్ర సర్వస్వము
14. భావనోపనిషత్తు
15. త్రిపురా రహస్యదీపిక
16. బ్రహ్మసూత్రమంజరి
17. శ్రీచక్రము
18. తొలి ఏకాదశి
19. లలితారహస్యోపనిషత్తు
20. ఆత్మసాక్షాత్కారము
21. ఉపనిషద్దర్శనము (దశోపనిషత్తులపై M.P.-3 CD)
22. శ్రీవిద్యా దర్శనము (M.P.-3 CD)
23. శ్రీవిద్యాసారథి (లలితా సహస్రనామ భాష్యము) M.P.-3 ఆడియో సి.డి.లు-2 (24 గం॥లు)
24. సప్తశతి భాష్యము M.P.-3 ఆడియో సి.డి
25. లలితా రహస్యోపనిషత్తు సి.డి.

సత్కారాలు :

1. 29-05-2005న మైసూరు అవధూత దత్తపీఠ ఆస్థాన విద్వాంసునిగా నియామకము.
2. 21-03-2004న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వముచే ఉగాది పురస్కారము.
3. 05-09-2004న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వముచే ఉత్తమ ఉపాధ్యాయ సత్కారము.
4. 15-08-2004న కృష్ణాజిల్లా కలెక్టర్ వారిచే సన్మానము
5. 05-02-2002న శాతవాహన కళాశాల త్రిదశాబ్ది వేడుకలలో కళాశాల యాజమాన్యము వారిచే రజతపతక ప్రదానము.
6. 23-02-2005న శాతవాహన కళాశాల 34వ వార్షికోత్సవాల సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయునిగా సన్మానము.
7. 28-01-2004న శాతవాహన కళాశాల సెక్రటరీ శ్రీ అండవిల్లి సత్యనారాయణ గారిచే రూ. 500/-ల నగదు ప్రదానము.
8. 13-12-1999న కనకాభిషేకము.
9. 01-08-1998న సువర్ణఘంటాకంకణ ప్రదానము.
10. 03-11-2002న గండపెండేర ప్రదానము
11. 11-01-2004న అవధూత, దత్తపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారిచే నవరత్నాంగుళీయ ప్రదానము

బిరుదులు :

1. చక్రవిద, శ్రీవిద్యా రత్నాకర, శ్రీవిద్యా విశారద, శ్రీవిద్యానిధి, ఉత్తమ ఉపాధ్యాయ, ఉపాధ్యాయరత్న, విద్యార్థిబంధు.

1. ప్రస్థావన

"నమస్కారం గురువుగారూ !"

రెండు గొంతులు ఒక్కసారి పలికేటప్పటికి కళ్ళు తెరిచి చూశాడు అప్పుడే ధ్యానంలో నుంచి లేచిన రత్నాకరుడు. ఎదురుగా తనశిష్యులు కృష్ణశర్మ, నారాయణభట్టు నమస్కరిస్తూ నుంచుని ఉన్నారు. చాలాకాలం తరువాత కనిపించిన శిష్యులను వాత్సల్యంతో పలకరించాడు రత్నాకరుడు. కుశల ప్రశ్నలు పూర్తయినాయి. శిష్యులిద్దరూ గురుదేవుని పాదాల దగ్గర ఆశీనులైనారు. కొంతసేపటికి వచ్చిన పని ఏమిటి ? అని అడిగాడు రత్నాకరుడు.

గురుదేవా ! మీ దగ్గర మేము అనేక విషయాలను తెలుసుకున్నాము. యోగినీ హృదయము, కామకలా విలాసము, సుభగోదయస్తుతి వంటి శ్రీవిద్యా సంబంధమైన గ్రంథాలకు వ్యాఖ్య, శ్రీచక్రము, పంచదశీ మహామంత్రము వంటి మంత్రశాస్త్రాలు. లలితా సహస్ర నామాలకు, విష్ణు సహస్రనామాలకు, దేవీ సప్తశతికి భాష్యము, దేవీ భాగవతము, శివపురాణమువంటి గ్రంథాలు, దశోపనిషత్తులు కూడా కూలంకషంగా చెప్పుకున్నాము. అంతేకాదు దశోపనిషత్తులమీద 12 గం॥ పాటు సి.డి.గా ఇచ్చిన మీ ప్రవచనాలను ప్రతిరోజూ వింటూ ఉంటాము. లలితా సహస్ర నామాలకు భాష్యాన్ని 24 గంటలపాటు ప్రవచనాలు చెప్పి, వాటిని సి.డిలుగా అందించిన మీ ప్రక్రియ మహాద్భుతమైనది. తెలుగువారికి మీరు చేసిన మహోపకారమది. మీరు అంతటి మహానుభావులు. అటువంటి మీరు గతంలో అనేకసార్లు "ఆత్మసాక్షాత్కారము పొందినవాడికి కైవల్యము ప్రాప్తిస్తుంది." అని చెప్పారు. ఇప్పుడు మేము **ఆత్మసాక్షాత్కారాన్ని** గురించి తెలుసుకోవటానికి మీ దగ్గరకు వచ్చాము" అన్నారు.

ఆ మాటలు విన్న రత్నాకరుడు చిరునవ్వుతో తలపైకెత్తి వారి కళ్ళలోకి సూటిగా చూస్తూ, "నాయనలారా ! ఇప్పటికైనా మీకు ఆ కోరిక కలిగినందుకు చాలా సంతోషంగా ఉంది. మీ కోరిక తప్పక తీరుస్తాను.

వేదాలలో ఆఖరి భాగము ఉపనిషత్తు. నాలుగు వేదాలకు కలిపి 1180 ఉపనిషత్తులు ఉన్నాయి. వీటిలో 108 ఉపనిషత్తులు ముఖ్యమైనవి. వాటిలో వేదాంతోపనిషత్తులు 24. ప్రతి ఉపనిషత్తులోనూ పరమేశ్వర తత్త్వమే చెప్పినప్పటికీ, వేదాంతోపనిషత్తులు పూర్తిగా పరబ్రహ్మతత్త్వాన్ని, ఆత్మసాక్షాత్కారాన్ని వివరించాయి. అందుచేత వేదాంతోపనిషత్తుల ఆధారంగా మీకు ఆత్మసాక్షాత్కారాన్ని వివరిస్తాను" అంటూ చెప్పటం మొదలుపెట్టాడు.

ముందుగా నా గురుదేవులు విరజానంద, సదానంద, శుకానంద నాథులకు నమస్కరించి, ధర్మసంస్థాపన కోసం ఏర్పాటు చేయబడ్డ శృంగేరీ, పూరి, బదరీ, ద్వారకా పీఠాధిపతులకు సాష్టాంగ ప్రణామాలర్పించి, పుష్పగిరి, కుర్తాళం పీఠాధిపతులకు వందనాలర్పించి, గన్నవరం భువనేశ్వరీ పీఠాధిపతులకు, గుంటూరు శ్రీవిరూపాక్ష పీఠాధిపతులకు నమోవాకములర్పించి, అవధూత దత్తపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారికి నమస్కరించి, పెదపులిపాక లలితా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వాసుదేవానందగిరిస్వామి వారికి, మాతా శివచైతన్యవారికి వందనాలర్పించి **పరమానందనాథ** దీక్షానామం గల హరితస గోత్రీకుడనైన **క్రోవి పార్థసారథి** అను నేను **"ఆత్మసాక్షాత్కారము"** అనే ఈ గ్రంథాన్ని సులభశైలిలో వ్రాసి అవధూత, దత్తపీఠాధిపతి **శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారికి అంకితం చేస్తున్నాను.** పండితులు, ముముక్షువులు నా ఈ సాహసాన్ని మన్నించి నన్ను ఆశీర్వదింతురుగాక.

2. సృష్టి

(నారాయణోపనిషత్తు, అధర్వశిరోపనిషత్తు, లలితారహస్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు, సుబాలోపనిషత్తు, మహోపనిషత్తు, ఐతరేయోపనిషత్తు, పైంగలోపనిషత్తు, పురుషసూక్తము)

"గురువుగారూ ! అసలు ఈ జగత్తులో సృష్టి ఎలా జరిగిందో వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. ఆ మాటలు విన్న రత్నాకరుడు కొద్దిసేపు మౌనం వహించి తరువాత చెప్పటం ప్రారంభించాడు.

జగత్తులో సృష్టి ఎలా జరిగింది ? అనే విషయం మీద భిన్నమైన వాదనలు ఉన్నాయి. వివిధ రకాల ఉపనిషత్తులలో కూడా ఈ విషయాలే చెప్పబడ్డాయి. మనకు ఉన్నటువంటి దేవతలలో ప్రధానమైనవారు ఐదుగురు 1. ఆదిత్యుడు 2. అంబిక

3. గణపతి 4. విష్ణువు 5. శివుడు. వీరినే పంచాయతనము అంటారు. వీరిలో ఏ దేవతను ఆరాధించేవారు ఆ దేవతనే పరమేశ్వర స్వరూపంగా అభివర్ణించారు. ఆ దేవతయే సృష్టికి మూలకారణము అన్నారు. ఉదాహరణకు **నారాయణోపనిషత్తు**ను చూద్దాం. వైష్ణవులకు ఇది ప్రధానమైన ఉపనిషత్తు. వారి అధిదేవత శ్రీమన్నారాయణుడు లేదా శ్రీమహావిష్ణువు. నారాయణోపనిషత్తులో "సృష్టి ప్రారంభంలో ఉన్నవాడు పరమపురుషుడైన నారాయణుడొక్కడే. అతడు సృష్టిచెయ్యాలి అనుకున్నాడు. అప్పుడు శ్రీమన్నారాయణుని శరీరంనుంచి సూక్ష్మరూపి అయిన హిరణ్యగర్భుడు ఉదయించాడు. ఆ తరువాత తన్మాత్రలు, పంచభూతాలు పుట్టినాయి. ఈ రకంగా నారాయణుని శరీరంనుంచి బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, మరీచి, కశ్యపుడు ఇతర ప్రజాపతులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, సకల వేదాలు ఆవిర్భవించినాయి. చరాచర జగత్తంతా శ్రీమన్నారాయణుని నుంచే ఆవిర్భవించింది. ఇవన్నీ నారాయణునిలోనే ఉన్నాయి. చివరకు నారాయణుని యందే లయమవుతున్నాయి. నారాయణుడే సత్యము నిత్యము అయినవాడు. నారాయణుడే బ్రహ్మ. నారాయణుడే శివుడు. అతడే ఇంద్రుడు, భూమి, ఆకాశము, కాలము, దశ దిశలు అంతా నారాయణుడే. పైభాగాన ఉన్నది, క్రింది భాగాన ఉన్నది, మధ్యభాగాన ఉన్నదీ నారాయణుడే. బాహ్యాభ్యంతరముల యందంతటా నారాయణుడే. భూత భవిష్యద్వర్తమానాలు నారాయణుడే." అని చెప్పబడింది. అంటే చరాచర జగత్తంతా శ్రీమన్నారాయణునుంచే ఆవిర్భవించింది. ఈ జగత్తు అంతా నారాయణ స్వరూపమే.

అయితే వైష్ణవంలో సృష్టివిధానం ఈ రకంగా కూడా చెప్పబడింది. జగత్తుయొక్క సృష్టి స్థితి లయాలను చూసేది శ్రీమన్నారాయణుడు. ఈయన ఇరవై ఐదు తత్త్వములు గల పురుషుడని వేదాలు కీర్తిస్తున్నాయి. ఇతడు ఆద్యంతములు లేని పురుషోత్తముడు ఈయన కనులు తెరిస్తే పగలు అదే సృష్టి. కనులు మూస్తే రాత్రి (ప్రళయము) ఇదే కల్పము. ఈయన అనంతుడు. ఈయనకు రూపంలేదు. కాళ్ళు చేతులు మొదలైన అంగాలు లేవు. శరీరం లేదు. ఆయన సర్వాన్నీ ఆవరించి ఉన్నాడు. అన్ని ఇంద్రియాల గుణాలను ప్రకాశింపచేస్తున్నాడు. ఇతడే ముక్తి ప్రదాత. అతనివల్లనే సర్వము సంభవిస్తున్నది. ఆ పురుషుని నుండే హిరణ్యగర్భుడు జన్మించాడు. దానినుండి ఆకాశము, వాయువు, తేజస్సు, జలము ఆవిర్భవించినాయి. జలము నుండి ఒక

అండము పుట్టింది. అది హిరణ్మయము. ఈ హిరణ్మయమైన అండమే ప్రజాపతి అని వేదాలు చెబుతున్నాయి. పరమేశ్వరుడు ఈ అండాన్ని రెండు భాగాలుగా చేశాడు. ఇందులో పైభాగము ఆకాశము కాగా క్రింది భాగము రసాతలము. ఈ అండము నుంచి వచ్చిన మావిజలమునందు పడి భూమి ఏర్పడింది. ఆ భూమిమీద అనేకవేల యోజనాల విస్తీర్ణముగల పర్వతాలు, కొండలు, పెద్దపెద్ద చెట్లు అన్నీ ఉన్నాయి. ఆ బరువును మోయలేక భూమినీటిలో మునిగిపోయింది. అలా మునిగిపోతూ తనను రక్షించమని శ్రీహరిని ప్రార్థించింది. అప్పుడు శ్రీహరి ఆదివరాహమై తన కోరలమీద మోసి ఈ భూమిని రక్షించాడు. ఈ రకంగా శ్రీమహావిష్ణువు వల్లనే ఈ సృష్టి జరిగింది. అని చెప్పబడింది.

త్రిమూర్తులలో మూడవవాడైన రుద్రుని పరమేశ్వర స్వరూపంగా (ఇతడే శివుడు) ఆరాధించేవారికి ముఖ్యమైనది **అధర్వశిరోపనిషత్తు** అందులో దేవతలంతా రుద్రుడు నివసించే స్వర్గలోకానికి వెళ్ళి "దేవా ! నీవెవరవు ?" అని అడుగుతారు. దానికి రుద్రుడు "ఈ సృష్టికి ముందు నేను ఒక్కడనే ఉన్నాను. ఇప్పుడున్నాను భవిష్యత్తులోనూ ఉంటాను. నాకన్న వేరైనవారు లేరు. త్రికాలాతీతుడను, నిత్యానిత్యుడను నేనే, బ్రహ్మమును నేనే, చక్షురాది ఇంద్రియాలు నేనే. శ్రోత్రాది ఇంద్రియాలు నేనే. ఊర్ధ్వదిక్కు, అథోదిక్కు, దశదిశలు, విదిశలు నేనే. స్త్రీ, పురుషుడు, నపుంసకుడు నేనే. గాయత్రి నేనే, సావిత్రినేనే, త్రిష్టప్, జగతీ, అనుష్టప్ మొదలైన ఛందస్సులు నేనే. గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని నేనే. గోవు నేనే, గౌరీదేవి నేనే, జ్యేష్ఠుడను, శ్రేష్ఠుడను కూడా నేనే. అధికుడను నేనే. జలమునేనే, తేజస్సు నేనే, చతుర్వేదాలు నేనే. ఓంకారము నేనే. పుష్కరము నేనే. పవిత్రము నేనే, అగ్రభాగము, మధ్యభాగము, అథోభాగము నేనే, దశదిశలలో ఉన్నది, లేనిది కూడా నేనే. జ్యోతిరూపుడను నేనే. నేను జగత్తంతా ఆవరించి ఉన్నాను. నేను సర్వవ్యాపిని, సర్వరూపిని చరాచర జగత్తంతా నాచేతనే సృష్టించబడింది." అంటాడు.

శాక్తేయులంతా ఆ పరమేశ్వరిని ఆరాధిస్తారు. పరమేశ్వరిని గురించి వివరించేవి ఎనిమిది ఉపనిషత్తులున్నాయి. అందులో **బహ్వృచోపనిషత్తు** ఒకటి. దానిలో ఈ సృష్టి ప్రారంభానికి ముందు ఆ పరమేశ్వరి ఒక్కతేఉండేది. ఆమెయే ఈ జగత్తును సృష్టించింది. ఆమెయే కామకళ శృంగారకళ. ఆమెనుండి ముందుగా బ్రహ్మ

ఉద్భవించాడు. ఆ తరువాత విష్ణువు, రుద్రుడు, మరుద్గణాలు, గంధర్వులు, అప్సరసలు, కిన్నెరలు, భోగ్యము ఈ రకంగా అన్నీ ఉద్భవించినాయి. అండజాలు, స్వేదజాలు, ఉద్భిజాలు, స్థావరములు, జంగమములు, పశువులు, పక్షులు, జంతువులు, మృగాలు, జలచరాలు, చెట్లు, చేమలు చివరకు మానవులు పుట్టారు. ఆమెయే పరాశక్తి. శాంభవి. కాదివిద్య, హాదివిద్య, ఆమెయే త్రిపురసుందరి అని చెప్పబడింది.

శాక్తేయంలో ఇంకొక విషయంకూడా ఉన్నది. నిరాకారుడు నిర్గుణ స్వరూపుడు పరబ్రహ్మ. ఇతడు బిందు రూపంలో ఉన్నాడు. ప్రళయం జరిగినప్పుడు కర్మక్షయం అయిన జీవులు ముక్తిని పొందుతాయి. కర్మక్షయం కాని జీవులు తమ తమ కర్మలను తమతో మూటకట్టుకుని మాయలో కలిసిపోతాయి. ఆ మాయ వచ్చి పరమేశ్వరునిలో చేరుతుంది. ఇప్పుడు కర్మక్షయం కాకుండా తనలో ఇమిడిఉన్న జీవరాశికి మోక్షం కలిగించాలనే ఉద్దేశ్యంతో ఆ పరమేశ్వరుడు సృష్టి చెయ్యాలని సంకల్పించాడు. ఆ స్థితిలో అతని నుంచి కొంత శక్తి బయటకు వచ్చింది. అదే శక్తి. ఈ శక్తికీ శివుడికీ భేదంలేదు. రెండూ ఒకటే. ఈ శక్తి త్రికోణాకారంలో ఉన్నది. ఇదే మాయ. అవ్యక్తము. దీనినుంచి మహత్తత్త్వము, అహంకారము తన్మాత్రలు, వాటినుంచి పంచభూతాలు పుట్టినాయి. ఈ పంచభూతాలు, తన్మాత్రలు పంచీకరణం చెందటంవల్ల పదిహేను భాగాలుగా అయినాయి. వీటినుంచే జీవరాశి ఆవిర్భవించింది. ఇది రూపాత్మకమైన జగత్తు. ఇక నామాత్మకమైన జగత్తును చూద్దాం. ముందుగా ఓంకారము పుట్టింది. దానినుంచి అకార ఉకార, మకారాలు పుట్టాయి. వాటినుంచి అక్షర సమామ్నాయము వచ్చింది. దానినుంచి పదాలు, మాటలు, వాక్యాలు, మంత్రాలు, వేదాలు, శాస్త్రాలు, సంగీతము, సాహిత్యము అన్నీ ఆవిర్భవించాయి. ఈ రకంగా నామరూపాత్మకమైన జగత్తు ఏర్పడింది. **'లలితారహస్యోపనిషత్తు'**లో సృష్టి అంతా ఆమెచేతనే చేయబడింది. అని చెప్పటం జరిగింది.

ఇలాకాదు. గుణత్రయ విభాగం చేత సృష్టి ఏర్పడింది. అని కొందరివాదన. గుణాలు మూడు. అవి సత్త్వగుణము, రజోగుణము, తమోగుణము. సృష్టి మూడు రకాలుగా జరిగింది. 1. ఏకగుణ సృష్టి 2. ద్విగుణసృష్టి 3. త్రిగుణసృష్టి

1. ఏకగుణసృష్టి : ఇందులో ఒకే గుణముంటుంది.

సత్త్వగుణంవల్ల – బ్రహ్మాదిదేవతలు

రజోగుణంవల్ల – మానవులు, మృగాలు, పశుపక్ష్యాదులు, జలచరాలు

తమోగుణంవల్ల – చెట్లు, చేమలు, పర్వతాలు

మొదలైనవి ఆవిర్భవించాయి. ఇది ఏకగుణసృష్టి.

2. ద్విగుణసృష్టి : ఇందులో ప్రతిగుణము మళ్ళీ మూడుభాగాలు అవుతుంది. దానినుంచి ప్రాణికోటి ఆవిర్భవించింది.

1. సత్త్వసత్త్వము నుంచి – విరాట్పురుషాదులు
2. సత్త్వరజమునుంచి – దేవపురుషులు, వాలఖిల్యులు, వైఖానసులు
3. సత్త్వతమస్సు నుంచి – యక్షులు, రాక్షసులు, విద్యాధరులు
4. రజస్సత్త్వము – మానవులు
5. రజోరజము – పశువులు మృగాలు
6. రజోతమము – స్వేదజాలు, అండజాలు, జలచరాలు
7. తమోసత్త్వము – పైరులు, గడ్డిపంటలు మొ॥
8. తమోరజస్సు – చెట్లు, పొదలు, తీగెలు
9. తమోతమము – భూములు, కొండలు, బండలు

త్రిగుణసృష్టి : ఇందులో ప్రతిగుణంలోనూ మూడు భాగాలుంటాయి అవి మళ్ళీ ఒక్కొక్కటి మూడు భాగాలవుతాయి. ఈ రకంగా మొత్తం 27 భాగాలవుతాయి. వీటివల్లనే ఈ జగత్తంతా సృష్టించబడింది.

1. సత్త్వంలో తమోతమము – శేషుడు, వాసుకి మొ॥వారు
2. సత్త్వంలో తమోరజము – దేవతలు, అంగిరసుడు మొ॥వారు
3. సత్త్వంలో తమోసత్త్వము – కర్మదేవతలు, నవగ్రహాలు
4. సత్త్వంలో రజోతమము – సిద్ధులు, సాధ్యులు
5. సత్త్వంలో రజోరజము – సప్తఋషులు, శుకవామదేవాదులు

6. సత్త్వంలో రజోసత్త్వము – దిక్పాలకులు, పంచబ్రహ్మలు
7. సత్త్వంలో సత్త్వతమస్సు – విరాట్టు, హిరణ్యగర్భుడు
8. సత్త్వంలో సత్త్వరజస్సు – సూత్రాత్మ, నిర్వికల్ప సమాధి నిష్ఠులు
9. సత్త్వంలో సత్త్వసత్త్వము – సర్వజ్ఞత్వము, సర్వేశ్వరత్వము, సర్వాంతర్యామిత్వము
10. రజంలో తమోతమము – కందిరీగలు, తేళ్ళు, పాములు, చీమలు
11. రజంలో తమోరజము – మొసళ్ళు, పీతలు, నత్తలు
12. రజంలో తమోసత్త్వము – కాకులు, పిచ్చుకలు, చిలకలు, గోరువంకలు
13. రజంలో రజోతమము – సింహాలు, పులులు, ఎలుగుబంట్లు
14. రజంలో రజోరజము – ఏనుగులు, గుర్రాలు, కోతులు, మేకలు
15. రజంలో రజోసత్త్వము – కర్రిఆవులు, చమరీమృగాలు, జింకలు, దుప్పులు
16. రజంలో సత్త్వతమము – శూద్రులు, మంగలి, మాల, చాకిలి
17. రజంలో సత్త్వరజము – పుణ్యకర్మలు, దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసే పాలకులు
18. రజంలో సత్త్వసత్త్వము – బ్రహ్మవాదులు, వేదవిదులు, దశవిధ బ్రాహ్మణులు ★
19. తమంలో తమోతమం – కొండలు, బండలు, ముళ్ళచెట్లు నిర్జన ప్రదేశాలు, చవిటినేలలు
20. తమంలో తమోరజము – మంచి పంటలు పండే నేలలు, తపస్సు యజ్ఞము చేసే ప్రాంతాలు, దేవబ్రాహ్మణ నివాసాలు
21. తమంలో తమోసత్త్వము – పుణ్యక్షేత్రాలు, పుణ్యనదులు
22. తమంలో రజోతమము – ముష్టి, వేము, బలురక్కసి, నాగజెముడు, తాడి, ఈత
23. తమంలో రజోరజము – నిమ్మ, దానిమ్మ, బత్తాయి, మర్రి, జమ్మి

24. తమంలో రజోసత్త్వము – అరటి, పనస, మామిడి, వెలగ, పద్మ, కలువ, పారిజాతాదులు

25. తమంలో సత్త్వతమము – ఉలవ, జొన్న, అరిగ ధాన్యాలు

26. తమంలో సత్త్వరజము – కంది, మినుము, నువ్వు, నల్లవరి

27. తమంలో సత్త్వసత్త్వము – తెల్లవరి, సన్నవరి, చెరకు, పెసర

★ దశవిధ బ్రాహ్మణులు అంటే – వేదవిద్యా సంపన్నులు, ఆచారవంతులు అయిన 1. ఆంధ్ర, 2. కర్నాటక, 3. ద్రావిడ, 4. ఘూర్జర, 5. మహారాష్ట్రులు వీరు పంచ ద్రావిడులు. 1. ఉత్కల, 2. మైథిల, 3. గౌడ, 4. కన్యాకుబ్జ, 5. సారస్వతులు. వీరు పంచగౌడులు. వీరందరూ కలిసి దశవిధ బ్రాహ్మణులు.

ఈ విధంగా గుణత్రయ విభాగంచేత సృష్టి జరుగుతున్నది.

బృహదారణ్యకోపనిషత్తులో సృష్టిని గురించి చెబుతూ

ఈ సృష్టికి పూర్వం మానవాకారంలో ఉన్న విరాడాత్మ మాత్రమే ఉండేది. అతనికన్న భిన్నమైనదేదీ లేదు. సర్వాత్మ భావంతో తనను మాత్రమే చూసుకుని అంతటా నేనే అనుకున్నాడు.

పురుషాకారంలో ఉన్న ప్రజాపతి తాను ఒక్కడే అయి ఉండి కూడా భయభ్రాంతుడైనాడు. ఒంటరిగా ఉన్న ప్రజాపతి ఒంటరితనంలోని ఆనందాన్ని అనుభవించలేక స్త్రీని కోరాడు. అలా కోరిన వెంటనే సౌందర్యవతి అయిన స్త్రీ ప్రత్యక్షమైంది. అంటే తన శరీరంలోని కొంతభాగం నుంచే స్త్రీని సృష్టించాడన్నమాట. ఆ భాగాలే పతి పత్ని. అందుచేతనే లౌకిక శరీరం ధాన్యపుగింజలోని బద్దలాంటిది. రెండు దళాలు లేదా బద్దలు స్త్రీ పురుషులకు ప్రతిరూపాలు.

ప్రజాపతివల్ల కలిగిన స్త్రీ పేరు శతరూప. అనగా అనేకరూపాలు గలది అని అర్థం. ఆ ప్రజాపతే స్వాయంభువమనువు. కుమార్తెలతో రమించటం నిషేధం కదా. మరి తననుండి పుట్టిన నాతో ఏ విధంగా రమిస్తాడు. అని ఆలోచించి శతరూప ఆవుగా మారిపోయింది. పురుషుడు ఆ బోతు అయినాడు. గోసంతతి వృద్ధి చెందింది. శతరూప ఆడుగుర్రము అయింది. పురుషుడు మగగుర్రం అయినాడు. అశ్వసంతతి పెరిగింది. శతరూప ఆడుగాడిద అయ్యింది. పురుషుడు మగగాడిద

అయినాడు. గార్ధభ సంతతి వర్ధిల్లింది. ఈ రకంగా ఆ స్త్రీ 84 లక్షల రూపాలు ధరించింది. పురుషుడు కూడా అన్ని రూపాలు ధరించాడు. జగత్తులో 84 లక్షల రకాలయిన జీవరాశి వృద్ధి చెందింది. అందుచేతనే సృష్టి అనేది ప్రజాపతికి మారుపేరయింది.

సృష్టిని గురించిన మరొక విషయం కూడా బాగా ప్రచారంలో ఉంది. సృష్టి చెయ్యటం కోసం బ్రహ్మ కొంతమందిని సృష్టించాడు. వారినే బ్రహ్మ మానసపుత్రులు అంటారు. వారిలో బ్రహ్మయొక్క కుడిచేతి బ్రొటనవేలు నుంచి పుట్టినవాడు దక్షుడు. ఎడమచేతి బ్రొటనవ్రేలు నుంచి పుట్టినది, వీరిణి అనే కన్య. దక్ష ప్రజాపతి వీరిణిని వివాహం చేసుకున్నాడు. వీరికి యాభైమంది కుమార్తెలు కలిగారు. వారిలో అదితి, దితి, దనువు, కాల, అనాయువు, సింహిక, క్రోధ, పృథ, విశ్వ, వినత, కద్రువ, కపిల అనే పన్నెండు మందిని మరీచి కుమారుడైన కశ్యపుడు వివాహం చేసుకున్నాడు. వీరిలో అదితివల్ల దేవతలు, దితివల్ల దైత్యులు, దనువు వల్ల దానవులు, వినతవల్ల పక్షులు, కద్రువ వల్ల పాములు. ఈ రకంగా వివిధ రకాల జీవరాసి ఆవిర్భవించింది.

సుబాలోపనిషత్తులో సృష్టికి పూర్వం ఈ జగత్తంతా పరమేశ్వరమయంగా ఉండేది. ఆ పరమేశ్వరుని నుంచి ముందుగా తమస్సు పుట్టింది. తమస్సు నుండి తన్మాత్రలు, వాటినుండి పంచభూతాలు పుట్టినాయి. అది ఒకగ్రుడ్డుగా అయింది. పన్నెండు నెలల తరువాత పరమేశ్వరుడు ఆ గ్రుడ్డును రెండుగా చేశాడు. దానిలోని క్రింది భాగము భూమి, పైభాగము ఆకాశము అయింది. మధ్యభాగంలో దివ్యపురుషుడు, సహస్రశీర్షుడు, వేయికనులు, వేయిపాదాలు, వేయిచేతులు, గలవాడున్నాడు అతడే బ్రహ్మ. అతడు ముందుగా మృత్యువును సృష్టించాడు. అది మూడు అక్షరములు, మూడు శిరస్సులు గలది. ఆ తరువాత అతడు ఏడుగురు మానస పుత్రులను సృష్టించాడు. వీరు విరాట్టులు. ఏడుగురు ప్రజాపతులను సృష్టించాడు. ఆ పరమ పురుషుడైన బ్రహ్మ ముఖము నుండి బ్రాహ్మణులు, బాహువుల నుంచి క్షత్రియులు, ఊరువుల నుంచి వైశ్యులు, పాదముల నుంచి శూద్రులు, మనసు నుంచి చంద్రుడు, కనుల నుంచి సూర్యుడు, చెవుల నుంచి వాయువు, హృదయము నుండి సర్వజగత్తు పుట్టినాయి.

అపానము నుండి నిషాదులు, ఎముకల నుండి యక్షులు, రాక్షసులు, గంధర్వులు, రోమముల నుండి - పర్వతాలు, లలాటమునుండి - ఓషధులు, వనస్పతులు, క్రోధము నుండి - రుద్రుడు పుట్టారు. ఈ మహాభూతముయొక్క నిట్టూర్పునుండి - నాలుగు వేదాలు, శిక్ష, కల్పము, వ్యాకరణము, జ్యోతిషము, నిరుక్తము, ఛందస్సు, తర్కము, మీమాంస, ధర్మసూత్రాలు, వ్యాఖ్యానాలు, ఉపవ్యాఖ్యానాలు, సర్వభూతములు వచ్చినాయి. అని చెప్పబడింది.

మహోపనిషత్తులో ఆ పరమ పురుషుని నుండి 14 మంది పురుషులు, ఒక కన్య జన్మించారు. తరువాత జ్ఞానేంద్రియాలు 5, కర్మేంద్రియాలు 5. మనస్సు. మొత్తం పదకొండు ఇంద్రియాలు ఆవిర్భవించాయి. 12. అహంకారము, 13. ప్రాణము, 14. దేహము, 15. బుద్ధి 16. తన్మాత్రలు ఐదు. పంచభూతాలు ఐదు. ఉద్భవించినాయి. ఈ రకంగా 25 తత్త్వములతో నిండిన విరాట్ పురుషుడు జన్మించాడు. ఈ సృష్టిలో పరమాత్మ అధిష్ఠాన రూపంలో ప్రవేశించాడు. 25 తత్త్వాలతో ఉన్న ఆ విరాట్పురుషుని నుండి ప్రధాన సంవత్సరాలు కాలస్వరూపంలో పుట్టినాయి. ఆ తరువాత పరమపురుషుడు ఇంకొక సంకల్పముతో హృదయంలో ధ్యానంచేశాడు. ధ్యానంలో ఉన్న అతని లలాటము నుంచి త్రినేత్రుడు, త్రిశూలపాణి అయిన పురుషుడు జన్మించాడు. తేజోవంతుడైన ఆ పురుషుని యందు యశస్సు, సత్యము, బ్రహ్మచర్యము, తపస్సు, వైరాగ్యము, మనస్సు, ఐశ్వర్యము, ప్రణవసహిత వ్యాహృతులు, చతుర్వేదాలు, సకల ఛందస్సులు ఇవన్నీ ప్రకాశిస్తున్నాయి. అందుచేత ఇతడు ఈశానుడు, మహాదేవుడు అనబడ్డాడు.

తరువాత మరి ఒక సంకల్పంతో పరమపురుషుడు మళ్ళీ ధ్యానం చేశాడు. ధ్యానంలో ఉన్న అతని లలాటము నుంచి శ్వేదము పుట్టిది. ఆ శ్వేదమే సర్వత్రా వ్యాపించి జలమయింది. ఈ ఉదకము నుండి బంగారుకాంతి గల అండము ఒకటి పుట్టింది. దానినుండి చతుర్ముఖబ్రహ్మ పుట్టాడు. ఈ బ్రహ్మ తూర్పు దిక్కుకు తిరిగి ధ్యానం చేశాడు. అప్పుడు భూః అనే వ్యాహృతి, గాయత్రీ ఛందస్సు, ఋగ్వేదము, అగ్నిదేవత ఆవిర్భవించాయి. బ్రహ్మ పశ్చిమ దిక్కుగా తిరిగి ధ్యానం చేశాడు. అప్పుడు భువః అనే వ్యాహృతి, త్రిష్టుప్ ఛందస్సు, యజుర్వేదము, వాయుదేవత ఆవిర్భవించాయి. తరువాత బ్రహ్మ ఉత్తర దిక్కుగా తిరిగి ధ్యానం చేశాడు. అప్పుడు సువః అనే

వ్యాహృతి, జగతీ ఛందస్సు, సామవేదము, సూర్యుడు ఆవిర్భవించారు. తరువాత బ్రహ్మ దక్షిణ దిక్కుగా తిరిగి ధ్యానం చేశాడు. అప్పుడు మహః అనే వ్యాహృతి, అనుష్టుప్ ఛందస్సు, అథర్వణవేదము, సోమదేవత ప్రభవించినాయి. ఆ తరువాత బ్రహ్మ మళ్ళీ మళ్ళీ ధ్యానం చేసి క్షీరసాగర మధ్యంలో ఒక దేవుని దర్శించాడు. ఆ దేవత వేయితలలతోను, వేలకనులతోను ప్రకాశిస్తున్నాడు. విశ్వకళ్యాణ కారకమై, విశ్వాతీతమై, నిత్యమై విలసిల్లుతున్నాడు. అతడు సర్వరూపి. సర్వవ్యాపి. అతడే పరమేశ్వరుడు. నారములయందుంటాడు కాబట్టి శ్రీమన్నారాయణుడు. ఈ చరాచర జగత్తూ అతనినుండే ఆవిర్భవించింది. ఈ జగత్తుకు ఆధారమైనవాడు అతడే.

ఐతరేయోపనిషత్తులో సృష్టిని గురించి వివరించటం జరిగింది. సృష్టికి పూర్వం జగత్తంతా బ్రహ్మమయంగానే ఉండేది. దానికి భిన్నమైన పదార్థం ఏదీలేదు. దాన్నే ఆత్మ అంటారు. ఈ ఆత్మలోకాలను సృష్టించాలనుకొన్నది. మరీచి, ఆపః, మర అనే పేర్లు గల లోకాలను సృష్టించింది. ద్యులోకానికి ఆవల ఉన్నది అంభస్సు. దానికి ఆశ్రయము స్వర్గము. అదే సువర్లోకము. దానిక్రింద భువర్లోకము. దాని క్రింద భూలోకము ఉన్నాయి. ఈ భూలోకము మరణము గుణముగా గలది. ఇక్కడ పుట్టిన ప్రతిప్రాణీ మరణిస్తుంది. భూలోకానికి క్రింద జలలోకమున్నది. అది క్రిందఉన్న లోకాలచేత పొందబడుచున్నది. ఈ లోకాలన్నీ పంచభూతాలచే నిర్మించబడ్డాయి.

లోకాలను సృష్టించిన తరువాత 'ఈ లోకాలను రక్షించేవాళ్ళు లేకపోతే అవి నాశనమై పోతాయి. కాబట్టి లోకపాలకులను సృష్టించాలి' అని ఆలోచించి పంచభూతాలలోను ప్రధానమైనదైన జలాన్ని తీసుకుని దానితో అవయవాలుగల ఒక మానవాకారాన్ని సృష్టించింది. ఆ ఆకారమే విరాట్స్వరూపము. ఇక ఇంద్రియాధిష్ఠాన దేవతల సృష్టి.

పరమాత్మ ఈ విరాట్స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని తీవ్రమైన ఆలోచన చేశాడు. అదే తపస్సు, దాని ఫలితంగా విరాట్స్వరూపానికి నోరు వచ్చింది. ఆ నోటి నుండి మాట, మాట నుండి వాణికి అభిమాన దేవత అయిన అగ్ని ఉత్పన్నమైనాయి. తరువాత ముక్కు రంధ్రాలు వచ్చాయి. వాటినుండి ప్రాణం ఉత్పన్నమైంది. అనగా వాసన చూసే శక్తి పుట్టింది. ఆ ఘ్రాణశక్తి నుండి వాయువు పుట్టింది. తరువాత నేత్రాలు వచ్చాయి. వాటినుండి సూర్యుడు ఉద్భవించాడు.

తరువాత చెవులు ఏర్పడ్డాయి. వాటి నుండి దిక్కులు వచ్చాయి. తరువాత చర్మము దాని నుండి స్పర్శకు కారణమైన రోమాలు ఏర్పడ్డాయి. చర్మము నుండే ఓషధులు వనస్పతులు ఏర్పడ్డాయి. తరువాత హృదయము దానినుండి మనస్సు, దాని నుండి చంద్రుడు పుట్టారు. తరువాత నాభి, దాని నుండి అపానము, దాని నుండి మృత్యువు ఉద్భవించాయి. తరువాత పురుష జననేంద్రియము, దాని నుంచి వీర్యము, దానికి అధిష్ఠానమైన జలము పుట్టాయి. ఈ రకంగా విరాట్స్వరూపుని అవయవాల నుండి ఇంద్రియాలు, వాటి అభిమానదేవతలు పుట్టారు.

పరమేశ్వరునిచే లోకపాలకులుగా సృష్టించబడ్డ అగ్ని మొదలైన ఇంద్రియాభిమాన దేవతలు అవిద్యతో కూడిన మహాసముద్రంలో పడ్డారు. దానికి అంతం లేదు. అది ఇంద్రియాలవల్ల కలిగే క్షణిక సుఖాలతో కూడినది.

పరమేశ్వరుడు ఆ విరాట్స్వరూపానికి ఆకలి దప్పికలు కలిగేలా చేశాడు. అప్పుడు దేవతలందరూ మేము కూర్చుని భుజించేందుకు వీలుగా, మాకు తగిన స్థానాన్ని ప్రసాదించమని వేడుకున్నారు. ఆకలి తీరాలంటే ఆహారం కావాలి. అన్ని ఇంద్రియాలకు ఆహారం అన్నమేకాదు. వాటి ఆహారము వేరుగా ఉంటుంది.

అప్పుడు దేవతలకోసం పరమేశ్వరుడు ఆవును సృష్టించాడు. దేవతలు ఇది మాకు సరిపోదు అన్నారు. గుర్రాన్ని సృష్టించాడు. అది చాలదన్నారు. అప్పుడు విరాట్స్వరూపాన్ని పోలిన పురుషుడినే సృష్టించాడు. దాన్ని చూసిన దేవతలు ఇది చాలా బాగుంది అని సంతసించారు. పరమేశ్వరుని ఆజ్ఞానుసారం ఇంద్రియాది దేవతలంతా వారివారి స్థానాల్లో ప్రవేశించారు. అంటే అగ్ని వాగ్రూపం ధరించి పురుషుని నోటిలో ప్రవేశించింది. వాయువు ప్రాణరూపం ధరించి ముక్కులో ప్రవేశించింది. సూర్యుడు దృష్టిరూపంలో నేత్రాలలోను, దిక్కులు చెవులయందు, ఓషధులు, వనస్పతులు చర్మమునందు, చంద్రుడు మనోరూపం ధరించి హృదయమందు, మృత్యువు అపానరూపం దాల్చి నాభియందు, జలం వీర్యరూపం దాల్చి జననేంద్రియమందు ప్రవేశించాయి. ఈ రకంగా దేవతలంతా వెళ్ళిపోగా ఇంకమిగిలినవి ఆకలి దప్పికలు. వీరిద్దరినీ పరమేశ్వరుడు దేవతలందరిలోనూ భాగస్వాములుగా చేశాడు. దీనివల్ల ఏ దేవతకు హవిస్సు ఇచ్చినా, దానిలో ఆకలి

దప్పికలకు కూడా భాగం కలుగుతుంది. కంటికి ఆకలి దప్పిక అంటే చూడాలనే కోరిక. చెవులకు వినాలనే కోరిక.

ఈ రకంగా ఇంద్రియాలను వాటి అధిష్ఠాన దేవతలను సృష్టించిన తరువాత అన్నాన్ని సృష్టించవలసి వచ్చింది. అప్పుడు జలం నుంచి ఆహారం సృష్టించాడు. అదే అన్నము.

ఇప్పుడు పరమేశ్వరుడు ఇంద్రియాలతోకూడిన మానవశరీరంలో ప్రవేశించాలనుకున్నాడు. దానికి రెండు మార్గాలున్నాయి. 1. పాదాల చివర నుంచి అంటే క్రింది నుంచి, 2. శిరస్సు నుంచి అంటే బ్రహ్మరంధ్రం నుంచి. పరమేశ్వరుడు బ్రహ్మరంధ్రం ద్వారా మానవశరీరంలో ప్రవేశించాడు.

ఈ రకంగా పరమేశ్వరుడు జీవకోటిని సృష్టించి, తాను ఆ జీవకోటిలో ప్రవేశించి జగత్తంతా తానే అయినాడు." అని చెప్పబడింది.

పురుషసూక్తంలో పరమేశ్వరుడే ఈ జగత్తును సృష్టించాడు అని చెబుతూ, ఆ పరమేశ్వరుని ముఖము నుంచి–బ్రాహ్మణులు, బాహువుల నుంచి – క్షత్రియులు, ఊరువుల నుంచి – వైశ్యులు, పాదములనుంచి – శూద్రులు, మనస్సునుంచి – చంద్రుడు, కనులనుంచి – సూర్యుడు, ముఖము నుంచి – ఇంద్రుడు, అగ్ని, ప్రాణముల నుంచి – వాయువులు, నాభినుంచి – అంతరిక్షము, పాదములనుంచి – భూమి, శ్రోత్రముల నుంచి దిక్కులు ఉద్భవించాయి. అని చెప్పబడింది.

ఈ రకంగా పరమేశ్వర స్వరూపం నుంచే చరాచరజగత్తంతా ఆవిర్భవించింది. ఈ దేహము పాంచభౌతికమైనది. శరీరంలో శ్రోత్రాదులు అంటే కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము. ఇవి జ్ఞానేంద్రియాలు. వీటిలో శ్రోత్రము – ఆకాశాంశ, చర్మము – వాయు అంశ, కనులు – అగ్ని, నాలుక – జలము, ముక్కు – భూమి. అలాగే కర్మేంద్రియాలు కూడా పంచభూతాల నుండి కలిగినవే. ఈ విధంగా చరాచర జగత్తంతా పరబ్రహ్మ స్వరూపంతప్ప వేరుకాదు.

ఈ రకంగా చరాచర జగత్తులో 84 లక్షల రకాలయిన జీవరాశి ఆవిర్భవించింది.

పైంగలోపనిషత్తులో సృష్టిని గురించి చెప్పబడింది. ఈ సృష్టికి పూర్వము పరమాత్మ ఒక్కడే ఉన్నాడు. అదే ఆత్మ. అది నిత్యముక్తమైనది. వికారములు లేనిది.

సత్యజ్ఞానానందమయమైనది. పరిపూర్ణమైనది. సనాతనముగా ఉన్నది. ఏకముగా ఉన్నది. రెండవది లేనిది. అదే పరబ్రహ్మ. ఆ బ్రహ్మయందు ఎడారులలో మృగతృష్ణలాగా, ముత్యపు చిప్పలో వెండిలాగా, స్థాణువునందు దొంగవాడిలాగా, స్ఫటికంలోని రేఖలలాగా, అనిపిస్తూ ఎరుపు, తెలుపు, నలుపు, గల సమాన త్రిగుణాలు గలిగి, అనిర్వచనీయమైన మూలప్రకృతి ఉన్నది. ఆ మూల ప్రకృతిలోప్రతిబింబించిన పరబ్రహ్మమే సాక్షిచైతన్యముగా ఉన్నది. ఆ మూల ప్రకృతి మళ్ళీ వికారము పొంది సత్త్వగుణమువల్ల ఉద్రేకము పొంది అవ్యక్తమనే పేరుతో ఆవరణ శక్తిగా ఉన్నది. ఈ ఆవరణలో ప్రతిబింబించిన పరబ్రహ్మ ఈశ్వరచైతన్యము.

ఈ అవ్యక్తాన్ని స్వాధీనంలో ఉంచుకున్నవాడు పరమేశ్వరుడు. సృష్టి స్థితి లయాలకు కారణభూతుడు అవుతూ జగత్తుకు అంకురముగా ఉన్నాడు. ఈశ్వరుడు తనయందు లీనమైన జగత్తులో అంతటా తానే ఆవిర్భవింపజేసి ఉన్నాడు. ఇతడే ప్రాణులకు వారి కర్మలననుసరించి ఫలితాన్ని ఇస్తున్నాడు. ఈశ్వరుడే అధిష్ఠానముగా ఉన్న ఆ పరమశక్తి నుండి రజోగుణముతో ఉద్రిక్తమైన మహత్తు అనే పేరుగల విక్షేప శక్తి ఏర్పడింది. ఈ మహత్తునందు ప్రతిఫలించిన బ్రహ్మము హిరణ్యగర్భుడు అనబడుతోంది. ఆ హిరణ్యగర్భుడు మహత్తత్త్వమునందు అభిమానము గలవాడై స్పష్టమైనది. అస్పష్టమైనది అయిన శరీరము ధరించాడు.

హిరణ్యగర్భునిచే అధిష్ఠింపబడిన మహత్తునుండి (విక్షేపశక్తి) తమోగుణ ప్రధానమైన అహంకారము అనే స్థూలశక్తి వచ్చింది. అటువంటి అహంకారమునందు ప్రతిబింబించిన పరబ్రహ్మ విరాట్ అనే చైతన్యముగా ఉన్నది. ఆ విరాడ్రూపమే శ్రీమహావిష్ణువుగా ఉన్నాడు. ఆ విరాట్పురుషుని నుంచి సూక్ష్మాకాశ భూతము పుట్టింది. ఆకాశము నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి జలము, జలము నుంచి భూమి పుట్టినాయి. సూక్ష్మభూతాలుగా ఉన్న ఈ తన్మాత్రలు త్రిగుణ సహితముగా ఉన్నాయి. సృష్టి చెయ్యాలనే సంకల్పంగల ఆ జగత్కర్త, తమోగుణముతో సూక్ష్మపంచభూతాలను స్థూలం చెయ్యాలి అనుకున్నాడు. సృష్టికి పరిమితమైన సూక్ష్మ పంచభూతాలలో ఒక్కొక్క భూతాన్ని రెండు భాగాలుగా చేశాడు. ప్రతిభూతములోను మొదటి భాగాన్ని అలాగే ఉంచి, రెండవభాగాన్ని నాలుగు భాగాలుగా చేశాడు. ఇందులో ఒక్కొక్క భాగంలోను మిగిలిన భూతముల ద్వితీయాంశలను కలిపి

పంచీకరణ చేశాడు. అప్పుడు పంచీకరణ ఎలా జరిగిందంటే – భూమిని రెండు భాగాలుగా చేశాడు. అందులో మొదటి సగం భూమి. మిగిలిన సగభాగాన్ని నాలుగు ముక్కలుగా చేశాడు. ఇదే రకంగా అన్ని భూతాలను విభజించి, రెండవ సగంలో మిగిలిన భూతాలను ఉంచాడు. అంటే భూమిలో 1/2 భూమి, ఆకాశము 1/8, వాయువు 1/8, అగ్ని 1/8, జలము 1/8. ఇది పృథివీ పంచీకరణము. ఈ విధంగా పంచీకరించిన భూతాలతో అనంతకోటి బ్రహ్మాండాలను, లోకాలను, గోళాలను సృష్టించాడు.

ఈశ్వరుడు పంచమహాభూతాలయొక్క రజోగుణ భాగాలను నాలుగు భాగాలుగా చేసి, ఆ భాగములలో మూడు భాగాల నుండి ప్రాణశక్తిని సృష్టించాడు. తరువాత పంచభూతముల నాల్గవభాగంతో కర్మేంద్రియాలను సృష్టించాడు. తరువాత ఆ ఈశ్వరుడు పంచభూతాల సత్వాంశలను నాలుగు భాగాలు చేశాడు. అందులో మూడు భాగాల నుంచి అంతఃకరణను సృష్టించాడు. తరవాత నాల్గవ సత్వభాగముతో జ్ఞానేంద్రియాలను సృష్టించాడు. సత్త్వసమిష్ఠివల్ల ఇంద్రియ పాలకులైన దేవతలను సృష్టించాడు. ఈ రకంగా సృష్టించబడిన ఇంద్రియాలను అండములోపల వ్యాపింప చేశాడు. ఈశ్వరుని ఆజ్ఞతో సృష్టించబడినవన్నీ అండమంతటా పూర్తిగా వ్యాపించి ఉన్నాయి. ఈశ్వరుని ఆజ్ఞతో అహంకార సహిత విరాట్టు సమస్త స్థూలాన్ని సృష్టించాడు. ఈశ్వరుని ఆజ్ఞతో హిరణ్యగర్భుడు సూక్ష్మభూతాలను పరిపాలించాడు.

అండములో ఉన్న దేహేంద్రియాలు, చైతన్యమూర్తి అయిన ఈశ్వరుడు లేకుండా, స్పందన కలిగి ఉండటానికి, పని చేయటానికి సమర్థత లేకుండా ఉన్నాయి. ఈశ్వరుడు ఆ దేహాదులను చైతన్యవంతులుగా చెయ్యాలని సంకల్పించాడు. బ్రహ్మాండాలను, బ్రహ్మరంధ్రములను, సమస్త వ్యష్టిశరీర మస్తకములను బ్రద్దలు చేసి వాటన్నింటి యందు చైతన్యరూపంతో తాను ప్రవేశించాడు. అంటే జగత్తులో ఉన్న జీవరాశి యందంతటా తాను ప్రవేశించాడని అర్థం. ఈ శరీరాలన్నీ మొదట జడములుగా ఉన్నాయి. కాని ఈశ్వరుడు ప్రవేశించగానే చైతన్యవంతమై తమ తమ పనులు చెయ్యటం మొదలుపెట్టినాయి. సర్వజ్ఞుడైన ఈశ్వరుడు మాయాలేశ సమన్వితుడై, మోహపెట్టబడి జీవత్వము పొందాడు. అంటే శరీరంలో ప్రవేశించిన ఈశ్వరుడు మాయచేత అజ్ఞాని అయి కర్తృత్వము, భోక్తృత్వము కలవాడయినాడు. జీవుడుగా

ఉన్న ఈశ్వరుడు దేహమే తాను అనేభ్రాంతితో స్థూల సూక్ష్మకారణ దేహాలను అనుభవించటంచేత, మేల్కొనటం, నిద్రపోవటం, కలలు కనటం మరణించటం అనే ధర్మాలు గలవాడై కుమ్మరివాని సారెలాగా సంసారచక్రంలో పరిభ్రమిస్తున్నాడు అని చెప్పబడింది.

ఈ రకంగా సృష్టిని గురించి అనేకచోట్ల అనేక రకాలుగా చెప్పారు. అంతేకాదు భూత పంచీకరణలో కూడా రకాలున్నాయి. ఏదీ ఏమయినా ఈ సృష్టి అంతా పరమేశ్వరుడే చేశాడు. ఈ జగత్తంతా పరమేశ్వర స్వరూపము అనేది మాత్రం నిశ్చయం. అంటూ సృష్టి జరిగిన విధానాన్ని వివరించాడు రత్నాకరుడు.

3. శరీర విజ్ఞానము (శారీరకోపనిషత్తు, గర్భోపనిషత్తు)

"గురువుగారూ ! అసలు ఈ లోకంలో జీవి ఏ విధంగా ఆవిర్భవిస్తుంది ? మాతృగర్భంలో. పిండోత్పత్తి ఎలా జరుగుతుంది ? ఈ దేహము ఎలా ఏర్పడుతుందో? వివరించండి" అన్నాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు.

"నారాయణభట్టారకా ! నీ ప్రశ్న చాలా బాగుంది. జీవి ఆవిర్భావము, గర్భంలో పిండోత్పత్తి అనే విషయాలను వివరిస్తాను. శ్రద్ధగా విను అంటూ చెప్పటం మొదలు పెట్టాడు. ఈ జగత్తులో పుట్టిన ప్రతిప్రాణీ మరణించక తప్పదు. అలా మరణించిన జీవుడు తన పాపపుణ్యాలను మూట కట్టుకుని పైలోకాలకు వెళ్ళి, తన పుణ్యఫలంతో స్వర్గలోకంలో సమస్త సుఖాలు, నరకంలో శిక్షలు అనుభవించి కర్మశేషాన్ని అనుభవించటానికి మేఘాన్ని ఆశ్రయిస్తాడు. ఆ మేఘం వర్షంగా కురుస్తుంది. ఆ వర్షపు నీటివలన ఏరులు, నదులు పొంగుతాయి. అలా ప్రవహించే నదులనుండి కాలువలు తీస్తారు. వీటి సాయంతో పంటలు పండుతాయి. గడ్డి, చెట్లు పెరుగుతాయి. గతంలో మేఘాన్ని ఆశ్రయించిన జీవి వర్షపు నీటి ద్వారా భూమి మీదకు చేరి విత్తనాలలో కలసి మొలకెత్తి వాటి ఫలితాన్ని అనుభవించే పురుషుని శరీరంలో ప్రవేశిస్తాడు. అతని కర్మఫలాన్ని బట్టి గడ్డిరూపంలో పశువు శరీరంలో ప్రవేశిస్తాడు. మానవజన్మ ఎత్తే ప్రాణి పురుషుని ఆశ్రయిస్తాడు.

మానవుడు తీసుకున్న ఆహారం జీర్ణమై రసంగా మారుతుంది. ఆ రసము నుండి రక్తము, రక్తము నుండి మాంసము, మాంసము నుండి క్రొవ్వు, క్రొవ్వు

నుండి ఎముకలు, ఎముకల నుండి మజ్జ, మజ్జ నుంచి శుక్లము ఏర్పడుతుంది అదే విధంగా స్త్రీ గర్భంలో శోణితము ఏర్పడుతుంది. స్త్రీ పురుషుల సమాగమం జరిగిన మొదటి రాత్రి శుక్లశోణితాలు కలిసి ముద్దగా తయారవుతుంది. ఏడు రోజుల తరువాత ఆముద్ద నీటిబుడగలా మారుతుంది. పదిహేను రోజులకు పిండము అవుతుంది. అదే పిండము నెలరోజులకు గట్టిపడుతుంది. ఈ సమయంలో గర్భంలో ఉన్న పిండానికి ఒకటే ముఖము ఉంటుంది. దానిద్వారానే ఆ బిడ్డ తల్లిద్వారా ఆహారం తీసుకుంటుంది. అందుకే ఆ ముఖాన్నే నోరు అంటారు. ఈ రకంగా గర్భస్థ శిశువుకు మొదటి నెలలో నోరు ఏర్పడుతుంది. రెండవ నెలలో శిరస్సు ఏర్పడుతుంది. ఈ నెలలోనే శ్వాసతీసుకునే అవయవం ముక్కు ఏర్పడుతుంది. ఇక మూడవనెలలో మాతృగర్భంలోని శిశువుకు కనులు ఏర్పడతాయి. ఈ సమయంలోనే పాదాలుకూడా ఏర్పడతాయి. నాల్గవనెలలో చెవులు, చెవులతోపాటుగా కడుపు, నడుము కూడా ఏర్పడతాయి. ఇక ఐదవ నెలలో చర్మము ఏర్పడుతుంది. చర్మముతో పాటుగా వెన్నెముక ఏర్పడుతుంది. ఆరవనెలలో సర్వావయవాలు ఏర్పడతాయి. ఏడవ నెలలో ప్రాణం వస్తుంది. అంటే గర్భస్థ శిశువుకు చలనం వస్తుందన్నమాట.

ఒకవేళ ఏ కారణం చేతనైనా ఏడవ నెలలో ప్రసవం జరిగితే బిడ్డ క్షేమంగా జీవిస్తుంది. అంతకుముందు అంటే ఆరు నెలలలోగా ప్రసవం జరిగితే బిడ్డ జీవించదు. ఈ కారణంచేతనే ఏడవ మాసంలో ప్రాణము వస్తుంది అని చెప్పటం జరిగింది. ఇక ఎనిమిదవ మాసంలో అవయవ సౌష్టవం వస్తుంది. అంటే అవయవాలన్నీ సంపూర్ణంగా పెరుగుతాయి. తొమ్మిదవ మాసంలో బిడ్డ సలక్షణంగా పెరిగి, గర్భం ధరించిన 280 రోజులకు అనగా తొమ్మిదవ మాసం పూర్తి అయిన పది రోజులకు ప్రసవం జరిగి, గర్భస్థ శిశువు ఈ లోకంలో కాలు పెడుతుంది.

స్త్రీ యొక్క గర్భంలో, పురుషుని శుక్లము నుంచి వచ్చిన పురుష కణాలు శోణితముతో సంయోగం చెందితే మగశిశువు, శుక్లమునుంచి వచ్చిన స్త్రీ కణాలు శోణితముతో సంయోగము చెందితే ఆడశిశువు జన్మిస్తుంది. ఒకవేళ శోణితముతో శుక్లము నుంచి వచ్చిన పురుష కణాలు, స్త్రీ కణాలు రెండూ సంయోగము చెందితే నపుంసకులు పుడతారు. సంయోగ సమయంలో తల్లిదండ్రుల మానసిక ప్రవృత్తి

ననుసరించి పిల్లలు జన్మిస్తారు. ఆ సమయంలో తల్లిదండ్రులు చిత్త చాంచల్యానికి గురి అయితే కుంటి, గ్రుడ్డి, మూగ, చెవిటి, పిల్లలు పుడతారు.

సూర్యచంద్రులకు మానవ దేహంతో ప్రత్యక్ష సంబంధమున్నది. చంద్రుడు మనః కారకుడు. సూర్యుడు తేజస్సుకు, ప్రాణానికి కారకుడు. అందుచేత చంద్ర, సూర్యగ్రహణాలు ఏర్పడిన సమయంలో గర్భధారణ జరిగినట్లైతే పుట్టబోయే బిడ్డలకు అంగవైకల్యం కలుగుతుంది. అయితే గర్భిణీ స్త్రీలు గ్రహణం చూస్తే పుట్టబోయే బిడ్డలకు అంగవైకల్యం కలుగుతుందని ప్రచారంలో ఉన్నది. అది నిజంకాదు.

ఒకేసారి స్త్రీ గర్భాశయము నుంచి రెండు అండాలు విడుదలయితే కవలలు కలుగుతారు. విడుదల అయిన రెండు అండాలు కొంతమేరవరకు కలసి ఉన్నట్లైతే ఒకరితో ఒకరు అంటుకు పోయిన కవలలు (సనామీకవలలు) కలుగుతారు. మంచి ముహూర్తంలో ప్రశాంత వాతావరణంలో, ఆహ్లాదకర పరిస్థితులలో గర్భధారణ జరిగినట్లైతే, తల్లిదండ్రుల రూపము, గుణాలు కలిగిన పిల్లలు పుడతారు.

అసలు ఈ దేహము పంచభూతాత్మకమైనది. వీటిలో కఠినముగా ఉండేది భూమి. ద్రవరూపంలో ఉండేది జలం. ఉష్ణమైనది అగ్ని. సంచరించే స్వభావం గలది వాయువు. ద్వారము గలది ఆకాశము. వీటి ప్రతిరూపాలే జ్ఞానేంద్రియాలు అవి ఐదు. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము. వీటిలో భూమి ధరించటము, జలము- ముద్ద చెయ్యటము, అగ్ని - రూపాన్ని చూడటము, వాయువు - సంచరించటము, ఆకాశము - అవకాశమివ్వటము జరుగుతుంది. పంచభూతాల లక్షణాలే తన్మాత్రలు అవే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. 1. ఆకాశము యొక్క లక్షణం శబ్దం. అది చెవియందు ఉండి శబ్దగ్రహణం చేస్తుంది. 2. వాయువు లక్షణం స్పర్శ, అది చర్మము నందుండి ఉనికిని గ్రహిస్తుంది. 3. అగ్నియొక్క లక్షణం రూపము. అది కంటియందుండి వస్తువు రూపాన్ని చూస్తుంది. 4. జలము లక్షణం రసము అది నాలుక యందుండి రుచిని గ్రహిస్తుంది. 5. భూమియొక్క లక్షణం గంధం. అది ముక్కునందుండి వాసన చూస్తుంది. ఈ రకంగా ఇంద్రియాలకు పంచభూతాల తత్త్వాలున్నాయి. కాలు, చేయి, నోరు, పాయు, ఉపస్థ అనేవి కర్మేంద్రియాలు. వీటిలో కాలు నడుస్తుంది. చేయి ఇస్తుంది. నోరు మాట్లాడుతుంది.

పాయువు విసర్జిస్తుంది. ఉపస్థ ఆనందం కలుగజేస్తుంది. ఇక మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. వీటిని అంతఃకరణ చతుష్టయము అంటారు. వీటిలో

1. సంకల్ప వికల్పాలను చేసేది - మనస్సు

2. నిశ్చయించేది-బుద్ధి 3. అవధరణాత్మకమైనది చిత్తము 4. స్వాభిమానమైనది - అహంకారము. బుద్ధితో గ్రహిస్తాడు. నిశ్చయిస్తాడు. మనసుతో సంకల్పం చేస్తాడు. సంశయిస్తాడు. అహంకారముతో గర్వము గలిగి ఉంటాడు.

1. మనసుయొక్క వాసనా స్థానము	-	కంఠము
2. బుద్ధి యొక్క వాసనా స్థానము	-	ముక్కు
3. చిత్తముయొక్క వాసనాస్థానము	-	నాభి
4. అహంకారము యొక్క వాసనాస్థానము	-	హృదయము

ఈ రకంగా ఉన్న దేహంలో ఎముకలు, చర్మము, నరాలు, వెంట్రుకలు, మాంసము ఇవి పృథివి యొక్క అంశలు.

మూత్రము, కఫము, రక్తము, శుక్లము - ఇవి జలముయొక్క అంశలు.

ఆకలి, దప్పిక, సోమరితనము, మోహము, మైథునము ఇవి అగ్ని అంశలు.

నడచుట, గీరుట, కనులు మూయుట, తెరచుట - ఇవి వాయువు అంశలు.

కామము, క్రోధము, లోభము, మోహము, భయము - ఇవి ఆకాశము అంశలు.

అయితే ఈ భూతాలకు ప్రత్యేక లక్షణాలున్నాయని గతంలో చెప్పుకున్నాం. పంచభూతాలు పంచీకరణ చెందినాయి.

ఆకాశము లక్షణము - శబ్దము

వాయువు లక్షణము - శబ్దము, స్పర్శ

అగ్ని యొక్క లక్షణము - శబ్దము, స్పర్శ, రూపము

జలము యొక్క లక్షణము - శబ్దము, స్పర్శ, రూపము, రసము

భూమియొక్క లక్షణము - శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము

మానవదేహము ఐదు వస్తువులలో నున్నది. ఆరింటిని ఆశ్రయించి ఉన్నది. ఆరు గుణములతో కూడి ఉన్నది. ఏడు ధాతువులను, మూడు మలములను, మూడు గుణములను, నాలుగు అవస్థలను కలిగి ఉన్నది. వీటిలో ఐదు వస్తువులే పంచ భూతాలు. వీటిని వివరించటం జరిగింది. ఆరింటిని ఆశ్రయించి ఉన్నది. ఈ ఆరు షడ్రసాలు. పులుపు, ఉప్పు, తీపి, కారం, చేదు, వగరు. అలాగే షడ్విధవికారాలు.

1. ఉండుట 2. పుట్టుట 3. వృద్ధి పొందుట 4. పక్వమగుట 5. కృశించుట 6. నశించుట.

మానవ దేహంలో చక్రాలు ఆరు. 1. మూలాధారము 2. స్వాధిష్ఠానము 3. మణిపూరము 4. అనాహతము 5.విశుద్ధి చక్రము 6. ఆజ్ఞాచక్రము. వీటినే షట్చక్రాలు అంటారు. ఈ చక్రాలు ఆయా నాడుల నాశ్రయించి ఉంటాయి. ఇక కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము. వీటినే అరిషడ్వర్గాలు అంటారు. శమము, దమము, తితిక్ష, ఉపరతి, శ్రద్ధ, సమాధానము. ఈ ఆరు గుణాలు వాటి నిష్ఠతో చేరి ఉంటాయి. మానవశరీరము సప్తధాతువులను కూడి ఉంటుంది. అవి 1. శుక్లము, 2. శోణితము, 3. మాంసము 4. ఎముకలు 5. చర్మము 6.చీము 7. రక్తము సప్తస్వరాలను కూడి ఉంటుంది. సప్తస్వరాలు వీటినే స, రి, గ, మ, ప, ద, ని అంటారు

1. షడ్జము 2. రిషభము 3. గాంధారము 4. పంచమము 5. మధ్యమము 6.దైవతము 7. నిషాదము. ఇవి తెలుపు, ఎరుపు, నలుపు, ధూమ్రము, పసుపు, కపిలము, పాండురము అనే వర్ణాలలో ఉంటాయి.

మానవదేహము మలత్రయముతో నిండి ఉన్నది. మలత్రయము అంటే

1. అణవమల 2. మాయీకమల 3. కార్మికమల. మూడు గుణాలు అంటే సత్వరజస్తమో గుణాలు. వీటినే 1. సాత్త్వికము 2. రాజసము 3. తామసము అంటారు. అహింస, పరదార ద్రవ్యములందు అభిలాష లేకుండుట,కోపము లేకుండుట, గురువుకు శుశ్రూష చెయ్యటము, శౌచము (దేహశుద్ధి, మనోశుద్ధి) సంతోషము, ఋజుమార్గము, స్వోత్కర్ష దంభము లేకుండుట, దైవమందు, వేదము నందు నమ్మకము (అస్థిత్వము) ఇతరులకు అపకారము చేయకుండుట, ఇవన్నీ సత్త్వగుణం గలవారి లక్షణాలు.

నేను కర్తను, నేను భోక్తను, నేను వాచాలకుడను, నేను అభిమానం గలవాడను. అనేవి రాజసప్రవృత్తి గలవారి లక్షణాలు.

నిద్ర, సోమరితనము, మోహము, ఆశ, మైథునము, దొంగతనము, తామస ప్రవృత్తిగల వారి లక్షణాలు. తమోగుణానికి ఉండే శక్తిని ఆవరణశక్తి అంటారు. ఈ శక్తివల్లనే ఒకవిధంగా ఉన్నవస్తువు ఇంకొకవిధంగా కనిపిస్తుంది. ఇదే పురుషుని సంసారానికి మూలకారణము. తమోగుణంచేత కప్పబడినవాడు ఎంతటి బుద్ధిమంతుడైనా, విద్వాంసుడైనా, నేర్పరి అయినా, విషయాన్ని సరిగా గ్రహించలేడు. తమోగుణం ఒక రకమైన భ్రమను కలిగిస్తుంది. దానివల్ల తనకు కనిపించినదే నిజం అనుకుంటాడు. తమోగుణానికి నాలుగు రకాల శక్తులున్నాయి. అవి

1. అభావన - పరమాత్మలేడు అనుకోవటం
2. విపరీభావన - నేను శరీరాన్ని అనుకోవటం
3. అసంభావన - పని జరుగుతుందా లేదా అనే అనుమానం
4. విప్రపత్తి - ఉన్నదా ? లేదా ? అవునా ? కాదా ? అనే అనుమానం

తమోగుణ ప్రభావితుడైనవాణ్ణి ఈ శక్తులు వదలవు. తమోగుణ ప్రభావితుడు ఏదీ తెలుసుకోలేక ఒక స్థంభంలాగా కదలిక లేకుండా ఉంటాడు.

సత్త్వగుణం గలవాడు ఊర్ధ్వలోకాలయందు, రజోగుణం గలవాడు భూలోకంలోను, తమోగుణం గలవాడు అథోలోకములోను జన్మిస్తారు. సమ్యక్ జ్ఞానము అనగా బ్రహ్మజ్ఞానము - సాత్వికము, ధర్మజ్ఞానము - రాజసము, అజ్ఞానము - తామసము.

ఇక అవస్థలు నాలుగు అవి

1. జాగ్రదవస్థ 2. స్వప్నావస్థ 3. సుషుప్తి 4. తురీయము.

జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, అంతఃకరణ చతుష్టయము. ఈ పద్నాలుగింటితో కలిసినది జాగ్రదవస్థ. అంతఃకరణ చతుష్టయముతో కూడినది- స్వప్నావస్థ. ఒక్క చిత్తముతో మాత్రమే కూడినది - సుషుప్తి. జీవునితో మాత్రమే కూడినది - తురీయము.

పాంచభౌతికమైన శరీరం మూడు రకాలుగా ఉంటుంది. అవి

1. స్థూలదేహము : చర్మము, మాంసము, రక్తము, నరాలు, మేద, మజ్జ, ఎముకలు మొదలైన వాటితోను, మలమూత్రాలతోను కూడినది స్థూలదేహము. ఇది చాలా అసహ్యకరమైనది. పూర్వజన్మ కర్మల ననుసరించి, పంచభూతాల కలయిక చేత ఈ దేహము ఏర్పడింది. జీవుడు ఈ శరీరంతోనే సుఖదుఃఖాలు అనుభవిస్తాడు. స్థూలశరీరము ఎప్పుడూ జాగ్రదావస్థలోనే అనుభవం పొందుతుంది. మిగిలిన అవస్థలు దానికి తెలియవు. బాల్య, యౌవన, కౌమారాది దశలు, వర్ణాశ్రమ ధర్మాలు, మానావమానాలు, ఈ దేహానికే చెందుతాయి.

2. సూక్ష్మదేహము : జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, పంచప్రాణాలు, అంతఃకరణ చతుష్టయము, ఇవన్నీ కలిపి సూక్ష్మశరీరము అనబడుతుంది. ఈ సూక్ష్మశరీరాన్నే లింగశరీరము అనికూడా అంటారు. ఇది పంచీకృత భూతాలవల్ల ఏర్పడి, వాసనలతో కూడినదై, కర్మఫలాలు అనుభవిస్తూ ఉంటుంది. స్వప్నాన్ని ఈ సూక్ష్మశరీరమే అనుభవిస్తుంది.

3. కారణదేహము : గుణత్రయమే ఆత్మయొక్క కారణ శరీరము. ఇది సుషుప్తావస్థలో ఉంటుంది. సుషుప్తిలో అన్ని రకాలైన జ్ఞానము నశిస్తుంది. బుద్ధి కేవలము బీజరూపంలో మాత్రమే ఉంటుంది. ఈ స్థితిలో శరీరంలోని అవయవాలన్నీ పూర్తిగా విశ్రమిస్తాయి.

మనస్సు, బుద్ధి, అహంకారము, పంచభూతాలు, ఈ ఎనిమిదింటినీ అష్ట ప్రకృతులు అంటారు. వీటితో జ్ఞానేంద్రియాలు 5, కర్మేంద్రియాలు 5, తన్మాత్రలు 5 కలిస్తే, వెరసి 23 తత్త్వాలు అనబడతాయి. ఈ 23 తత్త్వాలు కలిగి ఉన్నదే మానవ దేహము. 24వ తత్త్వము అవ్యక్తము. అదే ప్రధానమైనది. ఇదే మాయ. దీనికన్న కూడా వేరైన వాడే పురుషుడు. ధాతువులు మూడు వాతము, పిత్తము శ్లేష్మము. అవి సక్రమంగా ఉంటే దేహము మంచి ఆరోగ్యంగా ఉంటుంది. అవి సక్రమంగా లేకపోతే మానవుడు వ్యాధిగ్రస్తుడవుతాడు. విషయాలను అర్థం చేసుకోలేడు. కాబట్టి పిత్తము అనుకూలంగా ఉన్నప్పుడు చక్కగా గ్రహించగలుగుతాడు. పిత్తము తక్కువగా ఉంటే తక్కువ గ్రహిస్తాడు. అధికంగా ఉంటే ఎక్కువగా

తెలుసుకుంటాడు. పిత్తము వికారము పొంది ఉంటే పిచ్చివాడవుతాడు. పిత్తాగ్ని కర్మాశయమునందు చేరి ధర్మాధర్మములు అనే కారణ వాయువు చేత ప్రజ్వలింపజేయ బడుతున్నది. అప్పుడు దానికి లోపలి అనుభవాలు, బయటి అనుభవాలు కొయ్య ముక్కలలాగా ఉంటాయి.

శరీరంలో జ్ఞానాగ్ని, దర్శనాగ్ని, కోష్ఠాగ్ని అని అగ్ని మూడు రకాల అగ్నులున్నాయి.

1. జ్ఞానాగ్ని మనసులో ఉంటుంది.
2. దర్శనాగ్ని ఇంద్రియాలయందుంటుంది.
3. కోష్ఠాగ్ని దహరమందుంటుంది.

అపానమనే వాయువుతో కలిసి ప్రతిరోజూ భుజించిన పదార్థము జీర్ణమవుతుంది.

నేత్రమే దర్శనాగ్ని ఆ నేత్రము వికారమై ఉండి పదార్థాలను గోచరింపచేస్తుంది. మానవుని హృదయమందు – దక్షిణాగ్ని, ఉదరమందు – గార్హపత్యాగ్ని, ముఖము నందు – ఆహవనీయాగ్ని ఉన్నాయి. అందువల్ల పురుషుడు యజమానిగా ఉండి, బుద్ధిని భార్యగాను, సంతోషాన్ని దీక్షగాను, జ్ఞానేంద్రియాలను యజ్ఞపాత్రలుగా, కర్మేంద్రియాలను పనిముట్లుగా, చేసుకుని యజ్ఞం చేస్తున్నాడు. శారీరక యజ్ఞమందు ఆయాదేవతలే తటస్థమైన ఋత్విక్కులుగా ఉండి, ఆయా స్థానములయందు యజమానునితో గూడా యజ్ఞం చేస్తున్నారు. ఆ యజ్ఞమందు దేహమే ధర్మశాల. శిరఃకపాలమే మోక్షకుండము. కేశములే దర్భలు ముఖమే అంతర్వేది. కామమే ఆజ్యము జీవితకాలమే యజ్ఞకాలము. దహర శబ్దమే సామగానము. వైఖరీ శబ్దమే యజుర్వేదము. పరాపశ్యంతి మధ్యమలు ఋగ్వేదము. క్రూర వాక్యములు అధర్వవేదము యొక్క ఖిల (ఉపాసన) భాగములు. సత్యవాక్కులు వ్యాహృతులు. ఆయుస్సు, బలము, పిత్తము – పశువులు. మరణమే అవభృతస్నానము.

యజ్ఞమందు అగ్నులు ప్రజ్వరిల్లుతున్నాయి. ఇందులో దేవతలు సరియైన సంసార సౌఖ్యము అనుభవిస్తున్నారు. ఈ విషయాలు తెలుసుకున్న వారందరూ యజ్ఞం చేసినవారే అవుతారు. ఇటువంటి యజ్ఞం చెయ్యలేనివాడు జీవించి ఉన్నవాడు

కాదు. ఈ దేహము యజ్ఞం కోసమే ఉన్నది. యజ్ఞమువల్లనే కలుగుతున్నది. యజ్ఞానికి తగినట్లుగా వికారము చెందుతున్నది. పరిణామము చెందుచున్నది. దుఃఖసాగరంలో చేరుచున్నది.

ఈ దేహంలో దంతాలు – 32, సుషిరములు (బెజ్జములు, రంధ్రములు) – 15, దేహము యొక్క పొడవు – 96 అంగుళాలు, నాడీస్థానాలు – 14, మర్మాలు – 108. ముఖ్యమైన నాడులు –72, వీటిలో ఇడ, పింగళ, సుషుమ్నలు ప్రధానమైనవి. నాల్గవది పురీతతి. ఐదవనాడియే జీవుడు. దాని తరువాత పిత్తమున్నది. పిత్తమందు పురీతతి ఉన్నది. నాభితలానికి మెడవైపున రెండు అంగుళాల దూరంలో పిత్తమూలమున్నది. భుజించిన ఆహారము, మలము, మూత్రము, సారము అని మూడు విధాలుగా మారుతుంది. మూత్రము రెండు భాగాలై క్రిందుగను, ఎడమ వైపునను ప్రవహిస్తుంది. మలము ఏడు విధాలుగా దేహముయొక్క కుడివైపు నున్నది. సారము ఐదు విధాలై దేహమందు వ్యాపిస్తుంది. ఆ కారణం చేతనే అన్నపానముల వలన రేతస్సు, రక్తము ఏర్పడుతున్నాయి. అన్నము రసముగా, రసము రక్తముగా, మాంసము, ఎముకలు, మజ్జ, శుక్లశోణితములుగా మారుతుంది.

శరీరంలో సంచరించేటట్లు చేసేది ప్రాణవాయువు. ఆ ప్రాణవాయువు నూలు పోగులాగా ఉంటుంది. దానివల్లనే శ్వాసపీల్చటము, వదలటము, సంచరించటము జరుగుతున్నాయి. ప్రాణం లేకపోతే శరీరంలోని ఏ అంగము జీవించదు. వాయువువల్లనే రక్తము హృదయము నుండి సర్వనాడులయందు ప్రవహిస్తున్నది. అక్కడ నుండి సర్వేంద్రియాలకు పోతున్నది. పాకము చేయబడిన రసము మాతృగర్భ మందు నాడీద్వారముగుండా గర్భాశయముచేరి, శిశువు యొక్క కపాలము గుండా ప్రవేశించి సుషుమ్ననాడిద్వారా గర్భకోశంలో ఉన్న జీవియొక్క ప్రాణాన్ని తృప్తిపరుస్తుంది. ఆ సుషుమ్నానాడియే బ్రహ్మనాడి. గర్భముయొక్క ప్రాణము మొదలైనవి అక్కడ కనిపిస్తాయి. జన్మించేటప్పుడు క్రిందికి జారి, పుట్టిన తరువాత హృదయమందు ఉంటుంది. దానిని జీవుడు యోగముతో నిరోధించి భృకుటి మధ్యలో ఉన్న సుషుమ్నవరకు తీసుకుపోయినట్లైతే పరమాత్మ దర్శనమవుతుంది.

ఇటువంటి దేహంలో అంతర్యామిగ, అమృతముగ, ఆత్మసాక్షిగ, ఉండేది పురుషుడు. ఆ పురుషుడు అవిద్యచేత ఆచ్ఛాదింపబడి, అభిమానియై, జీవుడు

అవుతున్నాడు. జీవుడు అవిద్యలో వ్యాపింపచేయబడి ఉన్నాడు. అతనికి చాటుగా ఉన్న అజ్ఞానము బీజము. ఆ బీజము యొక్క మొలక అంతఃకరణ. దానియొక్క వృక్షము శరీరము.

ఈ శరీరంలో 8 కోట్ల రోమాలు, 8 వేల సంధులు, 9 వందల నరాలు ఉన్నాయి. గుండె 8 ఫలములు, నాలుక 12 ఫలములు, పిత్తము ఒక పడి, కఫము తూమెడు, శుక్లము రెండు తూములు, క్రొవ్వు 2 పడులు ఉన్నాయి. ఇవన్నీ నశించాయని తెలుసుకుని గర్భంలో ఉన్న జంతువులాగా, సుషుమ్నానాడిలో స్థిరముగా ఉండి, విజ్ఞానివి కావాలి. ఈ విషయాలు తెలుసుకున్నవాడికి పునర్జన్మలేదు. అతడు ముక్తిని పొందుతాడు. అంటూ శరీర విజ్ఞానాన్ని వివరించాడు రత్నాకరుడు.

4. పూర్వజన్మజ్ఞానము (గర్భోపనిషత్తు)

“గురువుగారూ ! గతజన్మలో చేసిన కర్మ ఫలితాన్ని అనుభవించటం కోసం జీవుడు మళ్ళీ ఈ లోకంలో జన్మించటానికి తనకు అనువైన మాతృగర్భాన్ని ఎంచుకుని దానిలో ప్రవేశిస్తున్నాడు. మరి మాతృగర్భంలో ఉన్నప్పుడు అతడికి గతజన్మల స్మృతి, గతంలో తాను చేసిన పాపపుణ్యాలు, పూర్వజన్మ జ్ఞానము ఇత్యాదులు గుర్తు ఉంటాయా ? గర్భవాసంలో శిశువు రూపంలో ఉన్న జీవుడు ఏ విధంగా ఆలోచిస్తాడో వివరించండి” అన్నాడు కృష్ణశర్మ. చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

గర్భంలో ఉన్న శిశువు పంచభూతమయుడు, సమర్థుడు అవుతున్నాడు. పంచేంద్రియములతో కూడిన ఆ శిశువు శబ్ద స్పర్శ రూప రస గంధాలను తెలుసు కుంటున్నాడు. సమ్యక్ జ్ఞానము (బ్రహ్మజ్ఞానము) చేత, ధ్యానముచేత పరమాత్మ స్వరూపమైన ప్రణవాన్ని తెలుసుకుంటున్నాడు. ఈ దేహంలో అష్టప్రకృతులు, అనేక రకాలైన వికారాలు ఉన్నాయి. వికారము అంటే – ఆకారంలో మార్పు, స్వభావంలో మార్పు, స్వాభావిక స్థితినుండి మారటము. గర్భంలో ఉన్న శిశువుకు తొమ్మిదవ నెలలో అన్ని లక్షణాలు పూర్తి అవుతున్నాయి. అప్పుడు జీవుడు తన పూర్వజాతిని పూర్వకర్మను, భవిష్యకర్మను, పాపపుణ్యాలను తెలుసుకుంటాడు. నేను లెక్కలేనన్ని స్త్రీలయోనులను చూశాను. అనేక ఆహారాలను భుజించాను. అనేక స్థనాలను పానం చేశాను. అంటే ఇప్పటివరకు అనేకజన్మలు ఎత్తాను అని అర్థం.

ఈ సమస్త పృథివి నా జన్మభూమి. సమస్త భూమి స్మశాన భూమియే. నేను 84 లక్షల రకాలైన యోనులందు జన్మించాను. ఎన్నోసార్లు పుట్టాను. ఎన్నోసార్లు మరణించాను. ఎన్నోసార్లు సంసారినైనాను. చావుపుట్టుకలతోనే కాలం గడిచి పోయింది. గర్భవాసము మహాదుఃఖకరమైనది. మాతృగర్భంలో తలక్రిందులుగా వ్రేలాడుతూ మలమూత్రాదులతోకూడిన ప్రదేశంలో తొమ్మిది నెలలు ఉండాలి. ప్రక్కకు వత్తిగిలటానికి కూడా లేదు. ఆకలివేసినా, దాహం వేసినా అడగటానికి కూడాలేదు. బాధ కలిగితే కనీసం నోరారా ఏడ్వటానికి కూడా లేదు. అటువంటి గర్భవాసము చాలా దుఃఖకరమైనది. బాల్యమందు దుఃఖము, శోకము, పారవశ్యము, మూఢత్వము సంభవిస్తాయి. యౌవ్వనమందు మంచిపనులు చెయ్యకపోవటము, సోమరితనము, చెడుపనులు చెయ్యటము, విషయాసక్తి, తాపత్రయాలు బాధపెడుతున్నాయి.

వార్ధక్యమునందు చింత, వ్యాధులు కలుగుతున్నాయి. మరణమంటే మహాభయం కలుగుతుంది. ఆశ, అభిమానము, అధికమైన కామక్రోధాదులయందు చిక్కుకోవటము, అస్వతంత్రతలచేత గొప్ప దుఃఖము కలుగుతుంది. ఈ జన్మము దుఃఖానికి కారణమై ఉన్నది. దుఃఖమయమైనది. మిగుల సహింపరానిది. నివృత్తి ధర్మము కొంచెముకూడా చెయ్యలేదు. యోగసాధన, జ్ఞానసాధన అసలే చెయ్యలేదు. దుఃఖసాగరములో మునిగి పోతున్నాను. దీనికి ప్రతిక్రియ చెయ్యటానికి అసమర్ధుడనై ఉన్నాను. అజ్ఞానమునకు మాటిమాటికీ ధిక్కారము. కామక్రోధాది సంకటములకు ధిక్కారము.

సంసారశృంఖలాలకు ధిక్కారము. మాతృగర్భము నుండి బయటకు వచ్చిన తరువాత, సద్గురువును ఆశ్రయించి బ్రహ్మజ్ఞానము పొందుతాను. యోనిద్వారము నుండి బయటపడిన వెంటనే నేను సాంఖ్యయోగాన్ని ఆశ్రయిస్తాను. యోనిద్వారము నుండి బయటకు రాగానే అశుభాన్ని నశింపచేసేవాడు, మోక్షప్రదాత అయిన పరమేశ్వరుని శరణు పొందుతాను. యోనిద్వారము నుండి బయటకు రాగానే శుభకరుడు, పురుషార్ధములనిచ్చేవాడు, అయిన జగదీశ్వరుని శరణువేడతాను.

ఈ యోనినుండి బయటకు వచ్చినట్లైతే సర్వశక్తిమంతుడు, సర్వకారణ భూతుడు, భర్గుడు, పశుపతి, రుద్రుడు, మహాదేవుడు, జగద్గురువు అయిన పరమేశ్వరుని శరణు పొందుతాను. ఈయోనిబంధము నుండి బయటకి వచ్చినట్లైతే గొప్ప తపస్సు

చేస్తాను. ఈ గర్భవాసమునుండి బయటకు వచ్చినట్లైతే అమృతత్వాన్ని కలుగచేయు వాడు, ఆనందరూపుడు, అనామయుడు, నారాయణుడు అయిన ఆ పరమేశ్వరుని హృదయమందు ధ్యానం చేస్తాను. నేనిప్పుడు మాతృగర్భంలో బంధింపబడి ఉన్నాను. ఈ బంధమునుండి విముక్తుడనైనట్లైతే అనన్యచిత్తముతో ఆ పరమేశ్వరుని ధ్యానించి, ఆయనను సంతసింపచేస్తాను.

పూర్వము నేను ఇతరులకోసం కర్మలు చేశాను. ఇప్పుడు ఒక్కడుగా బాధతో దహింపబడుతున్నాను. ఫలము అనుభవించిన వారందరూ గతించిపోయారు. పూర్వము నేను నాస్తికుడనై నిర్భయముగా అనేకసాధనలు చేశాను. ఆ పాపఫలమంతా ఇప్పుడు అనుభవిస్తున్నాను. ఇకముందు ఆస్తికుడనై కాలం గడుపుతాను.

ఈ రకంగా గతంలో జరిగిన విషయాలను మాటిమాటికీ ఆలోచించి సంసార దుఃఖాన్ని అనేకసార్లు స్మరించి, గర్భంలో ఉన్న జీవుడు వైరాగ్యమవలంబించి, అజ్ఞాన కామ్యకర్మాదులతో మోహము పొందుతున్నాడు.

ఆ జీవుడు వందలాది స్త్రీలయోని ద్వారము పొంది ఉన్నాడు. ఇప్పుడు ఆ యోనిద్వారము నుంచి విడుదల పొందటానికి ప్రయత్నిస్తున్నాడు. అలా విడుదల పొందటానికి శక్తిలేనివాడై యంత్రంలో చిక్కుకున్నవాడిలాగా బాధింపబడుతున్నాడు. దుఃఖాతిశయముచే కష్టము పొందుతున్నాడు. ప్రసవవాయువుచే పీడింపబడుతున్నాడు. జన్మించిన వెంటనే అతడు మాయచే వ్యాపింపడుతున్నాడు. అప్పుడు అతడు పరలోక సాధనాన్ని దేన్నీ స్మరించటంలేదు. అపరోక్షజ్ఞానము లేక బాధపడుతున్నాడు. పృథివీ స్పర్శ అయిన వెంటనే అనగా మాతృగర్భం నుంచి ఈ భూమిమీద పడగానే, జీవుడు క్రూరదృష్టికలవాడు, పామరుడు అవుతున్నాడు. నీటిచే కడుగబడిన తరువాత అతడికి ఆ దృష్టిదోషము కూడా నశిస్తుంది.

జీవి పుట్టిన తరువాత, జన్మ, మృత్యు, కర్మ, శుభాశుభ సాధనలు ఏవీ స్ఫురించవు. వాసనలన్నీ బీజరూపంలో గూఢంగా ఉంటాయి. పూర్వజన్మ కర్మానుసారము ఈ భూమిమీద చరిస్తాడు. అంటూ గర్భంలో ఉన్న శిశువుయొక్క పూర్వ జన్మజ్ఞానాన్ని వివరించాడు రత్నాకరుడు.

5. పరబ్రహ్మ - స్థూలశరీరము (పైంగలోపనిషత్తు)

"గురుదేవా ! సకలలోక సృష్టి స్థితి లయ కారకుడైన పరమేశ్వరుడు జీవభావము అంటే స్థూలశరీరము ఏ విధంగా పొందాడో వివరించండి" అని అడిగాడు కృష్ణశర్మ ఆ మాటలు విన్న రత్నాకరుడు చెప్పటం ప్రారంభించాడు.

ఈశ్వరుడు పంచీకృతమైన మహాభూతాలను స్వీకరించి వ్యష్ఠిరూపంలోను (విడివిడిగా) సమిష్ఠి రూపంలోను (అన్నీ కలిపి) స్థూలదేహాలను సృష్టించాడు. వాటిలో కపాలము, చర్మము, నరాలు, ఎముకలు, మాంసము గోళ్ళు మొదలైనవి పృథివి యొక్క అంశలు. రక్తము, మూత్రము, లాలాజలము, స్వేదము మొ॥వి జలము యొక్క అంశలు. ఆకలి, దప్పిక, ఉష్ణము, మోహము, మైధునము మొదలైనవి అగ్నియొక్క అంశలు. నడచుట, దాటుట, శ్వాసవిడచుట, శ్వాసపీల్చుట మొదలైనవి వాయువు యొక్క అంశలు. కామక్రోధాలు ఆకాశము అంశలు. ఈ రకంగా సంచితమైన కర్మతో కూడినది, చర్మము, రక్తము మొదలైనవి గలది, భార్యాపుత్రులు, మిత్రులు మొదలైనవారిని అభిమానించేది, బహుదోషములకు ఆశ్రయమైనది అయిన స్థూలదేహము ఏర్పడుతున్నది.

ఆ తరువాత పంచభూతముల రజోగుణాన్ని నాలుగు భాగాలుగా చేసి అందులోని మూడు భాగాలతో ప్రాణమును సృష్టించాడు. ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అనేవి ప్రాణముయొక్క వృత్తులు. నాగకూర్మ, కృకుర, దేవదత్త, ధనుంజయములు ఉపప్రాణాలు. హృదయము, గుదము, నాభి, కంఠము, సర్వాంగములు ప్రాణముయొక్క స్థానాలు. పంచభూతాలయొక్క నాలుగవ రజోగుణ భాగంతో కర్మేంద్రియాలను సృష్టించాడు. వాక్కు, పాణిపాదము, గుదము, ఉపస్థ అనేవి కర్మేంద్రియాలు. మాట్లాడటం, అర్చించటం, నడవటం, విసర్జించటం, ఆనందించటం అనేవి కర్మేంద్రియాల విషయాలు. అగ్ని, దేవేంద్రుడు, ఉపేంద్రుడు, మృత్యువు, ప్రజాపతి కర్మేంద్రియాల దేవతలు. ఇక పంచభూతాల సత్త్వగుణాంశలు మూడింటితోను అంతఃకరణ చతుష్టయాన్ని సృష్టించాడు. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనేవి చిత్తవృత్తులు. ఆలోచించటము, నిశ్చయం చెయ్యటము, స్మరించటము, అభిమానించటము, అనుసంధానము చేయటము అనేవి అంతః

కరణ విషయాలు. కంఠము, ముఖము, నాభి, హృదయము, భ్రూమధ్యము అనేవి అంతఃకరణ స్థానాలు. చంద్రుడు, విష్ణువు, చతుర్ముఖబ్రహ్మ, శంభుడు. అంతఃకరణ చతుష్టయానికి దేవతలు. పంచభూతాల సత్త్వాంశ సంబంధమైన నాల్గవ భాగంతో జ్ఞానేంద్రియాలను సృష్టించాడు. శ్రోత్రము, చర్మము, చక్షువు, జిహ్వ, ఘ్రాణము అనేవి ఆయా వృత్తులవలన నామభేదములతో ఏర్పడిన జ్ఞానేంద్రియాలు. శబ్ద స్పర్శ రూప రసగంధాలు జ్ఞానేంద్రియాలకు విషయాలు. దిక్కులు, వాయువు, సూర్యుడు, వరుణుడు, అశ్వనీ దేవతలు జ్ఞానేంద్రియాలకు అధిష్ఠాన దేవతలు.

ఆ తరువాత పంచకోశాలు. అవే అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు. అన్న రసముతో జన్మించి అన్న రసముతో వృద్ధి చెంది, అన్నరసమయమగు పృథివిలోనే లీనమయ్యేది అన్నమయకోశము. ఇదే స్థూలశరీరము. కర్మేంద్రియ సహితమైన ప్రాణమే ప్రాణమయకోశము. జ్ఞానేంద్రియాలు మనస్సు కలిసి మనోమయకోశము. జ్ఞానసహితమైన బుద్ధి విజ్ఞాన మయకోశము. ఈ మూడు కోశముల సమూహమే సూక్ష్మదేహము. అదే లింగ శరీరము. స్వస్వరూపము యొక్క జ్ఞానము ఆనందమయకోశము. ఇదే కారణదేహము.

1. జ్ఞానేంద్రియాలు, 2. కర్మేంద్రియాలు, 3. ప్రాణాలు, 4. పంచభూతాలు, 5. అంతఃకరణ చతుష్టయము, 6. కామము, 7. కర్మము, 8. తమస్సు (అవిద్య) ఈ ఎనిమిది గల దేహము అష్టపురమనబడును. ఈశ్వరాజ్ఞచేత విరాట్పురుషుడు ఒక్కొక్క శరీరమునందు ప్రవేశించి, బుద్ధిని అధిష్ఠించి విశ్వుడైనాడు. విజ్ఞానాత్ముడని, చిదాభాసుడని, విశ్వుడని, వ్యావహారికుడని, స్థూలశరీరాభిమాని అని, కర్మభవుడని విరాట్టుకు పేర్లు. ఈశ్వరాజ్ఞతో ఒక్కొక్క దేహమునందు ప్రవేశించిన సూత్రాత్మ మనస్సును అధిష్ఠించి తైజసుడైనాడు. ఇతడికి తైజసుడు, ప్రాతిభాసికుడు, స్వప్నకల్పితుడు అని పేర్లు. ఈశ్వరాజ్ఞతో మాయోపాధికుడగు ఈశ్వరుడే అవ్యక్త సహితుడై ఒక్కొక్క కారణదేమమునందు ప్రవేశించి ప్రాజ్ఞుడైనాడు. ఇతడికి ప్రాజ్ఞుడు అవిచ్ఛిన్నుడు, పారమార్థికుడు, సుషుప్త్యభిమాని అని పేర్లు.

వేదాంత శ్రవణంవల్ల ప్రాప్తించే ఫలితము ప్రాజ్ఞుడికే చెందుతుంది. జ్ఞానము ఆవరించిన ఈ జీవుడికి 'తత్త్వమస్యాది' మహావాక్యాలు జీవబ్రహ్మైక్యాన్ని బోధిస్తాయి.

అంతకన్న వేరుగా ఉన్న ప్రాతిభాసికులకు జీవబ్రహ్మైక్యము చెప్పలేము. అవిద్యలో ప్రతిబింబించిన చైతన్యానికి అంటే జీవుడికి మాత్రమే అవస్థాత్రయాలు చెప్పబడ్డాయి. ఆ జీవుడే జాగ్రస్వప్న సుషుప్తులనే అవస్థలు అనుభవిస్తూ, గానుగకు కట్టిన ఎద్దులాగా జనన మరణాలు పొందుతూ, సంసారమనే బండి చక్రంలో పడి విసుగు విరామం లేకుండా తిరుగుతున్నాడు. ఆ తరువాత జీవుడికి జాగ్రద్స్వప్న, సుషుప్తి, మూర్ఛ, మరణము అనే ఐదు అవస్థలున్నాయి. ఆయా దేవతల అనుగ్రహంతో, జ్ఞానేంద్రియాలతో, శబ్దము మొదలైన విషయాలను పరిగ్రహించే జ్ఞానము జాగ్రదవస్థలో జరుగుతుంది. జాగ్రదవస్థలో భ్రూమధ్యమునందు చేరిన జీవుడు ఆపాద మస్తక పర్యంతము కృషి, శ్రవణము మొదలైన సమస్త క్రియలకు కర్త అవుతున్నాడు. ఆ కర్మలయొక్క ఫలితాలు కూడా అనుభవిస్తున్నాడు. కర్మ అయిన ఆ జీవుడే శరీరాన్ని విడిచిన తరువాత లోకాంతరాలకు పోయి అక్కడ కర్మార్జిత ఫలము అనుభవిస్తున్నాడు. అతడు సార్వభౌమునిలాగా వ్యవహారముతో అలసిపోయి, నిద్రపోవటానికి పడుకుంటున్నాడు. అంటే అంతర్భవమును ప్రవేశించటానికి మార్గము అన్వేషిస్తున్నాడు.

వాక్కు మొదలైన పనులన్నీ ఉపశమించినప్పుడు, గ్రాహ్య గ్రాహకరూపాలను సృష్టించటమే స్వప్నావస్థ. అంటే చూసేవాడు, చూడబడేది రెండింటినీ సృష్టించటం జరుగుతుంది. స్వప్నావస్థలో, జాగ్రదవస్థలో ఉన్న వ్యవహారాలు లోపించి ఉంటాయి. అందుచేత విశ్వుడుగా ఉన్న ఆ జీవుడే నాడీమండలం మధ్యలో సంచరిస్తూ తైజసభావము పొంది, వాసనారూపంలో ఉన్న జగత్ వైచిత్ర్యాన్ని, తన ఇష్టం వచ్చిన రీతిలో ప్రకాశింపచేస్తూ, స్వేచ్ఛగా విషయాలను అనుభవిస్తున్నాడు. ఇక చిత్తము అనే ఒకే సాధనము గలది సుషుప్తి. ఆహారం కోసం వెళ్ళి తిరిగి వచ్చిన పక్షి రెక్కలు ముడుచుకుని గూటిలోకి పోయినట్లుగా, జీవుడు జాగ్రత్స్వప్న అవస్థలలో ప్రాపంచిక విషయాలనుభవించి, అలసిపోయి, వాటన్నింటినుండి విరమించి, అజ్ఞాన భూమికలో చేరి ఆత్మానందము అనుభవిస్తున్నాడు.

ఆకస్మికంగా ఇనుపగదతోను, కర్రతోను, ఇతర వస్తువులతో కొట్టబడిన వాడిలా భయము, అజ్ఞానముగలవాడై, సర్వేంద్రియాలతో కంపము చెందుతున్నట్లైతే ఆ అవస్థను మరణసన్నిభమైన మూర్ఛావస్థ అంటారు. జాగ్రస్స్వప్న సుషుప్తి, మూర్ఛావస్థల

కన్న వేరైనదై, బ్రహ్మము మొదలు స్తంభము వరకు ఉన్న సమస్త జీవకోటికీ అభయప్రదమైనదై, స్థూలదేహాన్ని విడిపిస్తున్న దైవస్థితి. అదే మరణావస్థ. కర్మేంద్రియాలను, జ్ఞానేంద్రియాలను, వాటి వృత్తులయిన విషయాలను, పంచ ప్రాణాలను వదలిపెట్టి, కామ్యకర్మలతోను, అజ్ఞానముతోను, పంచభూతములతోను కలసి ఉన్న ఈ జీవుడు పునర్జన్మ పొంది ఇతర లోకాలకు పోతున్నాడు. పూర్వకర్మల పరిపాకముతో అతడు సుడిగుండములోని కీటకంలాగా విశ్రాంతి లేకుండా తిరుగుతుంటాడు. సత్కర్మవశాన అనేక జన్మలు జరిగిన తరువాత అతడికి మోక్షము పొందాలనే ఆసక్తి కలుగుతుంది. అప్పుడు సద్గురువునాశ్రయించి, చాలాకాలము అతన్ని సేవించి, మోక్షము పొందుతాడు. మానవుడికి విచారం లేకపోవటంచేత సంబంధము కలుగుతుంది. విచారణ వల్ల మోక్షం కలుగుతుంది. అందువల్ల విజ్ఞుడు ఎల్లప్పుడూ విచారణ చెయ్యాలి. అధ్యారోపములు, అపవాదులచే ఆత్మస్వరూపాన్ని నిశ్చయించాలి. విజ్ఞుడు జగత్తును, జీవుని, పరమాత్మను గురించి ఎప్పుడూ విచారణ చెయ్యాలి. జీవునితత్త్వము, జగత్తత్త్వములను గనక తెలుసుకున్నట్లైతే ప్రత్యక్ స్వరూపమైన బ్రహ్మమే మిగులుతుంది. అంటూ సృష్టి స్థితి లయ కారకుడైన ఈశ్వరుడు ఏ విధంగా జీవభావం అంటే స్థూలశరీరం పొందాడో వివరించాడు రత్నాకరుడు.

6. మాయాస్వరూపము (లలితారహస్యోపనిషత్తు)

గురువుగారూ ! చాలా చిన్న అనుమానం. 'అంతా మాయ' అంటారు కదా ! అసలు మాయ అంటే ఏమిటి ? దాని స్వరూపము ఎటువంటిదో వివరించండి అన్నాడు నారాయణభట్టు చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

నారాయణభట్టూ ! అనుమానం చాలా చిన్నదే కాని అనుభవంలో చాలా పెద్దది. నాబోటివారు తెలుసుకోటానికి అసాధ్యమైనది. అయినప్పటికీ నాకు తెలిసినంతవరకు మాయా స్వరూపాన్ని వివరిస్తాను.

అనాదియైనది. అంతము గలది, ప్రమాణాలకు, అప్రమణాలకు సాధారణమైనది, సత్తుకాదు అసత్తు కాదు, సదసత్తు కాదు. స్వయముగా అధికమైనది. వికారములు లేనిది, నిరూపించటానికి వీలైన లక్షణాలు లేనిది మాయ.

జీవులకు అజ్ఞానము నశించిపోగా, సత్త్వగుణ ప్రధానులైన వారికి పరమేశ్వర సాక్షాత్కారం జరుగుతుంది. అజ్ఞానులకు అది సాధ్యం కాదు. వికారాలకు అంటే మార్పులకు తల్లియై, శాశ్వతమైన భగవదాజ్ఞారూపమైనది మాయ. ఈ మాయవల్లనే జగత్తులో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దీనివల్లనే జగత్తు నిర్మించబడుతోంది. మాయ అనేది పరమేశ్వరుణ్ణి ఆశ్రయించి ఉంటుంది. ఇది గౌరవమైనది. ఆది, అంతము గలది. పుట్టించునది. భూతములందు ప్రకాశించేది. తెలుపు, ఎరుపు, నలుపు మొదలైన రకరకాల రంగులు గలది. రకరకాల రూపాలు గలది. కోరికలు కలిగించేది. కోరికలు తీర్చేది. విషయ శూన్యమైనది. ఈ మాయవల్ల ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు కన్పిస్తుంది. భట్టూ ! నిత్యము సత్యము శాశ్వతము అయినవాడు పరబ్రహ్మ. కాని మాయాప్రభావంతో అతడు లేనట్టుగా అనిపిస్తుంది. అశాశ్వతమైన ఈ జగత్తు, భార్యాపుత్రులు, ధనధాన్యాలు, భోగభాగ్యాలు నిజమైనవి అనిపిస్తాయి. వీటికోసమే మానవుడు ప్రాకులాడతాడు. కాని ఇవన్నీ నశించిపోయేవే. ఎడారిలో ఎండమావిలాగా, సూర్యకాంతిలో ముత్యపుచిప్ప వెండిలాగా కనిపించినట్లు గానే ఈ మాయా ప్రభావంచేత అశాశ్వతమైనవన్నీ శాశ్వతంగా కనిపిస్తాయి. అనిత్యమైనవి నిత్యంగా కనిపిస్తాయి. ఈ మాయా ప్రభావంచేతనే మానవుడు తాను సృష్టించిన ద్రవ్యాన్ని సంపాదించటానికి తాను పరుగులు పెడుతున్నాడు. ఈ జగత్తంతా నిజమనే భ్రమలో ఉంటున్నాడు. ఈ మాయ ఎంత గొప్పది అంటే తనకళ్ళ ఎదురుగా జీవులు మరణిస్తున్నా, కట్టడాలు కూలిపోతున్నా, వస్తువులు నశిస్తున్నా మానవుడు అది నిజమని నమ్మలేడు. చివరకు తనజీవితం శాశ్వతం కాదు. అని తెలిసికూడా దానిమీద వ్యామోహం వదలుకోలేడు. అహంకార మమకారాల నుంచి బయటకు రాలేడు. జీవుడు అవిద్యా సంబంధంచేత మాయ అనే వలలో గట్టిగా చిక్కుకు పోయాడు. సృష్టి జరిగేటప్పుడు ముందుగా అవ్యక్తము, మహత్తత్త్వము, అహంకారము వచ్చినాయి. అహంకారము నుంచి తన్మాత్రలు వాటినుంచి పంచభూతాలు ఉద్భవించాయి. అయితే సృష్టిక్రమంలో మొదటిదయిన అవ్యక్తమే మాయ, అవ్యక్తము అంటే కంటికి కనిపించనిది. అదే మాయ. ఈ మాయ పరమేశ్వరుణ్ణి ఆవరించి ఉంటుంది. అంటే జీవుడికీ, పరమేశ్వరుడికీ మధ్యన అడ్డంగా ఉంటుంది. ఈ మాయను గనక ఛేదించగలిగితే పరమేశ్వర సాక్షాత్కారం జరుగుతుంది.

మాయ అనేది నీటిగుంటలో తేలియాడే నాచువంటిది. ఈ నాచును దూరంగా తోసేస్తే వెళ్ళిపోతుంది. కాని మళ్ళీ వచ్చి చేరుతుంది. అలాగే వేదాంత విచారము సజ్జన సాంగత్యము చేసినంతకాలము ఈ మాయ వదలివేసినట్లుగా కనిపిస్తుంది. కాని ఆ తరువాత వెంటనే వచ్చి చేరుతుంది. అంటే విషయవాంఛలయందు మనసు ఎప్పుడైతే లగ్నమవుతుందో, అప్పుడు మాయ ఆవరించింది అని అర్థం. అయితే ఈ మాయ పరమేశ్వరుణ్ణి ఆవరించిఉంటుంది. కదా ? దీనివల్ల ఆయనకు అపాయం లేదా ? అంటే–జగత్తులో ప్రతిప్రాణీ మాయకు లోబడే ఉంటుంది. ఆ పరమేశ్వరు డొక్కడే మాయకు అతీతుడు. మాయ అనేది పరమేశ్వరుని అధీనంలోనే ఉంటుంది. పాముకోరలలో ఉన్న విషంవల్ల పాముకు ఏ అపాయము జరగదు. కాని దానిచేత కాటు వేయబడ్డ ఇతరులకు మాత్రం హాని కలుగుతుంది. అలాగే, పరమేశ్వరుని ఆవరించిన మాయవల్ల ఆయనకు ఏ అపకారము జరగదు.

మాయచే కప్పబడిన మానవుడు, తాను మాయాప్రభావానికిలోనై ఉన్నాను. అని తెలుసుకున్నట్లైతే మాయ అతణ్ణి విడిచిపెడుతుంది. ఉదా॥ ఒక మనిషికి దెయ్యం పట్టి పిచ్చివేషాలు వేస్తున్నాడు. అతడికి ఆ విషయం తెలియదు. ఒకవేళ అతడికి ఆ విషయం గనక తెలిసినట్లైతే, మరుక్షణమే దెయ్యం అతన్ని వదిలేస్తుంది. అలాగే మాయకూడా,

నిద్రపోతున్నప్పుడు స్వప్నం వస్తుంది. అందులో రకరకాల విషయాలు అనుభవంలోకి వస్తాయి. నిద్రలేచిన తరువాత అదంతా కల, భ్రాంతి అనిపిస్తుంది. అదే విధంగా కంటికి కనిపించే ఈ జగత్తుకూడా ఒక భ్రమ అని నిశ్చయించగలిగితే మాయ విడిపోతుంది. మాయ విడిపోతే భగవత్సాక్షాత్కారము జరుగుతుంది.

జీవాత్మ పరమాత్మల మధ్య మాయ అనే తెర ఉన్నది. అది పరమాత్ముని దర్శించటానికి అడ్డుగా ఉన్నది. ఆ తెరను గనక తొలగించిగలిగితే పరమాత్మ దర్శనం జరుగుతుంది.

మాయ రెండు విధాలుగా ఉంటుంది. 1. విద్యామాయ 2. అవిద్యామాయ.

1. విద్యామాయ : ఇది భగవంతుడి సన్నిధికి తీసుకుపోతుంది. ఇది 1.వివేకము 2. వైరాగ్యము అని రెండు విధాలు. దీనిని ఆశ్రయించినవారు భగవంతుని శరణు పొందుతారు.

2. అవిద్యామాయ : ఇదే అజ్ఞానము. ఇది కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము. అని ఆరువిధాలు. దీనివల్లనే మానవుడికి నేను, నాది అనే బుద్ధి పుడుతుంది. ఈ కారణంగా మానవుడు సంసారానికి బందీ అవుతున్నాడు.

విద్యామాయ వ్యక్తంకాగానే అవిద్యామాయ తొలగిపోతుంది. మురికిగా ఉన్న నీళ్ళలో సూర్యచంద్రుల ప్రతిబింబము కనిపించదు. అలాగే మాయ అనే తెర తొలగి పోనంత వరకు, అంటే నేను నాది అనే అహంకార మమకారాలు నశించనంత వరకు పరమేశ్వర సాక్షాత్కారము జరగదు.

పరమేశ్వరుడు అనే సూర్యుడు ఈ జగత్తు మొత్తాన్ని ప్రకాశింపచేస్తున్నాడు. కాని చిన్న మబ్బు తునక గనక అడ్డు వచ్చినట్లైతే సూర్యుడు కంటికి కనిపించడు. అలాగే మాయ అనే తెర పరమేశ్వరుణ్ణి మనం చూడకుండా కప్పివేస్తున్నది.

చెరువులో నాచు పేరుకొని ఉన్నది. దాన్ని చెదరగొట్టినా మళ్ళీ యథాస్థితికి చేరుతుంది. కాని దానికి ఏదైనా ఒక కర్ర అడ్డుగా పెడితే, అది తిరిగిరాదు. అలాగే జ్ఞానము అనే కర్రతో మాయను నిరోధించినట్లైతే పరమాత్మ దర్శనం కలుగుతుంది.

నిర్మలమైన ఆకాశంలో సూర్యుడు ప్రకాశిస్తుంటాడు. అలాంటప్పుడు ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైతే, సూర్యుడు కనిపించడు. ఆ సమయంలో ఒక్కసారిగా జ్ఞానజ్యోతులు అనే పెనుగాలులు వీచినట్లైతే, అజ్ఞానపు చీకట్లు తొలగిపోయి పరమేశ్వర సాక్షాత్కారం జరుగుతుంది.

మాయకు ఎవరూ అతీతులు కారు. నారదాది మహర్షులు కూడా ఈ మాయలో చిక్కుకున్నారని పురాణాలలో అనేక కథలు చెప్పబడ్డాయి. జ్ఞానజ్యోతులచేత మాత్రమే ఈ మాయను ఛేదించాలి అంటూ మాయాస్వరూపాన్ని వివరించాడు రత్నాకరుడు.

7. శిష్యుల ప్రశ్నలు (నిరాలంబోపనిషత్తు, సర్వసారోపనిషత్తు)

పవిత్ర కృష్ణానదీ తీరంలో నిశ్శబ్దమైన వాతావరణంలో బ్రహ్మ జిజ్ఞాసులైన నారాయణభట్టు, కృష్ణశర్మలు తమ గురువుగారైన రత్నాకరుని ఎదురుగా కూర్చుని ఉన్నారు. గురువుగారు చెబుతున్నారు. "ఎవడు ఆలంబనమును వదలిపెట్టి నిరాలంబనమును ఆశ్రయించునో, అతడు సన్యాసి. యోగి. అటువంటి యోగి కైవల్యము పొందుతాడు." ఆ మాటలువిన్న శిష్యులకు అనుమానం వచ్చింది. అసలు

బ్రహ్మమంటే ఏమిటి ? ఈశ్వరుడెవరు ? జీవుడెవరు ? ఈ రకంగా అనేక ప్రశ్నలు వారి మనసులో చోటు చేసుకున్నాయి. వాటన్నింటినీ ఒకటొకటిగా గురువుగారి ముందు ఉంచుతున్నారు. గురువుగారు సమాధానం చెబుతున్నాడు. ముందుగా నారాయణభట్టు అడుగుతున్నాడు

1. **నారాయణభట్టు :** గురువర్యా ! అసలు బ్రహ్మము అంటే ఏమిటి ?

రత్నాకరుడు : అజ్ఞానులకు మహత్తు, అహంకారముగాను, పంచభూతాలు గాను, బృహద్రూపమైన అండకోశముగాను, కర్మజ్ఞాన ఫలమైన లోకరూపముగాను అనిపిస్తుంది. ఆ బ్రహ్మము అద్వితీయమైనది. రెండవది ఏదీ లేనట్టిది. సకల ఉపాధి వినిర్ముక్తమైనది. సర్వశక్తి సంపన్నమైనది. ఆద్యంతములు లేనిది, శుద్ధమైనది, మంగళకరమైనది, శాంతమైనది, నిర్గుణమైనది, అనిర్వచనీయమైనది.

సత్యజ్ఞానమనంతమైనది ఆ బ్రహ్మము. సత్యము అనగా – నశించనిది. అవినాశి. నాశనము లేనిది. దేశకాల వస్తువులు అన్నీ నశించినా కూడా నశించనిది.

జ్ఞానము అనగా – ఉత్పత్తి వినాశరహితమైనది. ఎడతెగక ఉండునది. స్వయంప్రకాశమైన చైతన్యము. అనంతము అనగా – మట్టితో తయారయిన కుండలోని మట్టిలాగా, బంగారంతో తయారయిన ఆభరణాలలోని బంగారంలాగా, దారంతో తయారైన వస్త్రములలోని దారంలాగా, అవ్యక్తాది వృద్ధి ప్రపంచంలో, సంపూర్ణంగా వ్యాపించి ఉండే చైతన్యము.

ఈ రకంగా సత్యజ్ఞానమనంతమైనదే బ్రహ్మము. ఈసారి కృష్ణశర్మ అడుగుతున్నాడు.

2. **కృష్ణశర్మ :** గురుదేవా ! మరి ఈశ్వరుడంటే ఎవరు ?

రత్నాకరుడు : బ్రహ్మము లాగానే స్వశక్తి నాశ్రయించి ఈశ్వరత్వము పొంది, తనను ఎరుగని వారిచేత తనకన్న వేరుగా ఉన్నట్లు కనిపించే లోకాలను సృష్టించి, ఆ లోకాలయందు తానే అంతర్యామిగా ప్రవేశించి, బ్రహ్మనుండి క్రిమికీటకాలదాకా, అన్ని జీవులయొక్క బుద్ధి, ఇంద్రియాలకు నియంత అయినవాడు.

3. **నారాయణభట్టు :** గురుదేవా ! మరి జీవుడెవరు ?

ఈశ్వరుడే బ్రహ్మ, విష్ణువు, ఈశానుడు, ఇంద్రుడు మొదలగువారికి నామ రూపాల నిచ్చి, అన్నిరకాల స్థూలశరీరాలను అభిమానించే సమిష్టి జీవుడవుతున్నాడు. ఆ సమిష్టి జీవుడు ఒక్కడే అయినప్పటికీ విడివిడిగా దేహాలను అభిమానించటానికి కారణమైన అంతఃకరణ భేదానికి వశమవటంచేత, అసంఖ్యాకమైన జీవకోటి అవుతున్నాడు.

4. నారాయణభట్టు : గురువర్యా ! మరి ప్రకృతి ఎవరు ?

రత్నాకరుడు : బ్రహ్మ నుండి బయటకు వచ్చిన నానావిచిత్రమైన జగత్తును నిర్మించటానికి సమర్థమైన బుద్ధి రూప బ్రహ్మశక్తి.

5. కృష్ణశర్మ : మరి పరమాత్మ ఎవరు ?

రత్నాకరుడు : శరీరాదులకన్న పరుడవటంచేత ఆ బ్రహ్మమే పరమాత్మ అనబడుతున్నది.

6. నారాయణభట్టు : హిరణ్యగర్భుడు అంటే ఎవరు ?

రత్నాకరుడు : ఆ బ్రహ్మమే చతుర్ముఖుడైన కర్మ బ్రహ్మ. అతడే హిరణ్యగర్భుడు.

7. కృష్ణశర్మ : ఈ జగత్తులో వివిధరూపాలలో ఉన్న జీవులెవరు ?

రత్నాకరుడు : ఆ బ్రహ్మమే విష్ణువు. అతడే రుద్రుడు. అతడే ఇంద్రుడు, అతడే యముడు, అతడే సూర్యుడు, అతడే చంద్రుడు. అతడే సర్వదేవతల స్వరూపము. అతడే మానవుడు. అతడే స్త్రీరూపము. అతడే పశువు. అతడే పక్షి. బ్రహ్మక్షత్రియ వైశ్యశూద్రులని చెప్పబడే చాతుర్వర్ణాల వారి స్వరూపము అతడే జగత్తులో పిపీలికాది బ్రహ్మపర్యంతము ఉన్నది. అతడొక్కడే. ఈ సర్వము పరబ్రహ్మమయమే. ఇందులో బ్రహ్మనుంచి బ్రాహ్మణులవరకు ఏ మాత్రము తేడాలేదు. జగత్తంతా పరబ్రహ్మ స్వరూపమే. పరమేశ్వర మయమే.

8. కృష్ణశర్మ : గురుదేవా ! జాతి అంటే ఏమిటి ?

రత్నాకరుడు : చర్మానికి జాతిలేదు. రక్తానికి జాతిలేదు. మాంసానికి అంతకన్నా లేదు. ఆస్తికీ, ఆత్మకూ జాతి అనేది లేదు. కాని కేవలము వ్యవహారానికి మాత్రమే జాతి ఉన్నది. ఇది కేవలము లౌకికమైనది.

9. నారాయణభట్టు : గురువర్యా ! మరి కర్మ అంటే ఏమిటి ?

రత్నాకరుడు : కర్మేంద్రియాలు కర్మను చేస్తుంటాయి. అలాంటప్పుడు ఆ కర్మను నేను చేస్తున్నాను అని అధ్యాత్మనిష్ఠగా చేసేదే కర్మ.

10. కృష్ణశర్మ : మరి నిష్కామ్యకర్మ ఏది ?

రత్నాకరుడు : కర్మ అనేది జన్మజన్మల బంధము. ఈ విషయం తెలిసి నిత్య నైమిత్తిక కర్మలు, యాగాలు, వ్రతాలు, తపస్సు, దానము మొదలైనవి చేస్తున్నప్పటికీ, కర్మఫలంతో నిమిత్తం లేకుండా చేసేదే నిష్కామ్యకర్మ.

11. నారాయణభట్టు : గురుదేవా ! జ్ఞానము అంటే ఏది ?

రత్నాకరుడు : దేహము, ఇంద్రియము అనే సంశయంచేత, సద్గురువును ఉపాసించటం చేత, శ్రవణమువల్ల, నిధి ధ్యానమువల్ల, దృక్కు, దృశ్యము అంతా సర్వాంతర్యామియై ఉన్నది. సర్వసమానమైనది. ఘటపటాది వికార వస్తువులయందు వికార రహితమైన చైతన్యము తప్ప ఇంకొకటి ఏదీ ఇక్కడ లేదు. అనే విషయం సాక్షాత్కరించటమే జ్ఞానము.

12. కృష్ణశర్మ : గురుదేవా ! మరి అజ్ఞానము అంటే ఏది ?

రత్నాకరుడు : తాడును చూసి పాము అనుకొన్నట్లుగానే కేవలము సర్వాంతర్యామి, సర్వరూపము అయిన బ్రహ్మమునందు దేవతలు, పశువులు, పక్షులు, మానవులు, స్త్రీలు, పురుషులు, వర్ణాశ్రమాలు, బంధమోక్షాలు మొదలైన అనేక భేదములచేత కల్పితమైన విజ్ఞానమే అజ్ఞానము.

13. నారాయణభట్టు : గురుదేవా ! సుఖమంటే ఏది ?

రత్నాకరుడు : సచ్చిదానంద స్వరూపం తెలుసుకుని ఆనందరూపంతో ఉండటమే సుఖము.

14. కృష్ణశర్మ : గురువుగారూ ! మరి దుఃఖమంటే ఏమిటి ?

రత్నాకరుడు : అనాత్మ విషయాలయొక్క సంకల్పమే దుఃఖము.

15. నారాయణభట్టు : ఏది స్వర్గము ?

రత్నాకరుడు : సజ్జన సాంగత్యమే స్వర్గము.

16. కృష్ణశర్మ : మరి నరకమంటే ఏది ?

రత్నాకరుడు : సంసారపరమైన విషయవాంఛలలో పడి కొట్టుమిట్టాడటమే నరకము.

17. నారాయణభట్టు : బంధము అంటే ఏమిటి ?

రత్నాకరుడు : అజ్ఞానవాసనచేత "నేను జన్మించాను. నేను ఉన్నాను." మొదలైన సంకల్పాలను కలిగి ఉండటమే బంధము. తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, ఆస్తిపాస్తులు వీటియందు మోహము కలిగి ఉండటమే బంధము. కర్తృత్వము, అహంకారములను గూర్చిన సంకల్పమే బంధము. అష్టైశ్వర్యాలను గూర్చిన ఆశ, వాటిని గూర్చిన సంకల్పము బంధము. కేవలము సంకల్పమే బంధము. అష్టసిద్ధులమీద ఆశ, అష్టాంగయోగాభ్యాసము మీద సంకల్పము, వర్ణాశ్రమాలు, ధర్మకర్మ సంకల్పము, ఆజ్ఞ, భయము, సంశయము మొదలైనవి ఆత్మ గుణాలుగా భావించటం బంధము. యజ్ఞాలు, యాగాలు, వ్రతాలు, తపస్సు, వీటి విధి విధానాల సంకల్పము బంధము. కేవలము మోక్షాపేక్ష కూడా బంధమే. సంకల్పమాత్రంచేత సంభవించేదంతా బంధమే. ఆత్మేశ్వరుడైన జీవుడు అనాత్మరూపమైన శరీరాదులను, ఆత్మగా భావించి అభిమానిస్తున్నాడు. ఆ శరీరాభిమానమే ఆత్మకు బంధము.

18. కృష్ణశర్మ : గురువుగారూ ! మరి మోక్షము అంటే ఏమిటి ?

రత్నాకరుడు : నిత్యానిత్య వస్తు విచారణచేత, అనిత్యమైన సంసార దుఃఖ విషయాలను సమస్త వస్తువుల యందు మమకార బంధక్షయమే మోక్షము. శరీరాభిమానము పూర్తిగా పోవటమే మోక్షము.

19. నారాయణభట్టు : ఉపాస్యుడెవరు ?

రత్నాకరుడు : సర్వజీవుల శరీరములందు ఉన్న చైతన్య బ్రహ్మమును పొందించు గురువే ఉపాసింపదగినవాడు.

20. కృష్ణశర్మ : గురుదేవా ! మరి శిష్యుడవెరు ?

రత్నాకరుడు : విద్యచేత తనకన్న వేరైన జగత్తంతా అదృశ్యమైనప్పుడు, తనకన్న వేరైన వస్తువు ఏదీ లేక తాను ఒక్కడుగానే మిగిలినవాడు.

21. నారాయణభట్టు : మరి విద్వాంసుడు ఎవరు ?

రత్నాకరుడు : బ్రహ్మము మొదలు స్తంభము వరకు సమస్తమునందు స్వరూప జ్ఞానము తెలుసుకున్నవాడు.

22. కృష్ణశర్మ : మూఢుడెవరు ?

రత్నాకరుడు : శరీరములందు, వర్ణములయందు, ఆశ్రమములయందు, కర్తృత్వభోక్తృత్వాదుల యందు అహంకారభావన గలవాడు.

23. నారాయణభట్టు : అసురము ఏది ?

రత్నాకరుడు : బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు మొదలైన వారిని ఉద్దేశించి భోగభాగ్యములు, సిరిసంపదలు సాధించటానికి ఉపాసన, జపము, అగ్నిహోత్రముల చేత అంతరాత్మను తపింపచేస్తూ, అతి ఉగ్రమైన రాగము, ద్వేషము, హింస, దంభము మొదలైన వాటిచే ఆచరించే తపస్సే అసురము.

24. కృష్ణశర్మ : మరి తపస్సు ఏది ?

రత్నాకరుడు : పరబ్రహ్మను పొందాలి అనే ఆశతో 'బ్రహ్మసత్యము – జగన్మిథ్య' అనే భావము పొంది అజ్ఞానాన్ని జ్ఞానాగ్నిలో మండింపచేయుటయే తపస్సు.

25. నారాయణభట్టు : పరమపదమేది ?

రత్నాకరుడు : ప్రాణాలు, ఇంద్రియాలు, అంతఃకరణ మొదలైన వాటికన్న వేరైనది, సచ్చిదానందమయము, నిత్యము, ముక్తము అయిన బ్రహ్మస్థానమే పరమపదము.

26. కృష్ణశర్మ : ఏది నిగ్రహింపదగినది ?

రత్నాకరుడు : దేశకాల వస్తు పరిచ్ఛేదములేని చిన్మాత్ర స్వరూపము.

27. నారాయణభట్టు : ఏది గ్రహింపదగినది ?

రత్నాకరుడు : సర్వరూప వ్యతిరిక్తమైనది. మాయామయమైన బుద్ధి, ఇంద్రియాలకు గోచరమైనది, ఈ జగత్తు అంతా అసత్యము అనే భావన.

28. కృష్ణశర్మ : సన్యాసి ఎవడు ?

రత్నాకరుడు : ప్రాపంచిక విషయాలను పరిత్యజించి, నిర్మలుడు, నిరహంకారుడు అయి, తనకు ఇష్టమైన బ్రహ్మను శరణువేడి, తత్త్వమసి, అహం బ్రహ్మాస్మి మొదలైన మహావాక్యములయొక్క అర్థాన్ని అనుభవంలోకి తెచ్చుకుని, నేనే బ్రహ్మను అని నిశ్చయంగా తెలుసుకుని, నిర్వికల్ప సమాధితో కూడిన స్వతంత్రుడైన యతి సన్యాసి అనబడతాడు. అతడే ముక్తుడు. పూజ్యుడు. పరమయోగి, అతడే పరమహంస, అతడే బ్రాహ్మణుడు. అతడే సన్యాసి.

29. నారాయణభట్టు : జాగ్రదవస్థ అంటే ఏది ?

రత్నాకరుడు : జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, అనే 14 ఇంద్రియములచేత స్థూలమైన శబ్దాది విషయాలనుగ్రహించే స్థితి.

30. కృష్ణశర్మ : స్వప్నావస్థ ఏది ?

రత్నాకరుడు : శబ్దాది విషయాలు లేకపోయినా ఆ కాలములో కలిగిన వాసనామయమైన శబ్దాదులను జాగ్రదవస్థ యొక్క వాసనలతో కలిసిన కరణములచేత గ్రహించటమే స్వప్నావస్థ.

31. నారాయణభట్టు : సుషుప్తి అంటే ఏమిటి ?

రత్నాకరుడు : పద్నాలుగు కరణముల ప్రవృత్తి లేకుండా ఉండటంచేతను, విశేషజ్ఞానము లేనందువల్ల, శబ్దాది విషయాలను తెలుసుకునే స్థితి.

అజ్ఞానంవల్ల పామరులకు ఈ లోకమంతా అసత్తు అయినప్పటికీ వాస్తవంగా కనిపిస్తుంది. లౌకికులకు సత్యబుద్ధిని ఇస్తుంది. ఈ అజ్ఞానము ఇదమిద్ధమని నిర్వచించటానికి వీలుకాదు. వాసనలతో కూడిన చతుర్దశ కరణములు, వాసనామయమైన శబ్దాదులను ఎప్పుడు అనుభవిస్తామో, అప్పుడు జీవుడికి స్వప్నం కలుగుతుంది. చతుర్దశకరణములు పరిణమించినప్పుడు విశేషజ్ఞానము లేనందున శబ్దాదులను పొందేటప్పుడు ఆత్మకు సుషుప్తి కలుగుతుంది.

32. కృష్ణశర్మ : తురీయము అంటే ఏమిటి ?

రత్నాకరుడు : జాగ్రస్వప్న సుషుప్తుల భావాభావములకు సాక్షిగను, భావాభావములు తనకు లేకుండ నిరంతర చైతన్యమాత్రముగా ఉండే స్థితి.

33. నారాయణభట్టు : అన్నమయకోశము అంటే ఏది ?

రత్నాకరుడు : అన్నమువలన కలుగు కార్యక్రమముల యొక్క సమూహము. ఇదే స్థూలశరీరము.

34. కృష్ణశర్మ : ప్రాణమయకోశము అంటే ఏది ?

రత్నాకరుడు : ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన, నాగ, కూర్మ, కృకుర, దేవదత్త ధనంజయములు అనే పది వాయువులతో నిండిన కోశమే ప్రాణమయకోశము.

35. నారాయణభట్టు : మనోమయకోశము అంటే ఏది ?

రత్నాకరుడు : జ్ఞానేంద్రియాలు మనస్సు, కలిసి మనోమయ కోశము అంటారు. నేను నాది అనే సంకల్ప వికల్పాలకు హేతువు ఇదే.

36. కృష్ణశర్మ : విజ్ఞానమయకోశము అంటే ఏది ?

రత్నాకరుడు : జ్ఞానేంద్రియాలతోను, వృత్తులతోను కూడిన బుద్ధియే విజ్ఞానమయకోశము. ఇది పురుషుని జనన మరణరూపమైన సంసారానికి కారణము. ఇంకా చెప్పాలి అంటే, పై మూడు కోశాలతో కూడిన అంతఃకరణయందు వాటిలోగల విశేషమును గూర్చి ధ్యానమనసాది వృత్తులు ఎక్కడ కలుగుతాయో అది విజ్ఞానమయకోశము అవుతుంది.

37. నారాయణభట్టు : ఆనందమయకోశము అంటే ఏది ?

రత్నాకరుడు : అజ్ఞానంతో పైన చెప్పిన నాలుగు కోశాలతో కూడి ఉన్నప్పుడు వటబీజములో వటవృక్షము అణిగి ఉన్నట్లుగా, స్వరూప సుఖమందు తనయొక్క కారణజ్ఞానము అణిగి ఉన్నప్పుడు అది ఆనందమయకోశము అనబడుతుంది.

స్వరూప సుఖమునందు వటబీజమందు వృక్షములాగా ప్రవర్తించుకోశమే ఆనందమయకోశము.

ఆనంద స్వరూపమైన ఆత్మయొక్క ప్రతిబింబముచేత తాకబడినటువంటి, తమోగుణంవల్ల ప్రకటితమైనటువంటి వృత్తిని ఆనందమయకోశము అంటారు. ఇది ప్రియము, మోదము, ప్రమోదము అనే మూడు గుణాలతో కలిసి ఉంటుంది. ఇదికూడా అజ్ఞానంతో కూడినదే.

38. కృష్ణశర్మ : కర్త ఎవరు ?

రత్నాకరుడు : సుఖము, దుఃఖము, బుద్ధిననుసరించి, వాటి కోరికతో దేహాంతః కరణ గలవాడు.

39. నారాయణభట్టు : జీవుడెవరు ?

రత్నాకరుడు : సుఖబుద్ధి – ఇష్టబుద్ధి, దుఃఖబుద్ధి – అనిష్టబుద్ధి, ఈ సుఖ దుఃఖాలకు, శబ్ద స్పర్శ రూప రస గంధాలు కారణాలు. పుణ్యపాప కర్మానుసారంగా లభించిన దేహాన్ని తాను ఆ విధంగా లభించిన దేహంలాగా భావించి, దేహాత్మబుద్ధితో ఉన్నవాడు జీవుడు.

40. కృష్ణశర్మ : పంచవర్గులు అంటే ఏవి ?

రత్నాకరుడు : 1. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, 2. పంచప్రాణాలు, 3. సత్త్వరజస్తమోగుణాలు 4. పంచభూతాలు 5. పాపపుణ్యాలు

వీటితోకూడిన శరీరము అజ్ఞానమయమైనది.

41. నారాయణభట్టు : లింగశరీరమేది ?

రత్నాకరుడు : పంచవర్గ ధర్మము గలది, జ్ఞానమువల్ల తప్ప మరి దేనికీ నశించనిది. ఆత్మసాన్నిధ్యముతో నిత్యమైనదిగా కనుపించేది. ఆత్మోపాది అయినది లింగశరీరము. అదే హృదయ గ్రంథి.

42. కృష్ణశర్మ : క్షేత్రజ్ఞుడు ఎవరు ?

రత్నాకరుడు : హృదయగ్రంథి యందు ప్రతిఫలించి ప్రకాశిస్తున్న చైతన్యమే క్షేత్రజ్ఞుడు.

43. నారాయణభట్టు : సాక్షి అనగా ఎవరు ?

రత్నాకరుడు : తెలుసుకొనువాడు. తెలియబడునది. వీటిలో ఆవిర్భావ తిరోదానములను తెలుసుకొనువాడుగను, ఆవిర్భావతిరోదానములు లేనివాడుగను, స్వయంప్రకాశము గలవాడుగను, ఉండేవాడు.

44. కృష్ణశర్మ : కూటస్థుడు ఎవరు ?

రత్నాకరుడు : పిపీలికాది బ్రహ్మపర్యంతము సకల ప్రాణులయొక్క బుద్ధి గుహలో అధిష్ఠించి ఉన్నవాడు. సకల ప్రాణులయొక్క బుద్ధికి స్థానమైన ఆత్మగా ప్రకాశించేవాడే కూటస్థుడు.

45. నారాయణభట్టు : అంతర్యామి ఎవరు ?

రత్నాకరుడు : తనతో కూడి ఉండు కూటస్థుడు మొదలైన వారితో భేదములుగల స్వరూపమును తెలుసుకొనే విషయంలో హేతువుగను, అన్ని దేహాలలోను మణులలో దారంలాగా లోపల ఉండి నియమించువాడుగా ప్రకాశించే ఆత్మే అంతర్యామి.

46. కృష్ణశర్మ : ప్రత్యగాత్మ ఎవరు ?

రత్నాకరుడు : సత్యజ్ఞానమనంతమైనది, ఆనందమైనది, అన్ని రకాలయిన శరీర ఉపాధులు లేనిది, కటక మకుటాది భూషణ భేదములు లేని బంగారుముద్ద వంటిది, విజ్ఞానఘనమైనది, చిత్స్వభావమైనది, ఆత్మచైతన్యమైనది, బ్రహ్మమైనది, ప్రకాశించునది, అవిద్యోపాధికి లోబడినది అయిన త్వం పదార్థము ప్రత్యగాత్మ.

47. నారాయణభట్టు : పరమాత్మ అనగా ఏది ?

రత్నాకరుడు : ఆనందమగు సుఖచైతన్య స్వరూపము. అపరిమితానంద సముద్రము, అవశిష్టము అయిన సుఖస్వరూపము. సత్యము, జ్ఞానము, అనంతము, ఆనందము, లక్షణములుగా గలది పరమాత్మ. ఉపాధికమైన త్వం పదార్థముకన్న, ఔపాధిక భేదమైన తత్ పదార్థముకన్న, విలక్షణముగా ఉన్నది. ఆకాశములాగా శూన్యమైనది. కేవలము సత్తా సూత్రా స్వభావముగలది పరమాత్మ.

48. కృష్ణశర్మ : మాయ అంటే ఏది ?

రత్నాకరుడు : అనాదియైనది. అంతముగలది. ప్రమాణాలకు, అప్రమాణాలకు సాధారణమైనది. సత్తు కాదు అసత్తు కాదు సదసత్తు కాదు. స్వయముగా అధికమైనది. వికారములు లేనిది. నిరూపించటానికి వీలైన లక్షణాలు లేనిది మాయ.

49. నారాయణభట్టు : సత్యము అంటే ఏది ?

రత్నాకరుడు : సత్తు అనే శౌతప్రతీతికి లక్ష్యమైనది. అసత్తు అని చెప్పరానిది. త్రికాల బాధ్యమైనది. మూడుకాలములందు ఉండేది. అస్తి రూపమైనది. రెండవది

లేనిది. సజాతి విజాతి భేదములు లేనిది. సర్వకల్పనలకు అధిష్ఠానమైనది. నాశనము లేనిది. దేశకాలవస్తు నిమిత్తాదులు సర్వమూ నశించిననూ నశించనిది.

50. కృష్ణశర్మ: జ్ఞానమనగా ఏది ?

రత్నాకరుడు: స్వయంగా ప్రకాశించేది. అన్నింటినీ ప్రకాశింపచేసేది. చిన్మాత్ర రూపమైనది.

51. నారాయణభట్టు: అనంతమనగా ఏది ?

రత్నాకరుడు : ఉత్పత్తి వినాశరహితమైనది. షడ్భావవికార రహితమైనది. సర్వోపాధి వినుర్ముక్తమైనది. మట్టితో చేసిన కుండలోని మట్టిలాగా, బంగారు ఆభరణాలలోని బంగారంలాగా, దండలోని దారంలాగా, అవ్యక్తాది సృష్టి ప్రపంచంలో వ్యాపకముగా ఉండేది. నాశనము లేనిది. చైతన్యమైనది.

52. కృష్ణశర్మ: ఆనందమనగా ఏది ?

రత్నాకరుడు: నీటికి సముద్రంలాగా సుఖచైతన్యానికి అధిష్ఠానమైనది. నిత్యశుద్ధ అఖండాద్వైత చిదానందైకరసము.

53. నారాయణభట్టు: పదార్థాలు ఎన్ని విధాలు ?

రత్నాకరుడు: సత్తు, అసత్తు, మిథ్య అని పదార్థాలు మూడు రకాలు. వీటిలో సత్తు బ్రహ్మము. లేనిది అసత్తు. లేని జగత్తును బ్రహ్మమునందు ఆరోపించటమే మిథ్య. బ్రహ్మమే ఆత్మగా తెలుసుకోవాలి. అనాత్మ అయిన శరీరము మొదలైన వాటిని, సమూలంగా నివృత్తి చేసుకుని సత్తా మాత్రమైన పరబ్రహ్మమందు లయం చెందటమే బ్రహ్మజ్ఞానము. జీవుడు మొదలు ఆకాశం వరకు గల ప్రపంచం అంతా అనాత్మయే. అనాత్మకు మూలమైనది మాయ. అటువంటి మాయ ఆకాశంలో మేఘాలు కనిపిస్తున్నట్లుగా బ్రహ్మమునందు కనిపిస్తున్నది. ఈ మాయ అనాదియైనది. అంతముగలది. ప్రమాణ అప్రమాణాలాకు పొత్తైనది. అది ఉన్నది కాదు. లేనిది కాదు. ఈ రెండింటికీ చెందనిది అసలుకాదు. వాక్కుకు అందనిది. విద్వాంసులచేత వర్ణింపబడు హెచ్చుతగ్గులైన భేద వ్యవహారములు గలది. యదార్థముగా లేనిది. ఆ మాయే మూలప్రకృతి. అవిద్య మొదలైన అనేక రూపాలు గలది. ప్రపంచాకారముగా పరిణమించి ఉండేది. బ్రహ్మజ్ఞాని మాయను ఈ రకంగా తెలుసుకుంటాడు.

54. కృష్ణశర్మ: బ్రహ్మస్వరూపుడు ఎవరు ?

రత్నాకరుడు : నేను శరీరరమునుగాను, దశేంద్రియాలు అంతకన్నా కాను, మనస్సు, బుద్ధి, ఈశ్వరుడు అసలే కాను. అహంకారము అంతకన్నా కాను. నేను ప్రాణరహితుడను. మనోరహితుడను, పరిశుద్ధుడను, బుద్ధ్యాదులకు సర్వదా సాక్షీభూతుడను. సదానిత్యుడను. చిన్మాత్రుడను. నేను కర్తనుగాను, భోక్తనూకాను, ప్రకృతికి సాక్షిస్వరూపంగా ఉండేవాడను. నాతో కలిసి ఉన్నందువల్ల దేహాదులు చైతన్యవంతములై పనులు చేస్తున్నాయి. నేను నిశ్చలుడను, నిత్యుడను. సదా ఆనంద స్వరూపుడను. శుద్ధుడను. సదాజ్ఞానమయుడను, నిర్మలుడను. సర్వభూతములయొక్క ఆత్మను. సర్వవ్యాపకుడను. సర్వవేదాంత వేద్యమైన బ్రహ్మమును నేను. నేను అజ్ఞేయుడను. ఆకాశాది పంచ భూతములు నేను కాను. నామములు నేను కాను, కర్మలు నేను కాను, సచ్చిదానందమయమైన బ్రహ్మమును నేనే. నేను దేహాన్ని కాదు కాబట్టి నాకు జనన మరణాలు లేవు. నేను ప్రాణిని కాదు కాబట్టి ఆకలిదప్పికలు నాకు ఉండవు. నేను కర్తను కాను బంధమోక్షాలు నాకు లేవు. నేనే పరబ్రహ్మను. అని త్రికరణశుద్ధిగా భావించగలిగినవాడే బ్రహ్మస్వరూపుడు. అతడే పరబ్రహ్మ. అంటూ శిష్యుల అనుమానాలు తీర్చాడు రత్నాకరుడు.

8. బ్రాహ్మణుడు ఎవరు ? (వజ్రసూచికోపనిషత్తు)

గురువుగారూ ! బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర అని నాలుగు వర్ణాలున్నాయి. అందులో బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు అని చెబుతున్నారు. ఇక్కడ నాది ఒకచిన్న అనుమానం. బ్రాహ్మణుడు అంటే ఎవరు ? జీవుడా ? దేహమా ? వర్ణమా ? జ్ఞానమా ? కర్మమా ? ధర్మమా ? ఈ విషయం నాకు వివరించండి" అని అడిగాడు నారాయణభట్టు. శిష్యుని ప్రశ్నకు తలపంకించినవాడై చిరునవ్వు నవ్వి సమాధానం చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

నారాయణభట్టారకా ! విరాడ్రూపాన్ని వివరిస్తూ పరమేశ్వరుని ముఖాన్నుంచి బ్రాహ్మణుడు ఉద్భవించాడు అని చెప్పటం జరిగింది. అనాదిగా బ్రాహ్మణుడు వేదవేదాంగాలను అభ్యసిస్తున్నాడు. అగ్నికార్యం చేస్తున్నాడు. యజ్ఞాలు యాగాలు కూడా చేస్తున్నాడు. అతడు ఉత్తముడు, శ్రేష్ఠుడు అనటంలో సందేహం ఏ మాత్రంలేదు.

కాని రాను రాను ఈ చాతుర్వర్ణాలు శాఖోపశాఖలుగా పెరిగి కులాలు అయినాయి. ఈ రోజున జనులందరూ కూడా భుక్తి గడవటం కోసం అనేక పనులు చేస్తున్నారు. కులవిద్యకు ఆదరణ కరువైంది. అందుచేత బ్రాహ్మణకులంలో పుట్టినవారు కూడా వేదాధ్యయనం మానివేసి బతుకుబాటలో ఇతర వృత్తులు చేపడుతున్నారు. మిగిలిన వారితో పాటుగానే జీవిస్తున్నారు. ఇప్పుడు వేదాధ్యాయనం చెయ్యనివాడు, యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించనివాడు, కనీసం సంధ్యావందనం కూడా చెయ్యనివాడు బ్రాహ్మణకులంలో పుట్టిన మాత్రంచేత బ్రాహ్మణుడౌతాడా ? అనే అనుమానం వచ్చింది. ఈ అనుమానం ఇప్పుడు కాదు, ఇంతకుముందే వచ్చింది. దానికి సమాధానం చెబుతాను వినవలసినది.

'జీవుడే బ్రాహ్మణుడు' అని చెప్పటానికి వీలులేదు. ఎందుకంటే గతంలో జరిగిపోయినవి. భవిష్యత్తులో వచ్చేవి అనేక దేహాలు జీవుడికి ఉన్నాయి. అంటే ఈ జీవి అనేక జన్మలు ఎత్తుతాడు. ఇక్కడ జన్మలు అనేకం. కాని జీవుడు ఒక్కడే. జీవుడు తాను చేసిన కర్మవల్లనే అనేక జన్మలు ఎత్తుతున్నాడు. అనేక శరీరాలు ధరిస్తున్నాడు. అన్ని శరీరాలలోనూ కూడా జీవుడు ఒకేరూపంలో ఉన్నాడు. క్రిమి కీటకాదుల దగ్గరనుంచీ మానవుడిదాకా 84 లక్షల రకాల జీవజాలమున్నది. తాను చేసిన కర్మవల్ల భిన్న శరీరాలు ధరించే జీవుడే బ్రాహ్మణుడు అని చెప్పటం సరికాదు.

పోనీ దేహమే బ్రాహ్మణుడా ? అంటే కాదు. అని చెప్పాలి. ఈ దేహము పంచభూతాలతో నిర్మించబడింది. అన్ని వర్ణములవారికి, అన్ని కులముల వారికి, అన్ని మతములవారికీ ఒకే రకమైన శరీరమున్నది. బాల్య, కౌమార, యౌవన, వృద్ధాప్య దశలందరికీ సమానమే. జరామరణాలు అన్ని దేహాలకు ఉన్నాయి. కర్మలు, ధర్మాలు అందరికీ ఒకటే. బ్రాహ్మణుడు తెల్లగా ఉండాలని, వైశ్యుడు నల్లగా ఉండాలనీ నియమం ఏదీ లేదు. కాబట్టి ఈ దేహము బ్రాహ్మణుడు కాదు.

వర్ణమే బ్రాహ్మణుడా ? అంటే చాతుర్వర్ణాలలో మొదటివాడు బ్రాహ్మణుడా ? కాదు కదా ! ఒకే వర్ణంలో భిన్నవర్ణాలున్నాయి. అంతేకాదు ఋష్యశృంగుడు జింకవల్ల, కౌశికుడు దర్భనుండి, జంబూక మహర్షి జంబుకమువల్ల, వ్యాసుడు మత్స్యగంధివల్ల, గౌతముడు కుందేటివీపునుండి, వశిష్టుడు ఊర్వశివల్ల, అగస్త్యుడు కుండనుండి

పుట్టారు. వీరందరూ తమజాతి ప్రవృత్తి లేకుండా జ్ఞానులైనారు. మహర్షులైనారు. కాబట్టి వర్ణమే బ్రాహ్మణుడు కాదు.

జ్ఞానమే బ్రాహ్మణుడా? కాదు. ఎందుచేతనంటే జ్ఞానము కలిగినవారు క్షత్రియులు చాలామంది ఉన్నారు. మిథిలానగరాన్ని పాలించిన జనకమహారాజు, కాశీరాజు అశ్వపతి, మహావృషసామ్రాజ్యాన్ని పాలించిన జానశృతి వంటివారు మహాజ్ఞానులు. కాబట్టి జ్ఞానముగలవాడు బ్రాహ్మణుడు కాదు.

కర్మలు చేసేవాడు బ్రాహ్మణుడా? కాదు. ప్రతివ్యక్తికీ 1. ప్రారబ్ధము 2.సంచితము 3. ఆగామి అని మూడు కర్మలున్నాయి. కర్మవలన ప్రేరేపితులైన జీవులు ఆ కర్మలను చేస్తారు. కాబట్టి కర్మ చేసేవాడిని బ్రాహ్మణుడు అనరాదు.

ధార్మికుడు బ్రాహ్మణుడా ? కాదు. ఎందుచేత అంటే దానం చేసేవారు అనేక మంది ఉన్నారు. బలిచక్రవర్తి వంశనాశనం అవుతుందని తెలిసికూడా మూడడుగులు దానమిచ్చాడు. శిబిచక్రవర్తి తన శరీరాన్ని కోసి దానమిచ్చాడు. ఇలాటివారు అనేక మంది ఉన్నారు. వారు బ్రాహ్మణులు కారు. అందుచేత ధార్మికుడు బ్రాహ్మణుడుకాదు.

మరి బ్రాహ్మణుడంటే ఎవరు ?

అద్వితీయుడు, జాతి, గుణ, క్రియారహితుడు, షడూర్ములు, షడ్భావాలు, షడ్వికారాలు లేనివాడు. సత్య జ్ఞాన ఆనంద స్వరూపుడు, నిర్వికల్ప సంకల్పుడు, సకల సంకల్పాలకు ఆధారమైనవాడు, సమస్తభూతాలకు అంతర్యామి, ఆకాశంలాగా బాహ్యాంతరాలలో అంతటా వ్యాపించినవాడు, అవిచ్ఛిన్నమైన ఆనందముగలవాడు. అప్రమేయుడు, స్వానుభవముతో మాత్రమే గ్రహింపదగినవాడు, స్వయంప్రకాశి, భగవంతుని సాక్షాత్కారము పొంది కృతార్థుడైనవాడు, దోషరహితుడు, శాంతి మొదలైన సద్గుణాలు గలవాడు, అరిషడ్వర్గాలను జయించినవాడు, దంభము, అహంకారము లేనివాడు బ్రాహ్మణుడు. అని స్మృతులు, పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్నాయి. అంటూ బ్రాహ్మణుడు ఎవరో, అతని మార్గమేదో వివరించాడు రత్నాకరుడు.

9. బాహ్యాత్మ, అంతరాత్మ, పరమాత్మ (ఆత్మోపనిషత్తు)

"గురువుగారూ ! బాహ్యాత్మ, అంతరాత్మ, పరమాత్మ. ఈ పదాలను తరచు వింటూ ఉంటాము. ఆ మూడింటికీ మధ్య తేడా ఏమిటో ? వివరించవలసింది" అని అడిగాడు కృష్ణశర్మ. సమాధానం చెప్పటానికి ఉద్యుక్తుడవుతున్నాడు రత్నాకరుడు.

చరాచర జగత్తుకంతటికీ ఆధారమైన వాడు పరమేశ్వరుడు. ఆ పరమపురుషుడే మూడు రూపాలు ధరించాడు. అవి 1. బాహ్యాత్మ 2. అంతరాత్మ 3. పరమాత్మ

1. బాహ్యాత్మ : జన్మించటము, నశించటము, అనే ధర్మాలుగల చర్మము, మాంసము, రోమాలు, కాళ్ళు, చేతులు, గోళ్ళు, పొట్ట, నాభి, కనులు, ముక్కు చెవులు, ముఖము, ఎముకలు, మజ్జ, శుక్రము, శోణితము, శిరస్సు మొదలైన వివిధాంగాలు కలసిన స్థూలశరీరమే బాహ్యాత్మ అనబడుతుంది.

2. అంతరాత్మ : ఆ పరమపురుషుడే పృథివి, ఆపః, తేజో, వాయు, ఆకాశమయుడై అంటే పంచీకృతమైన భూతములనుండి జన్మించినవాడై, రాగద్వేషాలతో, సుఖదుఃఖాలతో, కామక్రోధాదులతో, సంకల్ప వికల్పాలతో, ఇంకా జ్ఞాపకశక్తి, ఉదాత్త, అనుదాత్త, హ్రస్వ, దీర్ఘ, ప్లుత, స్ఖలిత, గర్జిత, స్ఫుటిత, ముదిత మొదలైన అనుభవాలతో, నృత్య, గీత, వాద్య, ప్రళయ విజృంభితాదులతో, శ్రవణము చేసేవాడై, ఘ్రాణముచేసేవాడై, ఆనందించేవాడై, నియంతమై, బోధించువాడై, కర్తృత్వముగలవాడై, విజ్ఞానాత్మయై ఉండే పురుషుడే అంతరాత్మ. ఈ అంతరాత్మయే పురాణాలను, న్యాయ, మీమాంస, తర్క ధర్మ శాస్త్రాలను వివరిస్తున్నాడు. వాసన చూడటము, ఆకర్షించటము మొదలైన కర్మ విశేషాలను చేస్తున్నాడు.

3. పరమాత్మ : పరమాత్మ అక్షర రూపంలో ఉపాసింపదగినవాడు. అతడే సృష్టి స్థితి లయాలకు కారణమైనవాడు. ఆద్యంతములు లేనివాడు. నిరాకారుడు, నిరంజనుడు, నిర్గుణుడు. సత్యము, నిత్యము అయినవాడు. సర్వాంతర్యామి. సర్వవ్యాపి. ఆ పరమేశ్వరుణ్ణి యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానము, సమాధి మొదలైన యోగ ప్రక్రియలతో ఉపాసించటం జరుగుతుంది. అతడు తలవెంట్రుకలో వెయ్యోవంతు (అణుమాత్రుడై) ఉన్నాడు. ఆ పరమాత్మ పొందబడడు, జన్మించడు, మరణించడు, శుష్కింపడు, తడుపబడడు,

దహించబడడు, కదలింపబడడు, భేదింపబడడు. అతడు నిర్గుణుడు. జగత్తులో జరిగే విషయాలన్నింటికీ అతడే సాక్షి. భూతభావనుడు. అనగా భూతములను అభివృద్ధి చేసేవాడు. ఆ పరమాత్మ పరిశుద్ధమైనవాడు. అతడికి కాళ్ళు, చేతులు, తల మొదలైన అవయవాలు లేవు. సూక్ష్ముడు, మమకారము లేనివాడు, శబ్దస్పర్శ రూపరస గంధాలు లేనివాడు. నిర్వికల్పుడు కోరికలు లేనివాడు. చింతించటానికి వీలుకానివాడు. రంగులేనివాడు. అశుద్ధాన్ని శుద్ధంగా, అపవిత్రాన్ని పవిత్రంగా చేసేవాడు. క్రియాశూన్యుడు. అటువంటి పరమాత్మకు సంసారములేదు.

అతడే ఆత్మసంజ్ఞగలవాడు. శుద్ధుడు. అతడు ఒక్కడుగానే ఉన్నాడు. అతనితో సమానమైనవారు కాని, అతనికన్న అధికులుగాని ఎవరూ లేరు. బ్రహ్మరూపంలో కేవలము పరబ్రహ్మమే ప్రకాశిస్తాడు. కాని సమస్త జగత్తులోనూ ఆ పరమేశ్వరుడే ప్రకాశిస్తున్నాడు. విద్య అవిద్య, భావము అభావము, గురువు శిష్యుడు అనే భేదాలతో ఆ పరబ్రహ్మ ప్రకాశిస్తున్నది. తత్త్వదర్శనములో ఆ పరబ్రహ్మమే కేవలము శుద్ధముగా గోచరిస్తున్నది. విద్యలేదు అవిద్యలేదు. జగత్తు అంతకన్నా లేదు. పరాపరములు లేవు. ఈ జగత్తు సత్యముగా కనిపిస్తే సంసారం కలుగుతుంది. అయితే వ్యవహారంలో మాత్రమే సంసారం సత్యంగా కనిపిస్తుంది. కాని పదార్థంలో సమస్త సంసారము అసత్యము అవుతుంది. అందులో ఉన్నదంతా మట్టే అయినప్పటికీ, ఆకారాన్ని బట్టి 'కుండ' అని పిలువబడుతోంది. ఇది కుండ అని తెలుసుకోవటానికి ఎలాటి నియమము అవసరం లేదు. అలాగే ఆత్మను పోల్చి చెప్పటానికి ఇంకొక ప్రమాణం ఏదీలేదు. ప్రమాణంలో ఆత్మయే నిత్యసిద్ధముగా ప్రకాశిస్తున్నది. ఆత్మను తెలుసుకోవటానికి దేశము, కాలము, శుద్ధి, ఇవి ఏవీ అవసరం లేదు. 'నేనే పరమేశ్వరుడను' అని చెప్పగలిగే విజ్ఞానం కావాలి. ఈ రకంగా బ్రహ్మవేత్త అనుభవంతో నేనే పరబ్రహ్మను అని తెలుసుకుంటాడు.

సూర్యుని కాంతితో జగత్తంతా ప్రకాశిస్తున్నది. అలాగే, పరబ్రహ్మయొక్క తేజస్సుచేత అనాత్మ, అసత్తు నాశనం అయిపోయి ఈ జగత్తంతా ప్రకాశిస్తున్నది. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, సకల భూతాలు ఏ ప్రకాశంచేత అర్థవంతము, విజ్ఞానవంతము అవుతున్నాయో, అదే ఆత్మప్రకాశము. చిన్నపిల్లవాడు ఆకలి మరచిపోయి ఆటవస్తువులతో ఆడుకున్నట్లుగా, విద్వాంసుడు అహంకార

మమకారాలను వదలి ఆత్మయందు రమిస్తూ ఉంటాడు. ముని తను కోరుకున్నట్లు ఒంటరిగా తిరుగుతుంటాడు. నిష్కాముడై తనయొక్క ఆత్మతోనే సర్వదా సంతుష్టుడై, స్వయంగా సర్వాత్మభావనతో సంచరిస్తూ ఉంటాడు. ఆత్మజ్ఞాని సిద్ధుడైననూ, సదాసంతుష్టుడైనప్పటికీ, సహాయము లేనివాడయినప్పటికీ, మహాబలవంతుడు. భోజనం చెయ్యకపోయినప్పటికీ నిత్యతృప్తుడు. సమానంగా కనిపించనప్పటికీ సమదర్శనుడు. అన్ని పనులు చేస్తున్నప్పటికీ ఏ పనులు చేయనివాడు. భోగాలను అనుభవిస్తున్నట్లు కనిపిస్తాడు కాని నిజానికి అభోక్త.

బ్రహ్మవేత్త శరీరము ఉండి కూడా శరీరం లేనివాడు. విభజించటానికి వీలు లేనివాడు. కాని అన్నిచోట్ల ఉంటాడు. అతడు సదా అనంతుడు. ప్రియాప్రియముల యందు, శుభాశుభముల యందు నిర్లిప్తంగా ఉంటాడు. సూర్యకాంతి ఉన్నప్పటికీ, చీకటిని కల్పించుకుని బాధపడుతున్నట్లుగా, వస్తు లక్షణాలు తెలియకుండా భ్రాంతిలో నిండి జనులు బాధపడుతున్నారు. బ్రహ్మవేత్త అయినవాడు శరీరబంధనాల నుండి విముక్తి పొందుతున్నాడు. మూఢులైనవారు శరీర భ్రాంతినే చూస్తున్నారు. పాము కుబుసాన్ని విడిచినట్లుగా, జ్ఞాని దేహంమీద భ్రాంతిని వదలిపెడతాడు. గంగా ప్రవాహం ఎత్తు పల్లాలను సరిచేసేటట్లుగా ప్రాణవాయువు శరీరమంతా సంచరిస్తున్నది. ఈ శరీరము ప్రారబ్ధంవల్ల కర్మఫలమనుభవించటానికి వచ్చింది. లక్ష్యాలక్ష్యాలను వదలి కేవలము ఆత్మరూపుడైన బ్రహ్మవిదుడు స్వయంగా పరబ్రహ్మమే అవుతాడు.

బ్రహ్మవిదుడు జీవించి ఉన్నప్పుడే సర్వదా విముక్తుడవుతాడు. కృతార్థుడవుతాడు. ఉపాధి నశించటంవల్ల సద్రూప అధ్యయమగు పరబ్రహ్మ అవుతున్నాడు. నటుడు ఆడవేషం వేసుకున్నా, వేసుకోకపోయినా పురుషుడే అయినట్లుగా, బ్రహ్మవేత్త ఎల్లప్పుడూ బ్రహ్మమే అవుతాడు. కుండ పగిలిపోయినప్పుడు, ఘటాకాశం కూడా మహదాకాశమే అవుతుంది. అలాగే ఉపాధి నశించినప్పుడు బ్రహ్మవేత్త స్వయంగా బ్రహ్మమే అవుతున్నాడు. ఆత్మవేత్త అయినవాడు. పాలలో పాలు కలసినట్లుగా, నూనెలో నూనెపోసినట్లుగా, నీటిలో నీటిని పోసినట్లుగా, తన ఆత్మను పరమాత్మలో ఏకం చేసి సుఖిస్తున్నాడు. ఈ రకంగా అఖండాత్మానందం అనుభవిస్తూ విదేహముక్తి పొందిన యతి మళ్ళీ జన్మించడు. అతడు కేవలము బ్రహ్మభావన పొందుతాడు.

విద్యావిషయమైన భ్రాంతులన్నీ బ్రహ్మవిజ్ఞానంలో దగ్ధమైపోయిన తరువాత, అతడికి పునర్జన్మ ఉండదు. తాడు పాములాగా ఉంటుంది. అలాగే మాయచేత కల్పించబడిన బంధమోక్షాలు యదార్థంగా బ్రహ్మకు లేవు. సత్తు, అసత్తు, బంధము, మోక్షము ఇవేవీ బ్రహ్మలో ఉండవు. ఈ పదార్థం ఉన్నది. ఈ పదార్థం లేదు అని చెప్పే భావము బుద్ధియొక్క గుణము. నిత్యమైన ఆత్మలో అస్తి, నాస్తి లేవు. బంధమోక్షాలన్నీ మాయాకల్పితాలు. నిష్కళము, నిష్క్రియము, శాంతము, నిరవద్యము, నిరంజనము, అద్వితీయము అయిన తత్త్వములో కల్పన ఉండదు. నిరోధము లేదు. బద్ధుడు లేడు ముక్తుడు లేడు. సాధకుడు లేడు మోక్షం లేదు. ఇదే పదార్థము. అదే పరమాత్మ. అంటూ బాహ్యాత్మ, అంతరాత్మ, పరమాత్మలను వివరించాడు రత్నాకరుడు.

10. అజ్ఞానభూమికలు, జ్ఞానభూమికలు (మహోపనిషత్తు)

"గురువుగారూ ! మోక్షమార్గాన్ని వివరించేటప్పుడు అజ్ఞాన భూమికలు, జ్ఞాన భూమికలు అని రెండు రకాల భూమికలను వివరిస్తారు కదా ! అసలు భూమిక అంటే ఏమిటి ? జ్ఞానభూమికలు, అజ్ఞానభూమికలు ఏమిటి ? వీటిని పూర్తిగా వివరించండి" అని అడిగాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు చెప్పటం మొదలుపెట్టాడు.

అసలు భూమిక అంటే "మారు రూపము" అని అర్థం. మోక్షం కావాలంటే అజ్ఞానాన్ని పూర్తిగా విడిచిపెట్టి జ్ఞానమార్గాన్ని ఆశ్రయించాలి. అందుచేత ఇక్కడ అజ్ఞానము ఎన్నివిధాలో, జ్ఞానాన్ని ఏ రకంగా సాధించాలో చెప్పబడుతుంది. ఈ రెండు భూమికలనుండి అనేక రకాలయిన భూమికలు పుడుతున్నాయి. భట్టూ ! జీవి తన స్వరూపస్థితిలో ఉండటాన్నే మోక్షము అంటారు. తన స్వరూపము అంటే 'ఆత్మ' అని అర్థం. నేను అంటే పాంచభౌతికమైన దేహంకాదు. ఈ దేహం ఎప్పటికైనా నశించిపోయేదే. ఎన్నటికీ నశించనిది, సత్యము, నిత్యము, శాశ్వతము అయినది ఆత్మ ఒక్కటే. అందుకే నేను అంటే ఆత్మ. అంతేకాని దేహం కాదు. అటువంటి ఆత్మస్థితినే స్వరూపస్థితి అంటారు. స్వరూపస్థితిలో ఉండటమే మోక్షము. ఇది జ్ఞానంవల్లనే సాధ్యమవుతుంది. శుద్ధసత్తా మాత్రము అయిన జ్ఞానమే స్వస్వరూపము. అజ్ఞానికి మోక్షంరాదు. స్వరూపస్థితి నుండి చలించకుండా ఉండే వారియందు

అజ్ఞానము ఉండదు. రాగద్వేషాలు అసలే ఉండవు. దృశ్యవిషయములయందు దృక్కు నిమగ్నమవటమే స్వరూప భ్రంశము అనబడుతుంది. దృశ్యము అంటే చూడదగినది, చూడబడేది. దృక్కు అంటే చూసేవాడు అని అర్థం. దృశ్యవిషయాలు అంటే కంటికి కనిపించే విషయాలు. ఇవన్నీ అవాస్తవాలు. ఇవాళ్ళ ఉండి రేపు పోయేవి. అశాశ్వతాలు. ఈ రకంగా అవాస్తవము, అశాశ్వతము అయి కంటికి కనిపించే ప్రాపించిక విషయాలయందు, చూసేవాడు నిమగ్నమైనట్లైతే అనగా అశాశ్వతమైన ఈ జగత్తు శాశ్వతము అని భావన చేయటం అజ్ఞానము. దీనివల్ల స్వరూపము అంటే ఆత్మస్వరూపము, (ఈ జగత్తంతా మిథ్య, పరమేశ్వరుడొక్కడే శాశ్వతుడు. అతడు సర్వాంతర్యామి. నేను కూడా పరమేశ్వరుణ్ణే. ఈ జగత్తంతా నానుండే ఉద్భవిస్తున్నది) అనే భావన పోతుంది. దీన్నే మోహము అంటారు. దీనికన్న వేరైనది ఏదీలేదు. ఇది గతంలో ఉన్నది. భవిష్యత్తులో కూడా ఉంటుంది. సంకల్పము చేసేటప్పుడు విషయాలను గురించి ఆలోచించేటప్పుడు మనస్సు ఒకవిషయం మీదనుంచి ఇంకొక విషయంమీదికి వెడుతుంది. ఈ రకంగా ఒక విషయం నుంచి వేరొక విషయం మీదకు వెళ్ళే మధ్యలో గల స్థితినే 'అమనస్కస్థితి' అంటారు. ఈ స్థితి కేవలము కొన్ని క్షణాలు మాత్రమే ఉంటుంది. ఉదా : ఒక్కసారిగా ఊహించని విషయం ఏదైనా విన్నాం అనుకోండి. ఆ క్షణంలో అవాక్కయిపోతాం కొద్దిసేపటికిగాని తేరుకోం. అలా అవాక్కయిన స్థితినే **'అమనస్కస్థితి'** అంటారు. ఇది కేవలము కొన్ని క్షణాలు మాత్రమే ఉంటుంది. ఈ స్థితిలో మనసు పని చెయ్యదు. అదే స్వరూపస్థితి, ఆత్మ స్థితి అనబడుతుంది. స్వరూపస్థితిలో సంకల్పాలన్నీ నశిస్తాయి. ఆత్మనిశ్చలంగా ఉంటుంది. అది జాగ్రదవస్థ కాదు. నిద్ర అంతకన్నా కాదు. అది సర్వోత్తమమైన స్థితి. అటువంటి స్థితినే **'ఆత్మస్థితి'** అంటారు. నేను అనే అహంకారం పూర్తిగా తొలగిపోయిన తరువాత, ద్వైతము నశించగా, అంటే భగవంతుడు వేరు, భక్తుడు వేరు అనే భావన పూర్తిగా నశించగా, చిత్తములో భేదభావన నాశనం అయిన తరువాత ఉన్నట్టి అజడమైన (సత్యమైన, శాశ్వతమైన, జ్ఞానమైన) స్థితినే స్వరూపస్థితి అంటారు. ఇక ముందుగా అజ్ఞానాన్ని చూద్దాం. ఇది పూర్తిగా అవస్థాత్రయానికి సంబంధించినది. అవస్థాత్రయము అంటే 1. జాగ్రదావస్థ 2. స్వప్నావస్థ 3. సుషుప్త్యవస్థ.

అజ్ఞానము ఏడు అవస్థలుగా రూపుదాలుస్తుంది. వీటిలో జాగ్రదవస్థ మూడు రూపాలు, స్వప్నావస్థ మూడు రూపాలు కాగా ఏడవది సుషుప్త్యవస్థ. జాగ్రదావస్థ 1. బీజజాగ్రదావస్థ, 2. జాగ్రదావస్థ 3. మహాజాగ్రదావస్థ అని మూడు రకాలు. అలాగే స్వప్నావస్థ 1. జాగ్రస్వప్నావస్థ, 2. స్వప్నావస్థ 3. స్వప్న జాగ్రదావస్థ. అని మూడు రకాలు. ఏడవది సుషుప్తి ఈ ఏడు అవస్థలు ఒకదానితో ఒకటి కలసి అనేకరూపాలు పొందుతున్నాయి.

1. బీజజాగ్రదావస్థ : సృష్టి ప్రారంభం కావటానికి ముందు ఈ జగత్తంతా పరమేశ్వరమయంగా ఉండేది. అప్పుడు నామము, రూపము ఏదీలేదు. ఉన్నదంతా నిర్మలమైన చైతన్యమే. అదే పరమేశ్వర స్వరూపం. భవిష్యత్తులో కల్పించబడే జీవాది శబ్దాలకు, అర్థాలకు, విషయాలకు ఆశ్రయమవుతున్నది. అనగా ఆ పరబ్రహ్మ స్వరూపంనుంచే ఈ సృష్టి అంతా వచ్చింది. ఈ జగత్తంతా ఆవిర్భవించింది. గతంలో ప్రళయం జరిగినప్పుడు కర్మక్షయంకాని జీవరాశి అంతా, తమ తమ కర్మలతో పాటుగా ఆ పరబ్రహ్మలో లీనమయింది. ఇప్పుడు ఆ జీవరాశి అంతా బీజరూపంలో ఆతనియందే ఉన్నది. ఈ రకంగా బీజరూపంలో ఉన్న జాగ్రదావస్థనే బీజజాగ్రదావస్థ అంటారు. అదే జ్ఞప్తికి, భావానికి, అహంకారానికి క్రొత్త అవస్థ అవుతున్నది. ఇది కంటికి కనిపించని స్థితి. అందుచేతనే దీన్ని అవ్యక్తము అంటారు.

2. జాగ్రదావస్థ : బీజజాగ్రదావస్థ నుంచి సూక్ష్మంగా లేచిన నాది, అతడు, అది, ఇది అనే వృత్తి జ్ఞానమే జాగ్రదవస్థ.

3. మహాజాగ్రదావస్థ : జాగ్రత్తు అని చెప్పబడుతున్న, జన్మాంతర సంబంధమైన నేను, నాది, అతడు, అది అని స్ఫుటంగా దర్శనమిస్తున్న స్థూల జ్ఞానాన్నే మహా జాగ్రదావస్థ అంటారు.

4. జాగ్రస్వప్నావస్థ : జగత్తులోని కంటికి కనిపించేవి, కనిపించనివి, జగద్వికారమైనవి, సర్వప్రకారమైనవి, మనసుతో మాత్రమే కల్పించబడినవి ఇలా అనేక విషయాలున్నాయి. వీటన్నింటితోను నిండిన సృష్టిని జాగ్రస్వప్నావస్థ అంటారు. జగత్తులో ఉన్నవి లేనట్లుగా, లేనివి ఉన్నట్లుగా కనిపిస్తాయి. ఆకాశంలో ఉన్నది ఒకే చంద్రుడు కాని ఇద్దరుగా, ముగ్గురుగా కనిపిస్తారు. అలాగే ముత్యపుచిప్ప వెండిగిన్నెలాగా, ఎడారులయందు ఎండమావులులాగా కనిపిస్తాయి. ఇదంతా భ్రాంతి.

ఈ భ్రాంతి మనందరికీ అనుభవంలోనే ఉంటుంది. అలాగే ఆత్మలో వివిధ రకాలుగా ఈ జగత్తు కనిపిసిస్తున్నది. అంటే పరమేశ్వర రూపం నుంచి ఈ జగత్తు అంతా ఆవిర్భవించింది. ఈ స్థితినే 'జాగ్రస్వప్నావస్థ' అంటారు. జగత్తు శాశ్వతం కాదు. కలలోని దృశ్యంలాగా అశాశ్వతమైనది. నశించేది. అయినప్పటికీ ఇది శాశ్వతము అనిపిస్తుంది.

5. స్వప్నావస్థ : నిద్రపోయేవాడు కలకంటాడు. ఈ రకంగా కలగనే కొద్దిసేపు ఆ కల శాశ్వతం అనుకుంటాడు. నిద్రనుంచి మేల్కొన్న తరువాత తాను కలలో చూచిన విషయాలన్నీ ఇతరులకు వివరిస్తాడు. ఇది స్వప్నము. స్వప్నావస్థ.

6. స్వప్నజాగ్రదావస్థ : పైన చెప్పిన అవస్థలకు ఇది భిన్నమైనది. చాలాకాలం వేదాంత విజ్ఞానము విన్నాడు. కాని ఆత్మసాక్షాత్కారం మాత్రం కలగలేదు. అందుచేత పెద్దల బోధనలు ఏవీ అర్ధం కావు. ఆ కారణంచేత ప్రయత్నంమీద చాలాకాలము మహాత్ములను, అనుసరించటమే స్వప్నజాగ్రదావస్థ.

7. సుషుప్తి : ఇది ఈ ఆరు అవస్థల త్యాగరూపమైన జీవుని జడస్థితి. భవిష్యత్తులో దుఃఖానుభవముతో ఉన్న స్థితి. దీన్నే సుషుప్తి అంటారు. సుషుప్తి తమోగుణ రూపంలో ఉంటుంది. తమోరూపంలో ఉన్న సుషుప్త్యవస్థలో సర్వ జగత్తు లీనమై ఉన్నది. దీనినే అవ్యక్తము అని కూడా అంటారు.

ఈ రకంగా అజ్ఞానభూమికలు ఒకదానితో ఒకటి కలిసి వందలాదిగా ఏర్పడుతున్నాయి. వీటివల్లనే మానవుడు సంసారసాగరంలో మునిగిపోతున్నాడు. ఇక జ్ఞాన భూమికలను చూద్దాం.

జ్ఞాన భూమికలకు సంబంధించిన జ్ఞానమే యదార్ధ జ్ఞానము. ఇవి ఏడు రకాలు. ఈ సప్తభూమికల పరంగా ఉన్నదే మోక్షము.

1. శుభేచ్ఛ 2. విచారణ 3. తనుమానసి 4. సత్త్వాపత్తి 5. అసంసక్తి 6. పదార్ధ భావన 7. తుర్యగ

ఈ భూమికలను ఆచరించినవారికి మోక్షము సిద్ధిస్తుంది. మోక్షస్థితిలో ఉన్నవాడు మళ్ళీ దుఃఖము పొందడు. ఇప్పుడు జ్ఞానభూమికలను వివరిస్తాను వినవలసింది.

1. శుభేచ్ఛ : ఇది ముందుగా మానవుడిలో కలిగే మార్పు. అతనిలో ఉత్పన్నమయ్యే కోరిక. యదార్థజ్ఞానము తెలుసుకోలేకపోయాననే బాధ. అది తెలుసుకోవాలనే కోరిక. అయ్యో ! ఇప్పటిదాకా మూఢినిలాగా ఉన్నాను. కాలమంతా వృధా చేశాను. ఇకమీదటైనా శాస్త్రాధ్యయనం చేసి, సజ్జన సాంగత్యము ఆచరించి యదార్ధ జ్ఞానాన్ని తెలుసుకోవాలి అని కోరే వైరాగ్య సహిత వాంఛనే 'శుభేచ్ఛ' అంటారు.

2. విచారణ : సజ్జన సాంగత్యము, శాస్త్రాధ్యయనము చేసిన తరువాత, ఆ విషయాలను మనసుకు పట్టించుకుని నిరంతరము వాటిని గురించే ఆలోచిస్తుంటాడు. ఈ రకంగా కొంతవరకు వైరాగ్యము పొంది, వీటివల్ల అంటే, శాస్త్రాధ్యయనము, సజ్జన సాంగత్యము, వైరాగ్యములవల్ల ఏర్పడే సదాచార ప్రవృత్తినే విచారణ అంటారు. ఇదే ఆత్మవిచారణ. తనను గురించి తాను తెలుసుకోవటానికి చేసే ప్రయత్నము.

3. తనుమానసి : ఈ రకంగా మోక్షగామి అయినవాడు శుభేచ్ఛచేత, విచారణచేత స్వరూపాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తూ, అందులోని భాగంగా ఇంద్రియ వాంఛలను వదలివేస్తాడు. ఆహార నిద్రామైథునాలమీద కోరికను చంపుకుని, ఇంద్రియాలను శుష్కింపచేస్తాడు. ఇలా ఇంద్రియాలను శుష్కింపచేసే స్థితినే 'తనుమానసి' అంటారు.

4. సత్త్వాపత్తి : ఈ మూడు భూమికలను అభ్యాసం చెయ్యటంవలన చిత్తము నందు వైరాగ్యము ఏర్పడుతుంది. ఆ తరువాత శుద్ధ సత్త్వస్థితిని పొంది అంటే కేవలము సత్త్వగుణప్రభావము మాత్రమే కలిగి, ఆత్మయందు నిలకడ పొందుతుంది. అనగా మానవునియొక్క ధ్యాస అంతా ఆత్మమీదనే ఉంటుంది. అటువంటి స్థితిని 'సత్త్వాపత్తి' అంటారు.

5. అసంసక్తి : ఈ నాలుగు భూమికలను అభ్యాసం చెయ్యటంవల్ల సత్త్వగుణ ప్రధానుడై, విషయవాసనలు లేకుండా పూర్తిగా మనసును ఆత్మయందే లయం చేసే స్థితి. దీనినే 'అసంసక్తి' అంటారు.

6. పదార్ధభావన : ఈ ఐదు భూమికలను అభ్యాసం చెయ్యటంవల్ల, బాహ్యాభ్యంతర పదార్ధ భావనాశూన్యుడై అంటే తనకు మించినది లోపలగాని,

వెలుపలగాని వేరొకటి లేదు అని నిశ్చయించినవాడై, తనయొక్క ఆత్మయందు దృఢమైన స్థితిని అనుభవిస్తూ, ఇతరులతో ప్రయత్న పూర్వకముగా అవబోధనము చేయింపబడునట్టి స్థితి. అంటే ఈ జగత్తంతా పరమేశ్వరమయము. శరీరంలోగాని, బయటగాని ఆ పరమేశ్వరునికి మించినది ఏదీలేదు. అని భావిస్తూ ఆత్మస్థితిని పొంది, ఇతరులు ఏదైనా అడిగినట్లైతే సమాధానం మాత్రం చెప్పే స్థితి.

7. తుర్యగ : ఈ ఆరు భూమికలను నిరంతరము అభ్యాసం చెయ్యటంవల్ల భేదభావం పూర్తిగా నశించిపోతుంది. ఆ సమయంలో అనుభవించే ఆత్మానందాన్నే 'తుర్యగ' అంటారు. ఇదే తురీయాస్థితి లేదా తురీయావస్థ.

జ్ఞానులు నాలుగురకాలుగా ఉంటారు.

1. బ్రహ్మవిదుడు 2. బ్రహ్మవిద్వరుడు 3. బ్రహ్మవిద్వరీయుడు 4. బ్రహ్మ విద్వరిష్ఠుడు వీరిలో

1. బ్రహ్మవిదుడు : సత్త్వాపత్తి అనే నాల్గవ భూమికలో ఉంటాడు.

2. బ్రహ్మవిద్వరుడు : అసంసక్తి అనే ఐదవ భూమికలో ఉంటాడు.

3. బ్రహ్మవిద్వరీయుడు : పదార్థభావన అనే ఆరవ భూమికలో ఉంటాడు.

4. బ్రహ్మవిద్వరిష్ఠుడు : తుర్యగ అనే ఏడవ భూమికలో ఉంటాడు. అంటే ఇతడు ఎల్లవేళలయందు తురీయస్థితిలో సమాధిలోనే ఉంటాడు. ఇతడు విదేహముక్తుడు. అన్నపానాదులు కూడా తీసుకోడు. బలవంతంగా తినిపించాలి. లోకానికి ఏ పనీ చేయడు. ఒంటిమీద ఎప్పుడూ స్పృహ ఉండదు. ఐతే వీరిలో బ్రహ్మవిదుడు, బ్రహ్మవిద్వరుడు మాత్రం కొంత దేహజ్ఞానం కలిగి ఉంటారు. వారి సంస్కారాన్ని బట్టి పనిచేస్తారు. ఇటువంటి వారికి మనోనాశనము ప్రధానము. మనోనాశనము రెండు రకాలు.

1. స్వరూపనాశనము : చిత్తముతో కూడా రూపాన్ని నాశనం చెయ్యటం.

2. అరూపనాశనము : చిత్తము మాత్రమే నాశనము చేయటం.

జీవన్ముక్తులయందు తుర్యగ అనబడే తురీయావస్థ ఉంటుంది. ఈ అవస్థకుపైన తురీయాతీతావస్థ ఉంటుంది. అది విదేహముక్తికి సంబంధించినది. తురీయాతీతము అనగా తురీయవ్యవహారము కూడా దాటిన స్థితి. తురీయాతీత స్థితిని చేరిన వారు

సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపులవుతారు. మహాత్ములు, ఆత్మారాములు, మహాధన్యులు వీరిలో ఎవరు తుర్యగను చేరతారో, వారే పరమపదాన్ని చేరటానికి అర్హులు. వారే విదేహముక్తి పొందగలుగుతారు. జీవన్ముక్తులు సుఖదుఃఖాలలో మునిగిపోరు. ఇటువంటివారు చేయవలసిన పనులు మాత్రమే చేస్తారు. అటువంటి పనులు ఏవీ లేకపోతే ఏమీ చెయ్యకుండా ఉండిపోతారు. ఇటువంటి సత్పురుషులు ప్రక్కన ఉన్నవారిచే బాధితులై, నిద్రనుంచి లేచినవారిలాగా పూర్వాచారక్రమాగతులైన ఆచారాలను ఆచరిస్తూ ఉంటారు. బుద్ధిమంతులైన వారికి మాత్రమే ఏడు భూమికలు అర్థమవుతాయి. జన్మాంతర పుణ్యముతో పశుపక్ష్యాదులుకూడా ఈ భూమికలను పొందినట్లైతే ముక్తులవుతాయి.

ఈ జ్ఞానభూమికలలో సంచరించేవారు సశరీరులైనా, అశరీరులైనా ముక్తి పొందుతారు. ఇందులో సందేహం ఏమాత్రంలేదు. హృదయ గ్రంథి విచ్ఛేదనమే జ్ఞానము. సృష్టి స్థితి లయాలకు నాకు ఏ సంబంధములేదు. ఉన్నది ఒక్కటే. అదే పరబ్రహ్మ. అంతకు మించినది ఏదీలేదు. ఆ పరబ్రహ్మయే నేను అనే స్థితిని పొందటమే ముక్తి. గ్రంధి విచ్ఛేదన రూపమయిన విముక్తి స్థితి అంటే మృగతృష్ణ (ఎండమావులు)లో నీరు ఉన్నదని భ్రమించినట్లుగా, మహదాదిస్థూలభ్రాంతి, అమహదాది దేహభ్రాంతి మొదలైన అన్ని భ్రాంతులు నశించిన స్థితి. అంటే ఈ జగత్తుగాని, ఈ దేహంకాని ఏవీలేవు. అంతా మిథ్య. అంతా భ్రాంతి. ఇటువంటి అన్ని భ్రాంతులు నశించినట్టి స్థితి. ఈ స్థితిని చేరినవారు అనగా అజ్ఞానమనే సాగరాన్ని దాటినవారు మాత్రమే పరమపదాన్ని చేరతారు. ఆస్థితిని పొందగోరేవారు మాత్రమే ఈ సప్తభూమికలలో ఉంటారు. ఈ సప్త భూమికలకు లక్ష్యము పరబ్రహ్మపదమే అయి ఉన్నది. నువ్వు నేను, నీది నాది, అతడు ఇతడు, అనే తేడా లేనటువంటి స్థితి, సంకల్పరూప జ్ఞానముకూడా లేని స్థితి. ఉన్నది లేదు అనే వృత్తులకు అగోచరమైనది, దృశ్యము, అదృశ్యము కానిది ఏదైతే ఉన్నదో అదే మోక్షము. సర్వము శాంతించినటువంటిది, నిరాలంబనమైనది, శాశ్వతమైనది, సత్యము నిత్యమైనది, అనాభాసమైనది, అనామకమైనది, కారణములేనిది. అదే ముక్తి. అది ఈ జ్ఞానభూమికలవల్లనే లభిస్తుంది. అంటూ జ్ఞానభూమికలను అజ్ఞానభూమికలను వివరించాడు రత్నాకరుడు.

11. జీవన్ముక్తి, విదేహముక్తి (మహోపనిషత్తు)

"గురువుగారూ ! ఇంతవరకు మీరు జీవన్ముక్తుడు, విదేహముక్తుడు అన్నారు. జీవన్ముక్తుడు ఎవరు ? విదేహముక్తుడెవరు ? కాస్త వివరించండి" అన్నాడు నారాయణభట్టు. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

జీవించి ఉండగానే ముక్తి పొందటం జీవన్ముక్తి. అటువంటివాడు ఆయుష్షు ఉన్నంతవరకు జీవించి ఆ తరువాత ఈ దేహాన్ని విడిచి పరబ్రహ్మలో ఐక్యము పొందుతాడు. ఈరకంగా దేహాన్ని విడిచి పరమాత్మలో లీనం కావటాన్నే విదేహముక్తి అంటారు.

ఆత్మఅనేది అణువుకన్న చిన్నది, ఆకాశంకన్న పెద్దది. ఈ చిద్వస్తువునందు అనంతకోటి బ్రహ్మాండ రేణువులు ఉత్పత్తి స్థితిలయము పొందుతుంటాయి. బయటకు శూన్యంగా కనిపిస్తుంది కాబట్టి పరబ్రహ్మ ఆకాశము అని చెప్పబడుతున్నది. చిత్ స్వరూపముగా ఉన్నది కాబట్టి బ్రహ్మము ఆకాశముకన్న విలక్షణమైనది. అయితే బ్రహ్మము ఆకాశంకాదు. ఆకాశములేనిది. అదియే సత్తు చిత్తు. ఆత్మవస్తువు స్వయంప్రకాశ స్వరూపము. విజ్ఞాన ఘనమైన శిలాసదృశమైనది. ఆకాశంలాగా స్వస్వరూపంలో తదధిష్ఠానముగా అనుభూతమై ఉన్నది. చిత్రవిచిత్రముగా ఉన్న ఈ జగత్తుయొక్క వికాసాన్ని భేదిస్తున్నది. ఈ విశ్వము తత్పద లక్షణముగా ఉన్న పరమాత్మయొక్క ప్రకాశమాత్రము. అందువల్ల ఈ విశ్వము ఆత్మకన్న ప్రత్యేకమగు సత్తుగలది. ఈ జగత్తు యొక్క భేదభావముకూడా ఆత్మయందే ప్రకాశిస్తుంది. ఈ భేదమంతా ఆత్మమయమైనది. అధిష్ఠానరూపంలో ఈ ఆత్మ అన్నింటితోనూ సంబంధం కలిగి ఉన్నది. జాతి గుణ క్రియాదులు ఆత్మకు లేవు. ఆత్మ త్రికాలభాధ్యమై సత్యమై ఉన్నది. అదే విజ్ఞానానందస్వరూపమగు పరబ్రహ్మ. త్యాగమూర్తులకు అది పరమగతి. సర్వసంకల్పాలను వదలివేసి శుద్ధమనస్సుతో ఆ ఆత్మను గ్రహించాలి. జాగ్రదావస్థలో ఉన్నప్పుడు ఎవరికి దృశ్యజ్ఞానము నశిస్తుందో, అతనియొక్క స్థితినే 'జ్ఞానము' అంటారు. వృత్తి జ్ఞానము లేకపోవుటయే జ్ఞానము. ఈ విషయాలను తెలుసుకున్నవాడు జీవన్ముక్తుడు. దృశ్యములేదు అనే ఆత్మజ్ఞానంతో, మనసులో ఉన్న దృశ్యభావాలను తుడిచి వేసినట్లైతే తక్షణమే మహోన్నతమైన నిర్వాణసుఖము ఉత్పన్నమవుతుంది. వాసనలను అంటే రాగద్వేషాలను సంపూర్ణంగా త్యజించటమే మోక్షము. ఎవరైతే పరిశుద్ధవాసనలతో నిండి ఉన్నారో, వారు తిరిగి జనన మరణాలు పొందరు. వాళ్ళు యదార్థాన్ని తెలుసుకోగలుగుతారు. వారే జీవన్ముక్తులు. దృఢమైన విషయ చింతనయే బంధము. వాసనాక్షయమే మోక్షము. దేహ, లోక, శాస్త్రవాసనలే సర్వవాసనలు.

తపస్సు మొదలైన సాధనలు చేయకుండానే సహజముగా ఎవరికి భోగాలు ఇష్టం ఉండవో, వారు జీవన్ముక్తులు. కాలానుగుణంగా సుఖదుఃఖాలు అనుభవిస్తున్నప్పటికీ, సంతోషము, విషాదము పొందనివాడు జీవన్ముక్తుడు. హర్షము (సంతోషము) అమర్షము (ఓర్వలేనితనము), భయము, క్రోధము, కామము, కార్పణ్యము వంటివి లేనివాడు జీవన్ముక్తుడు. అహంకారాన్ని వదిలి, దృశ్యమునుకూడా త్యాగం చేసినవాడు జీవన్ముక్తుడు. అంతర్ముఖుడై ఇష్టాయిష్టములు లేకుండా ఉండేవాడు, సుషుప్తావస్థలో ఉన్నవాడులాగా సంచరించేవాడు. జీవన్ముక్తుడు. ఎప్పుడూ ఆత్మానందం పొందేవాడు, మనసును పవిత్రంగా ఉంచుకునేవాడు, జీవన్ముక్తుడు. ఏ కోరికలు లేకుండా ఉండేవాడు జీవన్ముక్తుడు.

ఆకాశంలాగా ఎవరి హృదయము దృశ్యవిషయముల యందు సంగమము కాకుండా ఉంటుందో, ఎవరిబుద్ధి జడముకాదో, ఎవడు చైతన్యవంతుడో వాడు జీవన్ముక్తుడు. రాగద్వేషాలను, సుఖదుఃఖాలను, లక్ష్యం చెయ్యకుండా, కోరికలు లేకుండా, నిష్కామ్యభావనతో సత్కర్మలు చేసేవాడు జీవన్ముక్తుడు. మౌనమే దీక్షగా గలవాడు, అహంభావం లేనివాడు, సంకల్పాలు, ఉద్వేగాలు లేకుండా కర్తవ్య కర్మలు చేసేవాడు జీవన్ముక్తుడు. సర్వత్ర విగతస్నేహితుడై సాక్షీభావముతో ఉండేవాడు, ఇచ్ఛారహితుడై సత్కర్మలు చేసేవాడు జీవన్ముక్తుడు. మనసునందు ధర్మాధర్మాలను, సమస్త సంకల్పాలను, ఇష్టాఇష్టాలను అన్నింటినీ వదలివేసివాడు జీవన్ముక్తుడు. కంటికి కనిపిస్తున్న ఈ దృశ్య ప్రపంచాన్ని సమ్యక్‌దృష్టితో పరిత్యజించినవాడు జీవన్ముక్తుడు. కారము, పులుపు, ఉప్పు, చేదు, రుచి, అరుచి వీటన్నింటినీ సమభావంతో భుజించేవాడు జీవన్ముక్తుడు. వార్ధక్యము, మరణము, ఆపద, రాజ్యము, దరిద్రము వీటన్నింటినీ సమభావంతో అనుభవించేవాడు జీవన్ముక్తుడు.

ధర్మాధర్మాలు, సుఖదుఃఖాలు, జరామరణాలు, సంపూర్ణంగా, బుద్ధిపూర్వకంగా త్యాగం చేసినవాడు జీవన్ముక్తుడు. ఉద్వేగము, ఆనందము లేకుండా స్వచ్ఛమైన సమత్వ బుద్ధి గలిగి, పొంగిపోవటము, క్రుంగిపోవటము, లేకుండా ఉన్నవాడు జీవన్ముక్తుడు. సర్వేచ్ఛలను, సంశయాలను, ప్రయత్నాలను, నిశ్చయాలను జ్ఞానబుద్ధితో పరిత్యజించినవాడు జీవన్ముక్తుడు. సృష్టి స్థితిలయాలయందు ఉదయాస్తమయాదు లందు, భావాభావములందు, సమభావంతో ఉండేవాడు జీవన్ముక్తుడు. కొంచెము కూడా ద్వేషించకుండా, కాంక్షించకుండా, రాగద్వేషాలులేనివాడు, ప్రారబ్ధకర్మలు అనుభవించనివాడు జీవన్ముక్తుడు. సంసార సంకులములో శాంతుడై ఉండేవాడు, కళాయుక్తుడైకూడా నిష్కళుడై ఉండేవాడు, మనసు ఉండికూడా అమనస్కుడైఉండేవాడు జీవన్ముక్తుడు. సమస్త సంపదలయందు, సమస్త వ్యవహారములయందు ఉండికూడా వాటి స్పృహలేనివాడు జీవన్ముక్తుడు.

జీవన్ముక్తుడు తనశరీరం పడిపోయిన సమయంలో, శ్వాస ఆగిపోయిన వెంటనే జీవన్ముక్త పదవిని దాటి విదేహముక్త పదవిని చేరతాడు. విదేహముక్తుడికి జనన మరణాలుండవు. అతడు నిర్వికారుడు, సత్తుకాడు అసత్తుకాడు. దూరముకాడు, దగ్గరాకాడు. అహముకాదు, తదితరము కాదు.

జీవన్ముక్తుని పరిస్థితి ఎలా ఉంటుందంటే, అత్యంత నిశ్చలము, మహాగంభీరము. అది ప్రకాశముకాదు, చీకటికాదు. మహావ్యాపకమై సర్వత్ర నిండి ఉంటుంది. అనాఖ్యముగా, అనభివ్యక్తముగా, అతీతముగా ఉంటుంది. అది శూన్యము కాదు. సాకారము కాదు. దృశ్యము కాదు, దర్శనము కాదు. భూతపదార్థ సముదాయము కాదు. కేవలసత్తా మాత్రము. అనంతరూపంలో కలిసి ఉంటుంది. ఇదమిద్ధమని చెప్పటానికి వీలుండదు. పరిపూర్ణముకన్న అధిక పరిపూర్ణముగా ఉంటుంది. సత్తు కాదు అసత్తుకాదు సదసత్తు కాదు. భావనకాదు భావముకాదు. కేవల చిత్ పదార్థము. మహాచైతన్యము. అనంతమై, అజరమై, శివమై, ఆది మధ్యాంత రహితమై, నిరామయై ఉన్నది. అది అనాదిగా ఉన్న సత్పదార్థము. ద్రష్ట, దర్శనము, దృశ్యము అనే త్రిపుటి మధ్యభాగంలో కేవల దర్శనము ఏదైతే ఉన్నదో అది. దీనికన్న గొప్పది ఉత్తమమైనది ఏదీలేదు. అంటూ జీవన్ముక్తి, విదేహముక్తులను వివరించాడు రత్నాకరుడు.

12. జ్ఞానియొక్క కర్మ, స్థితి (సుబాలోపనిషత్తు, పైంగలోపనిషత్తు)

"గురుదేవా ! జ్ఞాని అంటారు కదా ! అతనియొక్క కర్మ ఎలా ఉంటుంది ? అతని స్థితి ఎలా ఉంటుందో వివరించండి" అన్నాడు నారాయణభట్టు.

చెప్పేవాడికి శ్రద్ధగావినే మంచిశ్రోత దొరకటం కష్టం. అందునా వేదాంత విషయాలలో మంచి శ్రోత దొరకటం నిజంగా పూర్వజన్మ ఫలమే. అందుచేత మంచి జిజ్ఞాస కలిగిన శిష్యుడు దొరికినందుకు మహదానందిస్తూ, ఇనుమడించిన ఉత్సాహంతో చెప్పటం ప్రారంభించాడు రత్నాకరుడు.

ఆత్మజ్ఞాన సంపన్నుడు ముముక్షువు. అతడు ఇరవై ఒక్క తరాలను తరింప చేస్తాడు. బ్రహ్మజ్ఞానమాత్రంచేత నూట ఒక్క తరాలను తరింపచేస్తాడు. జీవాత్మకు ఈ శరీరమే రథము. ఆ రథంలో కూర్చునే రథికుడు–జీవాత్మ. ఈ రథానికి సారధి–బుద్ధి. మనసు – ప్రగ్రహము (పట్టుకునే త్రాడు) ఇంద్రియాలే – అశ్వాలు. విషయాలే – మార్గాలు. ఆత్మేంద్రియ మనోయుక్తుడైన ఆ పరమేశ్వరుడే – భోక్త అతడే – ప్రత్యగాత్మ. అతడు హృదయమందే సుప్రతిష్ఠితుడై ఉన్నాడు. ఆత్మవేత్త ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకు పాము కుబుసానికి వేరుగా ఉన్నట్లుగా వ్యవహారం చేస్తాడు. అంటే తామరాకుమీద నీటిబొట్టులాగా, కర్మ చేస్తూ కూడా, దాని ఫలితాన్ని పొందకుండా ఉంటాడు. జీవన్ముక్తుడైన దేహి, ఆకాశంలో చంద్రునిలాగా అంతటా సంచరిస్తాడు. ప్రపంచంలో ఎక్కడైనా తిరుగుతాడు. ఇతడు తన ఇంట్లోగాని, ఏదైనా క్షేత్రములోగాని, శరీరాన్ని వదలి 'పరమపదము' అని చెప్పబడే కైవల్యము పొందుతాడు.

జ్ఞానియైనవాడు మహత్పదాన్ని తెలుసుకుని వృక్షమూలమున కూర్చోవాలి. మాసినగుడ్డలు ధరించి, ఏకాకియై సమాధియందుండి, ఆత్మనుకోరువాడై, ఆప్తకాముడై, (కోరికలను పొందినవాడు) నిష్కాముడై, జీర్ణకాముడై ఉండాలి. ఏనుగు నందు, సింహమందు, దోమయందు, ముంగిసయందు, సర్పమునందు, యక్ష, రాక్షస, గరుడ, గంధర్వులయందు మృత్యువు యొక్క రూపము తెలుసుకున్నవాడు దేనికీ భయపడడు.

అతడు వృక్షంలాగానే ఉండాలి. నరకబడుచున్న వాడైనప్పటికీ కోపగించరాదు. ఆకాశములాగా ఉండాలి. కొట్టినా కోపించరాదు, సత్యముతో ఉండాలి. ఈ ఆత్మ

సత్యరూపము. అన్ని గంధములకు భూమి హృదయము. అన్ని శబ్దాలకీ ఆకాశము హృదయము. గీతములన్నింటికీ అవ్యక్తము హృదయము. సత్త్వములన్నింటికీ మృత్యువు హృదయము. మృత్యువు పరుడైన దేవునియందు ఏకీభవిస్తుంది. ఆపైన సత్తులేదు. అసత్తులేదు సదసత్తు లేదు.

విదేహముక్తుడు దేహము చాలించినప్పుడు అతని శరీరాన్ని దహనం చేస్తారు లేదా గోతిలో పాతిపెడతారు. బ్రహ్మవేత్తకు మాత్రమే 'ప్రవ్రజన దీక్ష' తగినది. ప్రవ్రజన దీక్ష అంటే సన్యాసము. గృహస్థాశ్రమంలో ఉన్న భార్యపుత్రులను విడిచిపెట్టి వేయటము. ఇతరులకు ఆ దీక్ష పనికిరాదు. బ్రహ్మభూతుడైన భిక్షువు (అతడే బ్రహ్మవేత్త) ఈ దేహాన్ని వదలివేసినప్పుడు, అంటే మరణించినప్పుడు సామాన్యుడికి జరిగినట్లుగా అగ్నికార్యములు, అశౌచములు, పిండోదకాలు, శ్రాద్ధకర్మలు, ఇవేవీ ఉండవు. దహించిన దానికి దహనంతో పనిలేదు. పక్వమైన దానికి వచనముతో పనిలేదు. జ్ఞానాగ్నిలో అతని కర్మ అంతా దహనమై పోయింది కాబట్టి, మళ్ళీ వేరుగా అతనికి కర్మకాండ చేయవలసిన పనిలేదు. అలాగే అతని ఆత్మ అజ్ఞానం నుంచి విడివడింది. అతని దేహము జ్ఞానాగ్నిలో ఇంతకుముందే దహించబడింది. అందుచేతనే అతడికి శ్రాద్ధకర్మలవంటివి ఏవీ ఉండవు. ఉపాధి (శరీరము) ఉన్నంతవరకు సద్గురువుకు సేవ చెయ్యాలి. ఒకవేళ గురువు గనక గృహస్తు అయినట్లైతే, అతని పుత్రులను కూడా సేవించాలి. శుద్ధమనస్సు, శుద్ధ చిద్రూపము గలిగి, సహిష్ణుడైన బ్రహ్మనిష్ఠుడు "పరత్మాను నేను" అనే జ్ఞానం కలుగగా, దానివల్ల విజ్ఞానం కలిగి, జ్ఞేయమైన పరమాత్మను హృదయంలో దర్శించి, శాంతిని పొందగా, అప్పుడు అతడు మనస్సు, బుద్ధికూడా లేనటువంటి, నశించినటువంటి ఆ పరబ్రహ్మ స్వరూపమే అవుతాడు.

అమృతం తాగేవాడికి పాలతో పనిఉండదు. అలాగే జ్ఞానామృతంతో సంతృప్తుడయిన యోగీంద్రుడికి కర్తవ్యము ఏదీ ఉండదు. ఆత్మజ్ఞానము గలవాడే తత్త్వవేత్త. బ్రహ్మవేత్త దూరంగా ఉన్నప్పటికీ నిజానికి దూరంగా ఉండడు. ప్రత్యగాత్మ పిండస్థుడై ఉన్నప్పటికీ అనగా శరీరమునందున్నప్పటికీ, పిండవర్జితుడై అనగా శరీరాన్ని వేరుగా శవంలాగా చూస్తున్నవాడై, సర్వసన్యాసిగా ఉంటాడు. హృదయాన్ని నిర్మలం చేసుకుని, పరమాత్మను ధ్యానించి, "ఆ పరమాత్మను నేనే" అని తెలిసి, జీవుడు పరమానందము పొందాలి. జలముతో చేరిన జలములాగా, పాలతో కలిసిన

పాలులాగా, నేతితో కలిసిన నెయ్యిలాగా, జీవాత్మ పరమాత్మలు ఏకీభావం చెందుతున్నాయి. ఈ రెండింటి మధ్యనా తేడా లేదు.

దేహమునందు జ్ఞానదీపము ప్రకాశించగా, బుద్ధి అఖండాకార రూపమవుతుంది. అప్పుడు విద్వాంసుడు బ్రహ్మజ్ఞానమనే అగ్నితో కర్మబంధనాలను దహించివేస్తాడు. తరువాత బ్రహ్మవేత్త పవిత్రుడు, అద్వైతరూపుడు అయిన పరమేశ్వరునిలో ఆత్మైక్యము పొంది, జలములో జలము కలిసిపోయినట్లుగా, స్వాత్మరూపుడై నిరూపాధి సంస్థితు డవుతున్నాడు. ఆ స్థితిలో ఆత్మకు ఉపాధి (ఆధారము) ఏదీ ఉండదు. ఆకాశంలాగా ఆత్మ సూక్ష్మరూపం గలది. వాయువులాగా అది దృష్టికి గోచరించదు. బాహ్యమందు, అంతరమునందు కూడా ఆత్మనిశ్చలమైనది. జ్ఞానమనే దీపముద్వారా జ్ఞాని అంతరాత్మను దర్శిస్తున్నాడు. బ్రహ్మవేత్త అయినవాడు ఎక్కడ ఏ ప్రదేశంలో మరణించినప్పటికీ అక్కడే సర్వగతమైన ఆకాశంలాగా లయం పొందుతున్నాడు. మహదాకాశములో ఘటాకాశము లయమైనట్లుగా, తత్త్వజ్ఞాని ఆ పరమాత్మయందు తన ఆత్మను లయం చేసి నిరాలంబయోగ దర్శనము పొందుతాడు.

ధ్యానయోగము చాలాగొప్పది. వేలకొలది సంవత్సరాలు ఒంటికాలి మీద నిలబడి తపస్సు చేసినప్పటికీ, ఒక్క ధ్యానయోగముయొక్క పదహారవ వంతుతో కూడా సమానం కాదు. ఇదే తెలుసుకోవలసిన జ్ఞానము, జ్ఞేయము కూడా. లోకంలో సర్వాన్నీ తెలుసుకోవాలని ప్రయత్నం చేసేవాడు. వేలకొలది సంవత్సరాలు జీవించి కృషి చేసినా శాస్త్రముల సారాన్ని గ్రహించలేడు. అక్షర పరమాత్మను తెలుసుకోవాలి. జీవితము క్షణభంగురము. శాస్త్రపరిజ్ఞానాన్ని వదలిపెట్టి సత్యమైన పరబ్రహ్మను ఉపాసించాలి. మానవుడు బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోలేనంత వరకు కర్మలు, శౌచము, జపము, యజ్ఞము, తీర్థయాత్రలు చేస్తుండాలి. మహాత్ములైన వారికి 'అహంబ్రహ్మాస్మి' అనే భావమే మోక్షహేతువు. బంధానికి, మోక్షానికి కేవలము ఒక్క అక్షరమే తేడా. మమ (నాది) అనేది బంధానికి, నమము (నాదికాదు) అనేది మోక్షానికి హేతువు. ఈ భావనతోనే జీవి మోక్షం పొందుతాడు. మనసు గనక 'ఉన్మన' భావము (మనసును దాటిన స్థితి, మనసు పని చేయని స్థితి) పొందినట్లైతే ద్వైతభావము కలగదు. ఉన్మనాస్థితిలో జీవుడికి పరమానందము కలుగుతుంది. మనసు ఏ ప్రదేశానికి పోతుందో అక్కడే పరమపదము ప్రాప్తిస్తుంది. పరబ్రహ్మ సర్వత్ర వ్యాపించి ఉన్నది.

సమస్తము బ్రహ్మమయమే. ఈ జగత్తులో బ్రహ్మముకాని వస్తువు ఏదీలేదు. ఆకాశాన్ని ముష్టిఘాతాలతో ముక్కలుగా చేయవచ్చు. బాగా ఆకలిగా ఉన్నవాడు ఆకలి రాకుండా చేసుకోవచ్చు. అంటే అసాధ్యమైన దాన్ని కూడా సుసాధ్యంగా చేయవచ్చు. కాని నేను బ్రహ్మను కాను అని భావించేవాడు మాత్రం మోక్షం పొందలేడు. అంటూ జ్ఞానియొక్క కర్మస్థితులను వివరించాడు రత్నాకరుడు.

13. శిఖా, యజ్ఞోపవీతాలు (బ్రహ్మోపనిషత్తు)

"గురుదేవా ! గృహస్తుగా ఉండి కర్మలు చేసేవాడు శిఖ, యజ్ఞోపవీతాలు ధరిస్తాడు. సన్యాసి ఆ శిఖాయజ్ఞోపవీతాలను తీసివేస్తాడు. దీనికి కారణం ఏమిటి? అసలు జీవునియొక్క పరమార్థం ఏమిటి ? ఈ విషయాలను వివరించండి" అని అడిగాడు నారాయణభట్టు. సమాధానం చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

ఈ చరాచర జగత్తంతా పరమేశ్వర స్వరూపం. పరమేశ్వరమయం. ఆ పరమేశ్వరుడు నిత్యము సత్యమైనవాడు. శాశ్వతుడు. అతడు పూర్ణపురుషుడు. పూర్ణపురుషుడైన ఆ పరబ్రహ్మకు నాభి, హృదయము, కంఠము, శిరస్సు అనే నాలుగు స్థానాలున్నాయి. ఈ నాలుగు స్థానాలలోను పరబ్రహ్మ నాలుగు పాదాలుగా ఉంటాడు. పూర్ణపురుషుడు జాగ్రదవస్థలో చతుర్ముఖ బ్రహ్మగా, స్వప్నావస్థలో – విష్ణువుగా, సుషుప్తిలో – రుద్రుడుగా, తురీయమునందు – పరమాత్మగా ప్రకాశిస్తుంటాడు.

విష్ణువు, ఈశ్వరుడు, సూర్యుడు ఆ పరమాత్మయే. ఆ ఆత్మకు మనసులేదు. కాళ్ళులేవు, చేతులు లేవు, కళ్ళు లేవు, నోరు లేదు, ముక్కు లేదు, చెవిలేదు. ఏవీలేవు. కేవలము అది ఒక జ్యోతిరూపము. ఆ పరమాత్మయందు లోకాలు లోకాలుగా ఉండవు. దేవతలు దేవతలుగా ఉండరు, వేదాలు వేదాలుగా ఉండవు. యజ్ఞాలు యజ్ఞాలు కావు. తల్లి తల్లికాదు. తండ్రి తండ్రి కాదు. కొడుకు, కోడలు, ఛండాలుడు, సన్యాసి వీరెవరు కూడా వీరు కాదు. తపస్వి తపస్వికాదు. అటువంటి పరబ్రహ్మము అఖండముగా నిర్వాణ స్వరూపముగా ప్రకాశిస్తున్నది.

ఆ పరమాత్మను దేవతలు మహర్షులు ఎవరూ నిర్ణయించలేరు. సర్వజ్ఞుడైన జ్ఞాని మాత్రమే ఆ పరబ్రహ్మను తెలుసుకుని, దాన్ని అనుభవించగలుగుతున్నాడు.

దేహంలో సమస్త ఇంద్రియాలు, ఇంద్రియాది దేవతలు హృదయ స్థానంలో ఉన్నాయి. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములనే పంచప్రాణాలు హృదయమందే ఉన్నాయి. హృదయంలో ఉన్న పంచప్రాణాలు, జ్యోతిరూప ఆత్మ, ఇంద్రియాల, ప్రాణాల, తేజస్సు, స్వరూపము, అయిన సూత్రాత్మ (ఇదే యజ్ఞోపవీతము) అన్నీ ఆ పరమాత్మయే అని బ్రహ్మజ్ఞానులు మాత్రమే తెలుసుకోగలుగుతున్నారు.

సూత్రాత్మ అంటే యజ్ఞోపవీతము. ద్విజులు అనగా బ్రహ్మ క్షత్రియ వైశ్యులు దీన్ని ఉపనయన కాలంలో ధారణ చేస్తారు. దీన్నే బ్రహ్మసూత్రము అని కూడా అంటారు. జగత్తంతా బ్రహ్మమయమని చాటిచెప్పే సూత్రం ఇది. దేహంలో ఉండే నాడులలో సుషుమ్నానాడి ముఖ్యమైనది. దీన్నే బ్రహ్మనాడి అంటారు. అంతఃపూజలో సుషుమ్నానాడినే బ్రహ్మసూత్రము లేక యజ్ఞోపవీతము అని భావన చేస్తారు.

యజ్ఞోపవీతము గాయత్రీ మంత్రానికి ప్రతీక. తొంభై ఆరు బెత్తలు ప్రమాణం కల సూత్రము (దారము) మూడు పోగులతో తయారుచేసి దాన్ని మూడుచుట్లు త్రిప్పాలి. ఇప్పుడు రెండు చివరలు కలిపి ముడివెయ్యాలి. ఇందులోని సూత్రంలో మూడు పోగులుంటాయి. యజ్ఞోపవీతం మూడు ముళ్ళు కలిగి ఉంటుంది. ఒక్కొక్క ముడికి మూడు వరుసలుంటాయి. వరుసకు మూడు పోగులుంటాయి. ఈ రకంగా యజ్ఞోపవీతం ఇరవై ఏడు పోగులు కలిగి, తొంభై ఆరు బెత్తలు ప్రమాణంతో ఉంటుంది. ఇందులోని

ఇరవై ఏడు పోగులు	–	ఇరవై ఏడు భేదములు గల జగత్తు
మూడు ఆవృతులు	–	మూడు గుణాలు
మూడు ముడులు	–	మూడు గ్రంధులు
మూడు గ్రంధులు కలిసి	–	బ్రహ్మముడి

బ్రాహ్మణులు యజ్ఞోపవీతం ధరించి కర్మచేస్తారు. యజ్ఞోపవీతం తీసివేయట మంటే కర్మ పరిత్యాగం చెయ్యటమన్నమాట. సన్యాసికి కర్మలేదు. అందుకే అతడు యజ్ఞోపవీతం ధరించడు. సర్వకర్మలనుండి విముక్తుడైనవాడు జీవన్ముక్తుడు. అలాగే నెత్తిమీద జుట్టు అంతా తీసివేసి కేవలము శిఖ ధరించటము సంప్రదాయం.

సుషుమ్నానాడిలో సూక్ష్మనాడులు కలిసే చోటును గ్రంథి అంటారు. ఇది ఇరవై ఏడు సూక్ష్మనాడుల సమూహం. అందుకే యజ్ఞోపవీతంలో కూడా ఇరవై ఏడు పోగులుంటాయి. అయితే సుషుమ్నానాడి యజ్ఞోపవీతంకన్న సత్యమైనది, సహజమైనది. ఇదే కంఠసూత్రము. ఈ రకంగా ఉన్న యజ్ఞోపవీతాన్ని ధరించి బ్రాహ్మణుడు కర్మచేస్తాడు. సన్యాసి ఆ యజ్ఞోపవీతాన్ని వదిలి కర్మ పరిత్యాగం చేస్తాడు.

సృష్టికర్త అయిన బ్రహ్మతోబాటుగా జన్మించినది, పవిత్రమైనది, శ్రేష్ఠమైనది, ఆయుష్షును వృద్ధి చేసేది, అన్నింటికన్నా ముందుగా పుట్టినది అయిన ఆ యజ్ఞోపవీతాన్ని గురించి తెలుసుకోవాలి. పరిశుద్ధము, జ్యోతిస్వరూపము అయిన యజ్ఞోపవీతము పరతత్త్వ సాధకులందరికీ ప్రాప్తించునుగాక. పండితుడు (జ్ఞాని) బాహ్యకర్మలు అంటే యజ్ఞయాగాదులు నిర్వర్తించటం కోసం కేశఖండన చేయించుకొని, శరీరముమీద ఉన్న యజ్ఞోపవీతాన్ని తీసివెయ్యాలి. అక్షర పరబ్రహ్మనే యజ్ఞోపవీతంగా భావించి ధరించాలి. ఈ యజ్ఞోపవీతము పరమాత్మను తెలియజేస్తుంది కాబట్టి దీన్ని సూత్రము అంటారు. సూత్రాత్మ స్వరూపంలో ఉన్న యజ్ఞోపవీతమే మోక్షస్వరూపమైనది.

ఈ జగత్తు మొత్తాన్ని మాలలోని పూవులను దారంలాగా, ఏ సూత్రంతో గ్రుచ్చబడి ఉన్నదో, అటువంటి పరమాత్మ అనే సూత్రాన్ని యోగవేత్త, బ్రహ్మవేత్త అయిన యోగి ధరిస్తున్నాడు. ఉత్తమమైన యోగాన్ని అభ్యసిస్తున్న విద్వాంసుడు బాహ్యసూత్రాన్ని త్యజించాలి. అంటే మామూలుగా మెడలో వేసుకొనే యజ్ఞోపవీతాన్ని తీసిపారెయ్యాలి. చైతన్యమునందలి బ్రహ్మభావనయే సూత్రము అని భావించి ధరించాలి.

బ్రహ్మస్వరూపమైన యజ్ఞోపవీతాన్ని ధరించటంవల్ల, ధ్యానించటంవల్ల, ఏ రకమైన అపరిశుభ్రత ఉండదు. ఆత్మజ్ఞానమే యజ్ఞోపవీతముగా భావించి ధ్యానించేవాళ్ళే అసలు యజ్ఞోపవీతం అంటే ఏమిటో తెలిసినవారు. అటువంటి జ్ఞానులే యజ్ఞోపవీతం ధరించినవారు. ఆత్మజ్ఞానమనే యజ్ఞోపవీతం కలిగి ఉండి పరబ్రహ్మను ధ్యానించేవారికి బ్రహ్మజ్ఞానమే ఉత్తమమైనది. అందుచేత పరబ్రహ్మ జ్ఞానమే పవిత్రమైనది.

శిఖ అంటే, తలమీద వెంట్రుకలన్నింటినీ తీసివేసి, నడినెత్తిన పిలక ఉంచటం. ఈ శిఖ జ్ఞానానికి గుర్తు. అందుకే అగ్నిలాగా జ్ఞానమనే శిఖ ఉన్నవాడు విద్వాంసుడు. జ్ఞానశిఖ ధరించినవాడే విద్వాంసుడు. ఇతరులు అంటే నెత్తిన జుట్టుతో శిఖ ఉంచుకున్నవారు కేశధారులు (జుట్టు ఉన్నవారు) మాత్రమే.

వేదవిహితమైన కర్మలు చెయ్యాలి అంటే బ్రాహ్మణులు యజ్ఞోపవీతాన్ని బాహ్యంగా కూడా ధరించాలి. బాహ్యంగా ధరించిన యజ్ఞోపవీతం బాహ్యకర్మలకు సాధనము. జ్ఞానమగు శిఖగలవారు సమస్తమైన సత్కర్మలు చేసినవారే అవుతారు. అటువంటి జ్ఞానులకు సమస్తమైన బ్రాహ్మణ్యము చెప్పబడింది. సూత్రాత్మ అనబడే యజ్ఞోపవీతము ఉత్తమమైనది. దీనిని తెలిసినవాడు 'యజ్ఞోపవీతి' అనబడతాడు. ఈ విషయాలు తెలిసినవాడు యజ్ఞస్వరూపుడు. అతన్ని యజ్ఞము చేసినవాడుగా బ్రహ్మవేత్తలు అంగీకరిస్తారు.

ఒక్కడుగా ఉన్నవాడు, తేజోవంతుడు అయిన పరబ్రహ్మ సర్వప్రాణులయందు నిగూఢముగా ఉన్నాడు. అతడు సర్వవ్యాపి. సమస్త భూతములలో నివసించు ఆత్మస్వరూపుడు. సర్వభూతాధివాసుడు. సర్వసాక్షి. చైతన్యస్వరూపుడు, గుణరహితుడు. అఖండముగా ఉన్నవాడు. జగత్తులో అన్నీ అతని వశంలోనే ఉంటాయి. పరబ్రహ్మ ఒకేరూపం కలిగి ఉండికూడా అనేక రూపాలలో కనబడుతుంది. అట్టి పరమాత్మను జ్ఞానులు హృదయంలో దర్శిస్తారు. అటువంటి వారికి శాశ్వత సుఖం లభిస్తుంది.

అగ్నిప్రతిష్ఠాపన చెయ్యాలి అంటే అరణిని మథించాలి. అలాంటప్పుడు క్రింద ఒక కర్ర, పైన ఒక కర్రపెట్టి రాపిడి కలిగించాలి. ఆ రాపిడికి అగ్నిపుడుతుంది. సాధకుడు మనస్సును క్రింది కర్రగా, ప్రణవాన్ని పైకర్రగా చేసి, ధ్యానాభ్యాసము అనే మథనం చేసి నిగూఢంగా ఉన్న ఆత్మపురుషుని దర్శించాలి.

నువ్వులలో నూనెలాగా, పాలలో వెన్నలాగా, ప్రవాహంలో జలంలాగా, కొయ్యలో అగ్నిలాగా, పరమేశ్వరుడు అంతఃకరణము నందు నిగూఢముగా ఉన్నాడు. సత్యముచేత, తపస్సుచేత, ధ్యానముచేత ఆ పరమాత్మని సాక్షాత్కరించుకోవాలి. సాలెపురుగు ఏ రకంగా దారాలను తయారుచేసి వాటితో గూడు అల్లి అందులోకి వెడుతుందో, అదే రకంగా జీవుడు కూడా జాగ్రత్, స్వప్నాలను నిర్మించుకుని వాటిలో సంచరిస్తున్నాడు ఈ జీవుడు.

జాగ్రదావస్తలో	- నేత్రములందు
స్వప్నావస్థలో	- కంఠమందు
సుషుప్తిలో	- హృదయమందు
తురీయములో	- సహస్రారమందు ఉంటాడు

ముక్కు, మనస్సు ఏ పరమాత్మను దర్శించలేక వెనుతిరిగి వస్తున్నాయో, బ్రహ్మజ్ఞాని ఏ ఆత్మను తెలుసుకుని జీవన్ముక్తుడవుతాడో, ఆ పరమాత్మయే జీవునియొక్క పదార్థము, ఆనందము. పాలలోని నెయ్యిలాగా, బ్రహ్మవిద్యా తపస్సులే స్వరూపంగా గల పరమాత్మను సర్వాంతర్యామిగా కీర్తిస్తున్నారు. అతడే మోక్షప్రదాత. అంటూ శిఖాయజ్ఞోపవీతాల గురించి వివరించాడు రత్నాకరుడు.

14. పరమహంస (తురీయాతీతోపనిషత్తు)

"గురువుగారూ ! 'పరమహంస' అనే మాటను ఎక్కువగా వింటూ ఉంటాం. మరి ఈ పరమహంసలకు మార్గమేది ? వారి స్థితి ఏది ? వారి సంప్రదాయం ఏది? నాకు పూర్తిగా వివరించండి" అన్నాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు ఒక్కక్షణం మౌనందాల్చి, తరువాత చెప్పటం మొదలుపెట్టాడు.

పరమహంసల మార్గము అత్యంత దుర్లభమైనది. ఈ మార్గంలో సంచరించే వారు చాలా తక్కువమంది ఉంటారు. బ్రహ్మచారులలాగా, గృహస్థులలాగా ఎక్కువ మంది ఉండరు. పుణ్యక్షేత్రాలలో ఎక్కడో ఒకడు కనిపిస్తాడు. పరమహంస మార్గంలో ఉన్నవారు నిత్యము పవిత్రులై ఉంటారు. వీరికి శిఖా, యజ్ఞోపవీతములు ఉండవు. అయినప్పటికీ సర్వకాల సర్వావస్థలయందు పూజింపదగినవారు. ఇతడు సాక్షాత్తూ వేదపురుషుడు. ఇతడికి సంతానము, భార్య, బంధువులు, మిత్రులు, శత్రువులు ఎవరూ ఉండరు. శిఖ ఉండదు. యజ్ఞోపవీతాన్ని ధరించడు. తాను నేర్చుకున్న వేదాన్ని అధ్యయనం చెయ్యడు. ఇతడు సర్వశాస్త్ర పండితుడు. సర్వకర్మలు చెయ్యటంలో నిష్ణాతుడు. అయినప్పటికీ శాస్త్రాలు, కర్మలు అన్నీ వదలివేసినవాడు. సర్వము త్యజించి కేవలము లోకంకోసం కౌపీనము, దండ కమండలాలు, కాషాయాంబరాలు ధరించినవాడై ఉంటాడు. ఇతడికి కౌపీనము ధరించటం ముఖ్యంకాదు. ఇప్పుడు చెప్పబోయే విషయాలు మాత్రమే ముఖ్యమైనవి.

శిఖాయజ్ఞోపవీతాలుండవు. స్వాధ్యాయము చెయ్యడు. యజ్ఞోపవీతముకాని, ఆచ్ఛాదన వస్త్రం (పైబట్ట) కాని ఉండవు. ఇతడి దృష్టిలో శీతోష్ణాలు, సుఖ దుఃఖాలు, మానావమానాలు అన్నీ సమానము. వీటిని పట్టించుకోడు. షడూర్ములు, తన్మాత్రలు లేనివాడై ఉంటాడు. షడూర్ములు అంటే 1. ఆకలి, 2. కోరిక, 3. శోకము 4. మోహము 5. జర 6. మరణము. తన్మాత్రలు అంటే 1. శబ్దము 2. స్పర్శ 3. రూపము 4. రసము 5. గంధము. వీటితోపాటుగా మనసుకూడా లేనివాడై ఉంటాడు. అంతేకాదు నింద, గర్వము, మత్సరము, దంభము, దర్పము, ఇచ్ఛ, ద్వేషము, అరిషడ్వర్గాలు (కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు) వీటిని పరిత్యజిస్తాడు. తన దేహాన్ని ఒక శవంతో సమానంగా చూస్తాడు. ఈ శరీరము ఎప్పుడైనా నశించేదే. నిత్యమైనవాడను, శాంతస్వరూపుడను నేనే. అచలుడను నేనే. అధ్యయానంద విజ్ఞానఘనుడను నేనే. అని విశ్వసిస్తాడు. ఆ పరమస్థానమే నానివాసము అదే శిఖా యజ్ఞోపవీతాలుగా ఉన్నది. తత్త్వము, పదార్థము అనే రెండూ విడివిడిగా లేవు. ఆ రెండూ ఒక్కటే. ఈ విషయాన్ని గ్రహించటమే సంధ్యావందనము.

అన్ని కోరికలు వదలి, అద్వైతస్థితి (జీవాత్మ పరమాత్మ రెండూ ఒకటేననే భావన. నేను తప్ప ఈ జగత్తులో ఏదీలేదు. ఉన్నది ఒక్కటే అదే నేను అన్న స్థితి)లో ఉన్నవాడు జ్ఞానదండాన్ని ధరిస్తాడు. అతడే ఏకదండి. ఈ దండము జీవాత్మ పరమాత్మ రెండూ వేరుకాదు. ఆ రెండూ ఒకటే అన్న దానికి ప్రతీక. కేవలము ఒక వెదురుకర్రను దండముగా ధరించి పరమహంసకు పనికి రానటువంటి, యతి ఆశ్రమానికి విరుద్ధమైనటువంటి లౌకికమైన భోగాలను అనుభవిస్తూ, మధుర పదార్థాలను, షడ్రసోపేతమైన ఆహారాన్ని భుజిస్తూ, జ్ఞానహీనుడై ఉండేవాడు మరణానంతరము రౌరవాది నరకాలకు పోతాడు. అక్కడ దారుణంగా శిక్షింపబడి, దుఃఖాలను అనుభవిస్తాడు. ఆత్మనిష్ఠ కలగాలంటే విద్వాంసుడికి నాలుగు లక్షణాలుండాలి. వాటినే సాధనా చతుష్టయము అంటారు. అవి :

1. నిత్యానిత్య వివేకము : ఏది సత్యము ? ఏది అసత్యము ? ఏది నిత్యము ? ఏది అనిత్యము ? అనే విషయ పరిజ్ఞానము. బ్రహ్మ ఒక్కటే సత్యము. ఈ జగత్తు అంతా మిథ్య.

2. వైరాగ్యము : లౌకికమైన సుఖాలపట్ల విముఖత. శరీరం దగ్గర నుంచీ బ్రహ్మలోకందాకా ఉండే భోగ్యపదార్ధాలయందు అసహ్యాభావన.

3. షట్సంపత్తి : ఇవి మొత్తం ఆరు.

1. శమము : అంతరింద్రియ నిగ్రహము. విషయ వాంఛలనుండి, అంతరింద్రియాల నుండి దోషదృష్టితో విరక్తి చెందటం.

2. దమము : బాహ్యేంద్రియ నిగ్రహము. ఇంద్రియాలను వాటి వాటి విషయాలనుండి మళ్ళించి వాటి స్థానాలలోని నిలిపివేయటం.

3. ఉపరతి : కర్మలను పరిత్యజించటం. బాహ్యవిషయాలను చిత్తవృత్తులతో ఆశ్రయించకుండా ఉండటము. విహితకర్మలను విధి పూర్వకంగా పరిత్యజించటం.

4. తితిక్ష: శీతోష్ణ సుఖదుఃఖాలను సహించే శక్తి. చింత, దుఃఖము మొదలైనవి లేకుండా, ప్రతీకారము లేకుండా, సమస్త దుఃఖాలను, కష్టాలను సహించటం. ఎదుర్కొనగల శక్తి ఉండికూడా, ఇతరులు చేసిన అపకారాలు సహించటం.

5. శ్రద్ధ : గురువునందు, ఆయన చెప్పేమాటలయందు విశ్వాసము, వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలయందు నమ్మకము ఉండటము.

6. సమాధి : బుద్ధిని ఎప్పుడూ శుద్ధబ్రహ్మమందే నిల్పి ఉంచటము.

4. ముముక్షుత్వము : మోక్షం పొందాలనే కోరిక. అహంకారము దగ్గర నుండి శరీరానికి ఉన్న సమస్తము అజ్ఞానంచేత కల్పించబడిన బంధనాలే. ఆత్మజ్ఞానం ద్వారా ఆ బంధనాలను త్రెంచుకోవాలనే కోరిక.

యతి అయి ఉండికూడా పైన చెప్పిన సాధన చతుష్టయము కలిగి ఉండక, కేవలము బిక్షాన్నము తిని కాలము వెళ్ళబుచ్చుతూ, యతిధర్మాలు పాటించాను అనుకునే వాడు మహాపాపి. యతి అనే పదానికి అపఖ్యాతి కలిగించేవాడు.

పరమహంసకు ఆకాశమే అంబరము. దిక్కులే అంబరముగా గలవాడు దిగంబరుడు. అతడికి నమస్కారములేదు. స్వాహాకారము లేదు. స్వధాకారములేదు. నిందాస్తుతులు లేవు. కేవలము యాదృచ్ఛికుడు. అతడు బిక్షువు. అతడికి దేవతల ఆవాహన లేదు, విసర్జనలేదు. మంత్రం లేదు. తంత్రంలేదు. ధ్యానంలేదు. ఉపాసన

లేదు. లక్ష్యంలేదు. అలక్ష్యం లేదు. భేదము లేదు. అభేదం లేదు. నేను నాది అనే అహంకార మమకారాలుకాని, స్వపరభేదాలుగాని లేవు. ఒకచోట అంటే ఉన్నచోట ఉండకుండా భిక్షువుగా తిరుగుతుంటాడు. బంగారము మొదలైన విలువగల వస్తువులను తాకడు. ఆభరణాలు ధరించడు. వాహనాలు కలిగి ఉండడు. బంగారం మీద కోరిక ఉంటే బ్రహ్మ హత్యాపాతకం అంటుతుంది. బంగారాన్ని తాకితే 'పోల్కసుడు' (చర్మకారుడు, ఛండాలుడు) అవుతాడు.

భిక్షువు బంగారాన్ని తీసుకుంటే ఆత్మహత్య చేసుకున్నవాడవుతాడు. కాబట్టి బంగారాన్ని ప్రీతితో చూడరాదు. తాకరాదు. తీసుకోరాదు. మనసును అన్ని కోరికల నుంచి మరల్చాలి. దుఃఖము కలిగినప్పుడు సంతాపం చెందకూడదు. సుఖం కలిగితే ఆసక్తి చూపరాదు. త్యాగము మీదనే ఆసక్తి ఉండాలి. దేన్నీ ద్వేషించరాదు. మోదము పొందరాదు. ఇంద్రియ గమనాన్ని నిషేధించి, వాటిని ఆత్మయందు చేర్చాలి. పూర్ణానంద బోధమైన బ్రహ్మను నేనే అని భావించాలి. అటువంటివాడే "పరమహంస" అంటూ పరమహంసల మార్గాన్ని, వారి స్థితినీ వివరించాడు రత్నాకరుడు.

15. అవధూత (అవధూతోపనిషత్తు, సన్యాసోపనిషత్తు)

"గురువుగారూ ! ముముక్షువులలో కొందరిని 'అవధూత' అంటారు కదా ! అసలు ఈ అవధూత ఎవరు? అతడి మార్గం ఏదో వివరించండి" అన్నాడు కృష్ణశర్మ చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

అవధూత మార్గంలో ఉన్నవాడు అత్యంత దుర్లభమైనవాడు. ఎక్కడో కోటికొక్కడు ఉంటాడు. అతడు నిత్యపూజ్యుడు. అతడే వైరాగ్యమూర్తి మహాజ్ఞాని. వేదపురుషుడు. సాక్షాత్తు పరమేశ్వర స్వరూపుడు.

అసలు అవధూత అంటే ఎవరో చెబుతాను వినండి. సన్యాసము నాలుగు రకాలు. 1. వైరాగ్య సన్యాసము 2. జ్ఞాన సన్యాసము 3. జ్ఞానవైరాగ్య సన్యాసము. 4. కర్మ సన్యాసము.

1. వైరాగ్య సన్యాసి : చూడటంవలన, వినటంవలన విషయాలమీద ఆసక్తి పోయి, ప్రాప్తించిన పుణ్యకర్మ విశేషమువలన సన్యసించినవాడు వైరాగ్యసన్యాసి.

2. జ్ఞానసన్యాసి : జ్ఞానమువల్ల, పుణ్యలోకానుభవ శ్రవణంవల్ల, లౌకిక వాంఛలు పోయి, దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసనలను వదలి, అవమానమును మానములాగా తలచి, ప్రవృత్తినంతటినీ హేయముగా తలచి సాధనా చతుష్టయ సంపన్నుడై సన్యసించినవాడు జ్ఞానసన్యాసి.

3. జ్ఞానవైరాగ్యసన్యాసి : అన్నింటినీ క్రమంగా అభ్యసించి, సర్వము అనుభవించి, జ్ఞానవైరాగ్యములతో, స్వరూపానుసంధానముతో దేహమాత్రావశిష్టుడై సన్యసించినవాడు జ్ఞానవైరాగ్య సన్యాసి.

4. కర్మసన్యాసి : బ్రహ్మచర్యము పూర్తిచేసి, గృహస్థాశ్రమం స్వీకరించి, వానప్రస్థుడై, వైరాగ్యము లేకపోయినప్పటికీ ఆశ్రమాల క్రమం ప్రకారము సన్యాసం స్వీకరించినవాడు కర్మసన్యాసి.

ఈ సన్యాసులు ఆరు విధాలుగా ఉంటారు.

1. కుటీచకుడు 2. బహూదకుడు 3. హంస 4. పరమహంస 5. తురీయాతీతుడు 6. అవధూత

1. కుటీచకుడు : ఇతడు శిఖ, యజ్ఞోపవీతము కలిగి ఉంటాడు. దండ కమండలాలు ధరిస్తాడు. కౌపీనము (గోచీ)శాఠీ (పైన కప్పుకునే వస్త్రము) కంథ. (పడుకోటానికి క్రింద వేసుకునే బొంత)లను కలిగి ఉంటాడు. పితృ, మాతృ, గురు ఆరాధనాపరుడై ఉంటాడు. పిఠరము (అన్నం వండుకునే కుండ) ఖనిత్రము (గడ్డపార) శిఖ్యము (ఉట్టి) మాత్రమే సాధనాలుగా కలిగి ఉంటాడు. ఒకచోటనే అన్నం తింటాడు. అంటే సంచారం చేయవలసిన అవసరంలేదు. తెల్లని ఊర్ధ్వపుండ్రములు, త్రిదండము ధరిస్తాడు.

2. బహూదకుడు : ఇతడుకూడా కుటీచకునిలాగానే శిఖ, యజ్ఞోపవీతము, దండకమండలాలు, కౌపీనము, శాఠీ, కంథ ధరించిఉంటాడు. త్రిపుండ్రధారి. అయితే మధూకరము చేసుకుని ప్రతిరోజూ ఎనిమిది ముద్దలు మాత్రమే తింటాడు.

3. హంస : ఇతడు జడలు ధరించి ఉంటాడు. త్రిపుండ్రములుగాని, ఊర్ధ్వ పుండ్రములుగాని ధరించి ఉంటాడు. కౌపీనము మాత్రమే ధరిస్తాడు. మధూకరాన్ని మాత్రమే భుజిస్తాడు.

4. పరమహంస : ఇతడికి శిఖ, యజ్ఞోపవీతాలు ఉండవు. ధరించటానికి మాత్రమే ఒకే కౌపీనము ఉంటుంది. ఒక శాఠి, వెదురుదండము కలిగి ఉంటాడు. ఐదు గృహాలయందు మాత్రమే బిక్షాటన చేస్తాడు.

5. తురీయాతీతుడు : గోముఖవృత్తిచే ఫలహారము చేస్తాడు. ఒకవేళ ఆహారంగా అన్నం తినే పక్షంలో మూడు ఇళ్ళలో మాత్రమే భిక్ష స్వీకరిస్తాడు. దేహమాత్రావశిష్టుడు దిగంబరుడు. శరీరాన్ని శవంలాగా చూసుకుంటాడు.

6. అవధూత : ఏ రకమైన నియమాలు లేనివాడు. ఏ విధమైన ఆభిజాత్యము లేకుండా, అన్ని వర్ణములవారి దగ్గరా అజగర వృత్తితో (కొండచిలువ నోటికి దగ్గరకు వచ్చిన ఆహారాన్ని తిన్నట్లుగా) ఆహారం తీసుకుంటాడు. ఎల్లవేళల యందు స్వరూపానందాన్ని అనుభవిస్తూ ఉంటాడు. చెట్లు, చేమలు, పర్వతాలతో కూడిన ఈ జగత్తును నేను కాను. నేను పరమేశ్వర స్వరూపాన్ని అంతేకాని అల్పకాలంలో నాశనమయ్యే శరీరాన్ని కూడా నేను కాను. ఈ శరీరము జడమైనది. అచేతనమైనది. అందుకే నేను శరీరాన్ని కాను. శూన్యమైన ఆకారము కలది, శూన్యమైన ఆకాశము నుండి పుట్టినది అయిన అచేతనమైన శబ్దాన్ని కాను. క్షణభంగురమైన చర్మముచేత గ్రహించబడేది అయిన స్పర్శ నేను కాను. క్షణంలో నశించిపోయే దృశ్య దర్శనములందు లీనమయ్యేది, క్షీణించునది, చూసేవాడికి మాత్రమే కనిపించేది అయిన రూపాన్ని నేను కాను. చంచలమైన జిహ్వచే గ్రహించబడేది, మందమైనది అయిన రసము (రుచి)ని నేను కాను. నాశనమయ్యేది, ముక్కుతో మాత్రమే గ్రహింపబడేది అయిన గంధము నేనుకాను. పంచేంద్రియాల భ్రమలేనివాడను, అన్ని కలలను వదలివేసినవాడను, శాంతుడను అయినశుద్ధచేతనుడనే నేను. బాహ్యాంతరముల యందు వ్యాపించినవాడను. నిష్కళంకుడను. నిరంజనుడను. 'ఏకమైన ఆత్మను నేను' అని భావన చేస్తుంటాడు.

మొదటగా కుటీచకుడై, కుటీచకుడు బహూదకుడై, హంసయై, పరమహంసయై, స్వరూపానుసంధానముచేత సర్వజగత్తునూ తెలుసుకుని, దండకమండలాలు, కటిసూత్రము, ఆచ్ఛాదనము, విద్యుక్త క్రియలు (చేయవలసిన పనులు) అన్నీ నీటిలో వదిలి, అంతకుముందు ధరించిన రంగులేని నారచీరెలు, కృష్ణాజినము కూడా వదలివేసి, దిగంబరుడై, నిత్యక్రియలను అమంత్రకంగా చేస్తూ ఉంటాడు. అభ్యంగన

స్నానం చెయ్యడు. పుండ్రధారణ చేయడు. లౌకిక, వైదిక కర్మలు ఇతడికి ఉండవు. సర్వత్ర పాపపుణ్యాలు, జ్ఞానాజ్ఞానములను వదలివేస్తాడు. శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మానావమానాలను జయించినవాడు. వాసనాత్రయ పూర్వకమైన నింద, అనింద, గర్వము, మత్సరము, దంభము, దర్పము, ఇచ్ఛ, ద్వేషము, కామము, క్రోధము, లోభము, మోహము, హర్షము, అసూయ, ఆత్మసంరక్షణ అన్నింటినీ వదలివేసినవాడు. తన శరీరాన్ని శవంలాగా చూస్తూ, అప్రయత్నమంగా ఏ రకమైన నియమాలు లేకుండా, ఆవులాగా దొరికింది తిని, ప్రాణాలు నిలుపుకుంటాడు. లభించిన దానితో తృప్తి చెందుతాడు. ఆశ అనేది లేనివాడు. సర్వశాస్త్ర పాండిత్యము కలిగి ఉండి కూడా దాన్ని భస్మం చేస్తాడు. అంటే శాస్త్ర విషయాలు తెలిసికూడా, వాటిని తలచడు. తన ఉనికిని దాచేస్తాడు. తానెవరో చెప్పడు. పెద్ద చిన్న అనే మాటలాడడు. నాకన్న వేరెవరూ లేరని భావిస్తాడు. దుఃఖముతో బాధపడడు. సుఖముతో మోదము పొందడు. రాగమునందు కోరిక ఉండదు. శుభాశుభములయందు ఆసక్తి ఉండదు. ఇంద్రియాలను జయించినవాడు. వర్ణాశ్రమ ధర్మాలను వదిలి, పగలు, రాత్రి కూడా జాగరూకుడై, సంచారం చేస్తూ, కేవలము దేహము మాత్రమే మిగిలినవాడై, పిచ్చివాడిలాగా, దెయ్యం పట్టిన వాడిలాగా ఒంటరిగా తిరుగుతుంటాడు. ఎవరితోనూ మాట్లాడడు. ఎప్పుడూ స్వరూపాన్నే ధ్యానం చేస్తుంటాడు. ఇతన్ని అవధూత అంటారు. ఇతడికి జీవితంలో కర్మలు అన్నీ క్షయం అయిపోయి ఉంటాయి. ఇతడు విదేహముక్తి కోసం ఎదురుచూస్తున్న జీవన్ముక్తుడు. అంటూ అవధూతమార్గాన్ని గురించి వివరించాడు రత్నాకరుడు.

16. అంతర్యామి

(సుబాలోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు, ఐతరేయోపనిషత్తు)

గురువుగారూ ! పరమేశ్వరుడు సర్వాంతర్యామి అన్నారు కదా ! అసలు అంతర్యామి అంటే ఏమిటి? ఆయన సర్వాంతర్యామి ఎలా అయినాడు? ఈ విషయం కాస్త వివరించండి అన్నాడు కృష్ణశర్మ, వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

పరమేశ్వరుడు ఈ జగత్తునంతా సృష్టించాడు. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు మొదలైన వాటితో మానవుని కూడా సృష్టించాడు. ఈరకంగా సృష్టించిన

దేహంలో తాను ప్రవేశించాలి అనుకున్నాడు. అలా ప్రవేశించటానికి రెండు ద్వారాలున్నాయి. ఒకటి పైనుండి అంటే బ్రహ్మరంధ్రంద్వారా, రెండవది క్రింద నుంచి. క్రింద నుంచి ప్రవేశించటం సేవకాలక్షణం కాబట్టి బ్రహ్మరంధ్రం ద్వారా మానవశరీరంలో ప్రవేశించాడు. ఈ రకంగా ప్రవేశించిన తరువాత దశేంద్రియాలు, నవరంధ్రాలతో కూడిన ఈ దేహంతో భోగాలు అనుభవిస్తూ నేను, నాది అనే అహంకార మమకారాలకు లోనయినాడు. అంటే అవిద్యాపూరితుడైనాడు. దేహమే తాను అనే భ్రాంతికి లోనయినాడు. ఈ భేదం గనక తొలగిపోతే జీవాత్మ పరమాత్మ రెండూ ఒకటే అవుతాయి.

ఈ రకంగా జగత్తులోని ప్రతిశరీరంలోనూ ప్రవేశించినవాడై ఆ చైతన్యమూర్తి సర్వాంతర్యామి అయినాడు. ప్రతిజీవియందు ఆ చైతన్యము ఉండటంవల్లనే, ఆ జీవి చలించగలుగుతున్నది. ఉదాహరణకు కంటికి చూసే శక్తిలేదు. అలా ఉంటే కనులున్న వాళ్ళంతా చూడగలగాలి. కాని గ్రుడ్డివాడు చూడలేడు. గ్రుడ్డివాడికి కూడా కళ్ళుంటాయి. కాని ఆ కళ్ళకు చూసేశక్తి ఉండదు. ఈ రకంగా కంటికి చూసేశక్తి నిచ్చేది చైతన్యము అదే ఆత్మ. చెవికి వినేశక్తినిచ్చేది ఆత్మ.

పరమేశ్వరుడు సర్వాంతర్యామి. జగత్తంతా నిండి ఉన్నాడు. అన్నింటికీ తన చైతన్యశక్తిని ప్రసాదిస్తున్నాడు. అంతదాకా ఎందుకు ? గర్భంలోని శిశువుకు ఏడవ నెలలో ప్రాణం వస్తుంది అన్నాము. మరి అంతకుముందు ప్రాణం లేదా ? ఉన్నది. ప్రాణం లేకపోతే శిశువు ఎలా ఎదగగలుగుతుంది ? మరి ఏడవనెలలో వచ్చేది ఏమిటి ? అదే చైతన్యము. ఆ శిశువుకు చలనాన్ని ఇచ్చేది అదే అంతర్యామి. ఆత్మ. ఇక పరమేశ్వరుడు తమలో ఉన్నప్పటికీ జీవులకు అతన్ని గురించి తెలియదు. కాని అతనివల్లనే ఆ జీవులు నియంత్రించబడుతూ ఉంటాయి.

పరమేశ్వరుడు భూమిలోపల ఉంటాడు. భూమే అతని శరీరము కాని భూమి అతన్నెరగదు. భూమి లోపల ఉంటూనే భూమిని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

జలంలోపల ఉంటాడు. జలమే అతని శరీరం. కాని జలం అతన్నెరగదు. జలంలోపల ఉంటూనే జలాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

అగ్నిలోపల ఉంటాడు. అగ్నే అతని శరీరం. కాని అగ్ని అతన్నెరగదు. అగ్ని లోపల ఉంటూనే అగ్నిని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

వాయువులోపల ఉంటాడు. వాయువే అతని శరీరం. కాని వాయువు అతన్నెరగదు. వాయువు లోపల ఉంటూనే వాయువును నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

ఆకాశంలో ఉంటాడు. ఆకాశమే అతడి శరీరం. కాని ఆకాశం అతన్నెరగదు. ఆకాశం లోపల ఉంటూనే ఆకాశాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ. ద్యులోకంలో ఉంటాడు. ద్యులోకమే అతని శరీరము. కాని ద్యులోకమతన్నెరగదు. ద్యులోకంలో ఉంటూనే ద్యులోకాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

ఆదిత్యలోకంలో ఉంటాడు. ఆదిత్యలోకమే అతని శరీరము. కాని ఆదిత్య లోకం అతన్నెరగదు. ఆదిత్య లోకంలో ఉంటూనే ఆదిత్యలోకాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

దిగంతరాళాల్లో ఉంటాడు. దిక్కులే అతని శరీరము కాని దిక్కులు అతన్నెరగవు. దిక్కులయందుంటూనే దిక్కులను నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

సూర్యునిలో ఉంటాడు. సూర్యుడే అతని శరీరము. కాని సూర్యుడు అతన్నెరగదు. సూర్యునిలో ఉంటూనే సూర్యుణ్ణి నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

చంద్రునిలో ఉంటాడు. చంద్రుడే అతని శరీరము. కాని చంద్రుడు అతన్నెరగదు. చంద్రునిలో ఉంటూనే చంద్రుణ్ణి నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

నక్షత్ర మండలంలో ఉంటాడు. నక్షత్రమండలమే అతని శరీరం. కాని నక్షత్ర మండలం అతన్నెరగదు. నక్షత్ర మండలంలో ఉంటూనే నక్షత్ర మండలాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

అంధకారంలో ఉంటాడు. అంధకారమే అతని శరీరము. కాని అంధకారం అతన్నెరగదు. అంధకారంలో ఉంటూనే అంధకారాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

తేజస్సులో ఉంటాడు. తేజస్సే అతని శరీరం. కాని తేజస్సు అతన్నెరగదు. తేజస్సులో ఉంటూనే తేజస్సును నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి అతడే ఆత్మ. మనస్సులోనే ఉంటాడు. మనస్సే అతని శరీరము. కాని మనస్సు అతన్నెరగదు. మనస్సులోనే ఉంటూనే మనస్సును నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

బుద్ధిలోనే ఉంటాడు. బుద్ధే అతడి శరీరము. కాని బుద్ధి అతన్నెరగదు. బుద్ధిలో ఉంటూనే బుద్ధిని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ. అహంకారంలోనే ఉంటాడు. అహంకారమే అతని శరీరం. కాని అహంకారం అతన్నెరగదు. తెలుసుకోలేదు. అహంకారంలో ఉంటూనే అహంకారాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

చిత్తమునందే ఉంటాడు. చిత్తమే అతని శరీరము. కాని చిత్తము అతన్నెరగదు. చిత్తంలో ఉంటూనే చిత్తాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

అవ్యక్తమందు ఉంటాడు. అవ్యక్తమే అతని శరీరము.కాని అవ్యక్తము అతన్ని ఎరగదు. అవ్యక్తంలో ఉంటూనే అవ్యక్తాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

అక్షరములోనే ఉంటాడు. అక్షరమే అతని శరీరము కాని అక్షరము అతన్నెరగదు. అక్షరమందు ఉంటూనే అక్షరాన్ని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ.

మృత్యువునందే ఉంటాడు. మృత్యువే అతని శరీరము. కాని మృత్యువు అతన్నెరగదు. మృత్యువులో ఉంటూనే మృత్యువుని నియంత్రిస్తాడు. అతడే అంతర్యామి. అతడే ఆత్మ. అతడు సర్వభూతాంతరాత్ముడు. పాపరహితుడు. దివ్యుడు. అతడు కనుపించడు కాని చూస్తాడు. వినిపించడు కాని వింటాడు. అతడు తెలియబడడు. అర్ధం కాడు. కాని అతనికి అన్నీ తెలుసు. అతడే అంతర్యామి. ఆత్మ. శాశ్వతుడు. అతడు తప్ప అన్నీ నాశనమైపోయేవే” అంటూ అంతర్యామిని గురించి వివరించాడు రత్నాకరుడు.

17. బ్రహ్మవేత్త (బృహదారణ్యకోపనిషత్తు)

గురువర్యా ! బ్రహ్మవేత్త అంటే ఎవరు ? అతణ్ణి గురించి వివరించండి అన్నాడు కృష్ణశర్మ. చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

ఆత్మే బ్రహ్మవిజ్ఞానము. ఈ బ్రహ్మము మనోమయము, ప్రాణమయము, జలమయము, చక్షుర్మయము, శ్రోత్రమయము, పృథివీమయము, జలమయము, వాయుమయము, ఆకాశమయము, తేజోమయము, ధర్మమయము, అధర్మమయము, క్రోధమయము, అక్రోధమయము, ఈ విధంగా సృష్టిలో కనిపించే ప్రతివస్తువూ బ్రహ్మమయమే. ఆత్మపురుషుడు దేనితో తాదాత్మ్యం చెందితే దానిలాగా కనిపిస్తాడు. పుణ్యకర్మలతో తాదాత్మ్యం చెందితే పుణ్యాత్ముడు. పాపకర్మలో తాదాత్మ్యం చెందితే పాపాత్ముడు.

జ్ఞానమార్గాన్ని తెలుసుకోవటం చాలాకష్టం. అది చాలా సూక్ష్మమైనది. మోక్షానికి తీసుకుపోతుంది. జ్ఞానమార్గం ద్వారానే బ్రహ్మవేత్తలంతా జీవించి ఉండగానే ముక్తులైనారు. అంటే కోరికలు నశించి ఆప్తకాములయినారు. కాబట్టి శరీర సంబంధం వదలిపోతుంది. ఇంక ప్రారబ్ధకర్మ క్షయం కాగానే మోక్షం లభిస్తుంది. పునర్జన్మ ఉండదు.

మానవుడు జ్ఞానంద్వారా నేనే నిత్యుడను, శుద్ధబుద్ధ ముక్త స్వభావంగల బ్రహ్మను. అని తెలుసుకోగలిగితే అటువంటివాడు కోరేది ఏదీ ఉండదు. ఆత్మజ్ఞానికి కోరికలుండవు. అటువంటి జ్ఞాని భోగాల కోసం శరీరం వెంటపడదు. ఆత్మదర్శియైన సాధకుణ్ణి జనన మరణాది దుఃఖాలేవీ బాధించవు.

శరీరము అనేక అనర్థాలతో కూడిన విషమస్థానం. అటువంటి శరీరంలో ప్రవేశించి ఉన్న ఆత్మను గురించి తెలుసుకున్నవాడు వివేకవంతుడు. అతడే మహాజ్ఞాని. అతడు కర్మలు చెయ్యకపోయినా చేసినట్లే. లోకమంతా అతనిదే. అతడే సర్వాంతర్యామి అయిన ఆత్మ. ఈ శరీరంలో ఉంటూనే ఆత్మతత్త్వాన్ని గురించి తెలుసుకోలేనివాడు జనన మరణాది దుఃఖాలు పొందుతూనే ఉంటాడు. గురువుయొక్క ఉపదేశాలు వినటం ద్వారా, శాస్త్రాలు చదవటం ద్వారా ఆత్మను గురించి తెలుసుకోవచ్చు.

పరమాత్మకు లోబడే కాలచక్రం తిరుగుతూ ఉంటుంది. అన్నింటికీ వెలుగునిచ్చే వాడు ఆ పరమాత్మయే. అతడు మరణం లేనివాడు. శాశ్వతుడు. కాలనియంత అయిన ఆ పరమాత్మను దేవతలు ఆయుర్దాయం కోసం ఆయుర్బ్రహ్మ రూపంలో ఉపాసిస్తారు.

పరమాత్మలో ఐదేసి చొప్పున ఐదు సమూహాలున్నాయి.

1. గంధర్వులు, పితరులు, దేవతలు, అసురులు, రాక్షసులు.
2. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులు.
3. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు.
4. పృథివి, ఆపః, తేజో, వాయు, ఆకాశములు
5. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము (జ్ఞానేంద్రియాలు)

ఇటువంటి ఆత్మయే అవినాశియైన పరబ్రహ్మ. ఇందుకు భిన్నమైనది పరబ్రహ్మ కాదు. అవిద్యతో ఉన్నంతవరకు మానవుడు మృతుడుగానే ఉంటాడు. అజ్ఞానం తొలగిపోగానే ఆత్మను తెలుసుకొని బ్రహ్మవేత్త అవుతాడు. అమృతుడవుతాడు.

పరమార్థ జ్ఞానంతో, పరిశుద్ధమైన మనస్సుతో మాత్రమే గురూపదేశం పొందటం ద్వారా పరబ్రహ్మను దర్శించాలి. పరమార్థ జ్ఞానము, పరిశుద్ధమైన మనస్సు ఈ రెండూ ముఖ్యము. ఆ తరువాతనే గురూపదేశం. పరబ్రహ్మలో అనేకత్వం లేదు. పరబ్రహ్మలో నానాత్వం చూసేవాడు ఒక మృత్యువు నుండి వేరొక మృత్యువుకు పోతాడు. భేదదృష్టికి కారణం అజ్ఞానం. అజ్ఞాని చావు పుట్టుకలతో సతమతమవుతాడు.

బుద్ధిమంతుడైనవాడు బ్రహ్మను గురించి తెలుసుకుని, ఇతర విషయాలను వదలిపెట్టి, బ్రహ్మమీదనే మనసు లగ్నం చెయ్యాలి. ఇతర విషయాలను ఆలోచించకూడదు. ఎక్కువ మాట్లాడితే శ్రమ తప్ప ఇంకే ఫలము ఉండదు.

ఆత్మపురుషుడు హృదయాకాశంలోనే ఉంటాడు. అతడే ఇంద్రియాలన్నింటికీ అధిపతి. అతడు శుభకర్మలవల్ల వృద్ధి పొందడు. అశుభకర్మలవల్ల క్షీణించడు. శుభాశుభాలు అతడికి అంటవు. అతడు సర్వేశ్వరుడు, సర్వభూతాలకు అధిపతి. అటువంటి బ్రహ్మను బ్రాహ్మణులు వేదాధ్యయనము, కర్మానుష్ఠానముల ద్వారా తెలుసుకోవాలి అనుకుంటారు. ఆత్మలోకాన్ని కోరేవారు సమస్తాన్ని త్యజించి

సన్యసిస్తారు. ఈషణత్రయాన్ని విసర్జించి భిక్షాటన చేస్తారు. ఆత్మను గురించి మహావాక్యాలలో చెప్పబడింది. ఆత్మ గ్రహించటానికి వీలుకానిది. పట్టుబడనిది. నాశనము లేనిది. ఆత్మ దేనిచేత బంధించబడదు.

ఆత్మజ్ఞానిని సుఖదుఃఖాలు బాధించవు. కష్టసుఖాలకు, పాపపుణ్యాలకు సుఖ దుఃఖాలకు అతడు అతీతుడు. అందుచేత కర్మలు అతడికి ఫలితాన్ని ఇవ్వవు. అతడు కర్మచేసినా చెయ్యకపోయినా ఒకటే.

బ్రహ్మదర్శనం చేసినవాడు కర్మలు చేస్తే అతడి మహిమ పెరగదు. చెయ్యకపోతే తగ్గదు. ఈ విషయాలు తెలుసుకున్నవాడికి ధర్మాధర్మాల ఫలితము అంటదు. ఈ విషయం తెలిసినవాడు ఇంద్రియ వ్యాపారాలను వదలివేసి, కోరికలు లేనివాడై తనలోనే ఆత్మదర్శనం చేసుకుంటాడు. తనలోనే అందరినీ చూస్తాడు. అతణ్ణి పాపపుణ్యాలు, ధర్మాధర్మాలు అంటవు. అతడు పాపపుణ్యాలకు అతీతుడు. అతడే సమస్త పాపాలను తపింపచేస్తాడు. భస్మం చేస్తాడు. ఇతడు పాపరహితుడు. వాంఛా రహితుడు. అతడే బ్రహ్మవేత్త. అంటూ బ్రహ్మవేత్తను గురించి వివరించాడు రత్నాకరుడు.

18. అర్చిరాదిమార్గము

"గురువుగారూ ! అర్చిరాది మార్గము అని అంటారు కదా ! మరి ఆ మార్గము ఏదో వివరించండి" అన్నాడు. నారాయణభట్టు. వివరించటానికి ఉద్యుక్తుడవుతున్నాడు రత్నాకరుడు.

ఆత్మ ఎప్పుడూ దుర్బలంకాదు. కాని దుర్బలమైనట్లు కనిపిస్తుంది. అవసాన దశలో ఆ మానవుడు వివేకాన్ని కోల్పోతాడు. ఏమీ తెలుసుకోలేని స్థితికి చేరతాడు. అదే స్పృహ కోల్పోవటం. అప్పుడు వాక్కు మొదలైన ప్రాణాలన్నీ ఆత్మకు ఎదురుగా నిలబడతాయి. ఇంద్రియాలు తమ తేజస్సును ఉపసంహరించుకుంటాయి. కంటికి అధిదేవత అయిన ఆదిత్యుడు అన్నివైపుల నుండి వేరైపోతాడు. అంటే కళ్ళను అనుగ్రహించటం మానివేసి ఆదిత్య రూపం పొందుతాడు. అప్పుడు మానవుడికి కంటి చూపు పోతుంది. అంటే నేత్రం ఆత్మ ఏకంకాగానే కంటిచూపు పోతుంది.

ఘ్రాణేంద్రియం ఆత్మతో ఏకం కాగానే వాసన చూసే శక్తి పోతుంది. ఊపిరి అందదు. రసేంద్రియం ఆత్మతో ఏకంకాగానే రుచి చూసే శక్తి పోతుంది. గొంతు మ్రింగుడు పడదు. వాగింద్రియం ఆత్మతో ఏకంకాగానే మాట పోతుంది. శ్రోత్రేంద్రియం ఆత్మతో ఏకం కాగానే వినికిడి శక్తి పోతుంది. మనస్సు ఆత్మతో ఏకం కాగానే ఆలోచనాశక్తి పోతుంది. త్వగింద్రియం ఆత్మతో ఏకం కాగానే స్పర్శజ్ఞానం పోతుంది. బుద్ధి ఆత్మతో ఏకం కాగానే అతడికి ఏమీ తెలియదు.

అప్పుడు జీవాత్మ శరీరంనుంచి బయటకు పోవటానికి మార్గం కనిపిస్తుంది. ఆ స్థితిలో అది శిరస్సుద్వారాగాని, నవరంధ్రాలలో ఏదో ఒక దానిద్వారాగాని బయటకు పోతుంది. దాంతోపాటే ప్రాణంకూడా బయటకు పోతుంది. ప్రాణం శరీరము నుంచి బయటకు రాగానే ఇంద్రియాలన్నీ శక్తి హీనమవుతాయి. ఆ స్థితిలో జీవుడు మంచి విజ్ఞానవంతుడుగా ఉంటాడు. విజ్ఞానంతో కూడిన ప్రదేశానికి పోతాడు. అతనితో పాటు అతని జ్ఞానము, అతడు చేసిన కర్మ, పూర్వజన్మ సంస్కారము అతని వెంటవెడతాయి.

గొంగళిపురుగు ఒక ఆకును పూర్తిగా అనుభవించి, దాన్ని నిస్సారం చేసి, వేరొక ఆకుమీద ఆశ్రయం సంపాదించి, అంటే ఇంకొక ఆకును పట్టుకుని శరీరాన్ని కుంచించి వేస్తుంది. అందువల్ల మొదటి ఆకుమీద నుంచి పూర్తిగా ఇవతలకు వచ్చేస్తుంది. అలాగే ఆత్మకూడా తానున్న శరీరాన్ని వదలి వేరొక శరీరాన్ని ఆశ్రయంగా పొందుతుంది.

బంగారం కరిగించి కొత్త ఆభరణము తయారు చేసినట్లుగా, ప్రస్తుతం ఉన్న శరీరాన్ని నాశనం చేసి, గంధర్వ, దేవ, బ్రహ్మలోకాలకు పోవటానికి అనువైన శరీరాన్ని ఆత్మ ఏర్పాటు చేసుకుంటుంది. ఇది అతను చేసిన కర్మలమీద ఆధారపడి ఉంటుంది. ఉత్తమ కర్మలు చేసినవారు ఉత్తమ జన్మలు ఎత్తుతారు. పాపకర్మలు చేసినవారు పశువులు, పక్షులు, పిల్లులు, కుక్కలుగా జన్మిస్తారు.

ఆత్మే బ్రహ్మ విజ్ఞానము. ఈ బ్రహ్మము మనోమయము, ప్రాణమయము, చక్షుర్మయము, శ్రోత్రమయము, పృథివీమయము, జలమయము, వాయుమయము, ఆకాశమయము, తేజోమయము, ధర్మమయము, అధర్మమయము, క్రోధమయము, అక్రోధమయము, ఈ విధంగా సృష్టిలో కనిపించే ప్రతివస్తువు పరబ్రహ్మమయమే.

ఆత్మపురుషుడు దేనితో తాదాత్మ్యం చెందితే దానిలాగా కనిపిస్తాడు. పుణ్య కర్మలతో తాదాత్మ్యం చెందితే పుణ్యాత్ముడు. పాపకర్మలతో తాదాత్మ్యం చెందితే పాపాత్ముడు అవుతాడు.

జీవుడు చేసిన కర్మకు తగిన ఫలితాన్ని పొంది మళ్ళీ కర్మలు చెయ్యటానికి భూలోకానికి వస్తాడు. భూలోకం కర్మభూమి. ఇతర లోకాల్లో కర్మలు చెయ్యలేరు. కోరికలున్నవాడు అతడు చేసిన శుభాశుభాలను బట్టి ఫలితము పొందుతాడు.

మానవులు తాము ఆచరించే కర్మననుసరించి మరణానంతరము వారు ప్రయాణించే మార్గాలు నిర్దేశింపబడతాయి. మానవులు చేసే కర్మలను రెండు రకాలుగా ఉంటాయి. 1. లౌకిక కర్మలు 2. అలౌకికకర్మలు వేదంలో రెండు రకాల విద్యలు చెప్పబడ్డాయి. 1. పరావిద్య 2. అపరావిద్య. అపరావిద్య లౌకిక ప్రయోజనాల కోసం ఉద్దేశింపబడగా, పరావిద్య మోక్షమార్గాన్ని చూపుతుంది. అపరావిద్యను అనుసరించిన వారు దక్షిణాయన మార్గంద్వారా ప్రయాణిస్తారు. వీరు కేవలము లౌకిక వాంఛలకోసం యజ్ఞయాగాది కర్మలు చేస్తారు. ఈ మార్గంలో ప్రయాణించేవారు పితృలోకానికి పోతారు. పరలోకంలో తమ కర్మ ఫలాలు అనుభవించి మళ్ళీ భూలోకంలో పుడతారు. ఈ రకంగా సంసార చక్రంలో పడి తిరుగుతూ ఉంటారు. ఈ మార్గాన్ని ధూమమార్గము, పితృయానము అని కూడా అంటారు.

పరావిద్య నుపాసించేవారు ఉత్తరాయణమార్గం గుండా ప్రయాణం చేస్తారు. దీనినే అర్చిరాది మార్గము, దేవయానము అనికూడా అంటారు. సాధకులు ఏ కోరికా లేకుండా పరలోక చింతనతో చేసే కర్మను ఉత్తరాయణ మార్గం అంటారు. ఈ మార్గంలో పరబ్రహ్మ తత్త్వానుభవం కలిగి కృతకృత్యులైనవారు పరబ్రహ్మలో లీనమవుతారు. వీరు మోక్షసాధన కోసం వేదవిహితమైన కర్మలు కూడా చేస్తారు.

పరబ్రహ్మ తత్త్వము తెలిసిన సాధకుడు ఈ శరీరాన్ని వదలిన తరువాత పరబ్రహ్మలో లీనమవుతాడు. అంతే కాని ఎక్కడికీ వెళ్ళడు. అంటే బ్రహ్మజ్ఞాని యొక్క ప్రాణాలు ఉత్క్రమింపవు. సాధకుడు పరలోకాలకు ప్రయాణమయ్యే సమయంలో అనగా అవసానదశలో అతడి ఇంద్రియాలన్నీ జీవుడి దగ్గరకు చేరతాయి. అప్పుడు జీవియొక్క తత్తరపాటు, అవస్థలు వర్ణనాతీతం. అతనికి ఊపిరి సలపక సతమతమవుతాడు. క్రమంగా జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు వశం తప్పుతాయి.

కేవలము మనసు ఒక్కటే పనిచేస్తుంది. విషయం మాత్రం తెలుస్తుంది. కాని మాట్లాడలేడు. ఈ స్థితిలో ఇంద్రియాలన్నింటినే కూడ దీసుకున్న మనస్సు ప్రాణంతో ఏకమవుతుంది. మనోవ్యాపారం కూడా అంతరిస్తుంది. అప్పుడు ఈ లోకంలో జరిగే విషయాలు అతడికి తెలియవు. క్రమంగా ప్రాణం జీవుడితో కలిసిపోతుంది. సకలేంద్రియ వ్యాపారము నశిస్తుంది. అప్పుడు అతడు చేసిన పాపపుణ్యాలు అతన్ని ఆవరిస్తాయి. సకలేంద్రియాలను కూడగట్టుకున్న జీవుడు పంచతన్మాత్రలతో ఏకమయి పరలోకానికి బయలుదేరతాడు. జీవి బయలుదేరేటప్పుడు దేహము వేడిగా ఉంటుంది. ఆ తరువాత చల్లబడుతుంది. బంధువులు ఆ దేహానికి అంత్యక్రియలు చేస్తారు. అంటే స్థూలదేహం నశిస్తుంది. సూక్ష్మదేహం పరలోకయాత్రకు ప్రయాణమవుతుంది.

లోకంలో కర్మలను ఫలాపేక్షతో చేసేవారు కొందరయితే, నిష్కామ్యకర్మలను చేసేవారు మరికొందరు. దేహాన్ని వదలి జీవుడు బయలుదేరటానికి రెండు రకాల వారికీ తేడాలేదు. కర్మను ఉపాసించినవారు పితృయానంలో వెడతారు. రెండవవారు అర్చిరాది మార్గంలో వెడతారు. ఈ రెండు రకాలవారు ముందుగా హృదయాన్ని చేరుకుంటారు. అక్కడ నుండి వీరి ప్రయాణం మొదలవుతుంది. శరీరంలో ఉన్న 72వేల నాడీ మండలమే వీరి ప్రయాణానికి సిద్ధంగా ఉన్న వాహనాలు. జీవి చేసిన కర్మ ననుసరించి నవరంధ్రాలలోనూ ఏదో ఒక రంధ్రం గుండా బయటకు వస్తాడు. కాని జ్ఞానియొక్క ప్రాణాలు బ్రహ్మరంధ్రం ద్వారా మాత్రమే బయటకు వస్తాయి.

మరణించబోయే ముందు, ఆఖరి దశలో అతడు చేసిన పాపపుణ్యాలు అతడికి గుర్తుకు వస్తాయి. అతడి మరుజన్మ ఏమిటి? అనే విషయాన్ని అతడు తెలుసుకుంటాడు. పాపకర్ముడు ఇంతకన్న హీనమైన జన్మ రాబోతున్నదని విలపిస్తాడు. జీవి శరీరం విడిచిపోవటానికి ఇష్టపడడు. చివరకు ఈ శరీరమునుంచి గెంటి వెయబడతాడు. ఈ కారణంచేతనే పాపకర్ముల మరణాలు నీచంగా ఉంటాయి. పుణ్యచరితలకు అనాయాస మరణం లభిస్తుంది.

బ్రహ్మలోకానికి తలవాకిలి సూర్యమండలము. ఉపాసనాపరులు, జ్ఞానులు చేరుకోదగిన మార్గము బ్రహ్మలోకము. ఆ మార్గమే అర్చిరాది మార్గము. అర్చిషము అనగా అగ్ని అని అర్థము. బ్రహ్మలోకానికి పోయే మార్గము అతికాంతివంతమైన బింబముచే కప్పబడి ఉంటుంది. ఆ కాంతిని మనం చూడలేము. అప్పుడు సాధకుడు

‘ఓ సూర్యభగవానుడా ! జ్యోతిర్మయమగు పాత్రముచేత బ్రహ్మలోక ద్వారము కప్పబడి ఉన్నది. ఓ దేవా ! నిత్యమైన ధర్మాన్ని ఆచరించటం కోసం ఆ మార్గాన్ని తెరువ వలసినది. ఓ సూర్యదేవా ! నీ కిరణాలను తొలగించి కాంతిని ఉపసంహరించు. నీ అనుగ్రహంచేత మంగళకరమైన నీ రూపాన్ని చూడగలుగుతాను, అని ప్రార్థిస్తాడు. తనను మంచి మార్గాన తీసుకుపొమ్మని అగ్నిదేవుణ్ణి ప్రార్థిస్తాడు. “ఓ అగ్నిదేవా ! నేను చేసిన కర్మలన్నీ నీకు తెలుసు. నాలోని పాపాలను నిర్మూలించు, నేను చేసిన కర్మ ఫలితము అనుభవించటానికి మంచి మార్గం గుండా తీసుకుపోవలసినది” ఇక్కడ సూర్యుడు అంటే ఆ పరమేశ్వరుడే.

సాధకుని ప్రార్థన ఆలకించిన సూర్యుడు బ్రహ్మలోకానికి అడ్డుగా ఉన్న కాంతి బింబాన్ని తొలగిస్తాడు. ఈ మార్గంలో మొదటగా ఉండేది అగ్నిలోకము. అర్చిషము అంటే అగ్ని. అందుకే దీన్ని అర్చిరాది మార్గము అంటారు. ఈ మార్గంలో మొదటగా అగ్నిలోకము, అహర్లోకము, శుక్లపక్ష దేవత, ఉత్తరాయణ దేవత, మాసదేవత, సంవత్సర దేవత, దేవలోకము, యమలోకము, ఆదిత్యలోకము, చంద్రలోకము, విద్యుల్లోకము, వరుణలోకము, ఇంద్రలోకము, ప్రజాపతి లోకము ఉంటాయి. చివరకు బ్రహ్మలోకం ఉంటుంది.

జీవుడికి అవయవాలు స్వాధీనంలో ఉండవు. అతడు ఒకచోట నుండి మరొక చోటికి పోలేడు. అప్పుడు ఆయా లోకాల దేవతలు, మహాపురుషులు అతని గమనానికి సాయపడతారు. బ్రహ్మమానసపుత్రుడు జీవిని విద్యుల్లోకమునుంచి బ్రహ్మలోకానికి తీసుకుపోతాడు. ఈ మార్గంలో వరుణ, ఇంద్ర, ప్రజాపతుల లోకాలుంటాయి. వీరంతా జీవి ప్రయాణానికి అనుమతిస్తారు. ఈ రకంగా జీవి బ్రహ్మలోకం చేరతాడు.

సాధకుడు చేసిన కర్మవల్ల వచ్చే స్వర్గం శాశ్వతంకాదు. స్వర్గంలో సుఖాలను అనుభవించి, కర్మశేషం అనుభవించటానికి మళ్ళీ భూలోకంలో పుడతాడు. కాని బ్రహ్మలోకం చేరినవారు తిరిగిరారు. కల్పాంతము వరకు కర్మబ్రహ్మదగ్గర ఉండి, కల్పాంతాన పరబ్రహ్మలో లీనమవుతారు. అందుకనే బ్రహ్మలోకం చేరే మార్గం ఉత్తమమైంది. అదే అర్చిరాది మార్గము. అంటూ అర్చిరాది మార్గాన్ని వివరించాడు రత్నాకరుడు.

19. మహావాక్య వివరణ

(శుకరహస్యోపనిషత్తు, మహావాక్యోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు, పైంగలోపనిషత్తు)

“గురువుగారూ ! మహావాక్యాలు అంటే ఏమిటి ? కైవల్య సాధనలో వీటి పాత్ర ఏమిటో కాస్త వివరించండి” అన్నాడు కృష్ణశర్మ. చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

నాలుగు వేదాలకు కలిపి 1180 ఉపనిషత్తులు ఉన్నాయి. వాటిలో 108 మాత్రమే చదవతగినవి అని తేల్చారు. అందులో కూడా పది ఉపనిషత్తులు ముఖ్యమైనవి అన్నారు శంకర భగవత్పాదులవారు. ప్రతి ఉపనిషత్తు కూడా ఏదో ఒక వేదానికి సంబంధించినదే. ఈ పది ఉపనిషత్తులలోనూ

ఐతరేయోపనిషత్తు	–	ఋగ్వేదంలోది
కఠ, తైత్తిరీయోపనిషత్తులు	–	కృష్ణ యజుర్వేదంలోవి
ఈశావాశ్య, బృహదారణ్యకాలు	–	శుక్లయజుర్వేదంలోవి
కేన, ఛాందోగ్యోపనిషత్తులు	–	సామవేదంలోవి
ప్రశ్న, ముండక, మాండూక్యోపనిషత్తులు	–	అధర్వవేదంలోవి

ఉపనిషత్తు అంటే బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్యా పరిశీలకులైన విద్వాంసులకు కర్మ, జన్మ, మరణాలు లేకుండా చేసేది. ఆ జన్మాది మరణాదికమైన దానిని నశింపచేసి, బ్రహ్మ పదార్థలాభం కలిగించేది ఉపనిషత్తు.

ప్రతి ఉపనిషత్తులోనూ పరబ్రహ్మతత్త్వాన్నే చెప్పటం జరిగింది. నిరాకారుడు నిర్గుణ స్వరూపుడు పరబ్రహ్మ. ఆదిమధ్యాంతాలు లేనివాడు. శాశ్వతుడు. స్వతంత్రుడు. ధర్మాధర్మాలు లేనివాడు. పక్షపాతం లేనివాడు. నిమిత్తమాత్రుడు. ఆనంద స్వరూపుడు. జీవులయొక్క కర్మలననుసరించి వారికి ఉత్తరజన్మలు ప్రసాదిస్తాడు. సృష్టి స్థితి లయాలకు అతడే కారణము. చరాచర జగత్తంతా అతడు వ్యాపించి ఉన్నాడు. సర్వవ్యాపి. ఈ విధంగా ఉపనిషత్తులు పరబ్రహ్మ స్వరూపాన్ని ప్రతిపాదించటంలో చాలావరకు సఫలీకృతం చెందాయి. అయితే ఉపనిషత్తుల సారమంతా మహా వాక్యాలలో ఉన్నది. మహావాక్యాలు నాలుగు. ఈ నాలుగు మహావాక్యాలు నాలుగు వేదాలకు సంబంధించిన ఉపనిషత్తుల నుండి చెప్పబడ్డాయి. అవి

1.	ప్రజ్ఞానం బ్రహ్మ	ఐతరేయోపనిషత్తు	ఋగ్వేదం
2.	అహంబ్రహ్మాస్మి	బృహదారణ్యకం	శుక్లయజుర్వేదం
3.	తత్త్వమసి	ఛాందోగ్యోపనిషత్తు	సామవేదం
4.	అయమాత్మా బ్రహ్మ	మాండూక్యోపనిషత్తు	అధర్వవేదం

ఈ మహావాక్యాలను బ్రహ్మనిష్ఠాగరిష్ఠుడైనవాడు షడంగాలతో ధ్యానం చెయ్యాలి. ఇది పరమోత్తమమైన తత్త్వము. విజ్ఞాన సహితము. దీనిని తెలుసుకున్నవారు ముక్తిని పొందుతారు. సద్గురువైనవాడు షడంగాలను చెప్పకుండా మహావాక్యాలను ఉపదేశించరాదు. షడంగాలు అంటే

1. ఋషి 2. ఛందస్సు 3. దేవత 4. బీజము 5. శక్తి 6. కీలకము

ఉపనిషత్తులన్నీ వేదాలసారమైనట్లుగానే, మహావాక్యాలు ఉపనిషత్తులసారము. మహావాక్యాలద్వారా పరబ్రహ్మను ధ్యానించే బ్రహ్మజ్ఞానులకు తీర్థాలు, మంత్రాలు, శాస్త్రాలు, జపాలు అవసరంలేదు. పుణ్యాతీత బ్రహ్మజ్ఞాన సంపన్నులకు పుణ్యప్రదాలైన తీర్థజపాదులు ముఖ్యంకావు. వాక్యార్థ విచారణవలన వంద సంవత్సరాలు ఆయుర్దాయం కలుగుతుంది. అటువంటి పూర్ణాయువు షడంగాలతో కూడిన మహావాక్యజపం ఒక్కసారి చేసినా కలుగుతుంది.

మహావాక్యాలు నాల్గింటిలోనూ 'తత్త్వమసి' అనేది ముఖ్యమైనది. ఈ వాక్యము మూడు భాగాలుగా విభజింపబడుతున్నది. 1. తత్ 2. త్వం 3. అసి. ఈ మూడింటినీ కూడా షడంగాలతో విడివిడిగా జపం చెయ్యాలి. ఈ విషయమంతా శుకరహస్యోపనిషత్తులో చెప్పబడింది.

పదాలకు వాచ్యార్థము, లక్ష్యార్థము అని రెండు రకాల అర్థాలుంటాయి. ముందుగా 'తత్' అనే పదానికి వాచ్యార్థము – ఈశత్వ, సర్వజ్ఞత్వాదులు. లక్ష్యార్థము – సచ్చిదానందమయమైన పరబ్రహ్మము. 'త్వం' అనే పదానికి వాచ్యార్థము – పంచభూతాత్మకమైన శరీరము, ఇంద్రియాలు మొదలైనవి. లక్ష్యార్థము – సచ్చిదానందమైన పరబ్రహ్మము. 'అసి' అనగా తత్, త్వం పదములయొక్క కలయిక. త్వం – నీవు. తత్ – వాడు. జీవుడు, ఈశ్వరుడు అనే భేదాలు కార్యకారణరూప ఉపాధువల్ల కలుగుతున్నాయి. ఈ రెండు ఉపాధులను తిరస్కరించినట్లైతే మిగిలేది

అద్వితీయమైన సచ్చిదానంద పరబ్రహ్మము. ఉన్నది ఒక్కటే. రెండులేవు. అదే సత్తు చిత్తు ఆనందము. దేవదత్తుడు ఒకడే అయినప్పటికీ దేశకాలమాన భేదాలతో వేరువేరుగా కనిపిస్తున్నాడు. ఇతడే అతడు అనే ప్రత్యభిజ్ఞానంతో దేశకాలమాన సంబంధాన్ని త్రోసి పుచ్చగా, ఆ దేవదత్తుడే ఇతడు అనే నిశ్చయ జ్ఞానం కలుగుతుంది. ఇదే విధంగా కార్యకారణ సంబంధాలతో ఒకే పరమాత్మ జీవుడుగా, ఈశ్వరుడుగా కనిపిస్తున్నాడు. మహావాక్యాలను విచారణ చేసినట్లైతే ఆ పరబ్రహ్మమే నేను అనే జ్ఞానం కలుగుతుంది. ఉపాధి ద్వయంకూడా తొలగిపోగా సచ్చిదానంద బ్రహ్మమే సిద్ధిస్తుంది.

కార్యమగు విద్యోపాధిని ధరించినవాడు జీవుడు. కారణమగు మాయోపాధి గలవాడు ఈశ్వరుడు. ఈ కార్యకారణ ఉపాధులు రెండింటినీ వదలినట్లైతే సిద్ధించేది – పరిపూర్ణ బోధయే. వీటిని ముందుగా సద్గురువు ద్వారా వినాలి. తరువాత మననం చెయ్యాలి. ఆ తరువాత ధ్యానం చెయ్యాలి. ఈ మూడింటివలన పరిపూర్ణ అఖండ జ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞానానికి భిన్నమైన లౌకిక విద్యలన్నీ నశిస్తాయి. బ్రహ్మవిద్యా పరిజ్ఞానము, బ్రహ్మప్రాప్తి కలుగుతాయి.

మహావాక్యోపనిషత్తులో వీటిని వివరిస్తూ మహావాక్యాలు సామాన్యుడికి చెప్పతగినవి కావు. సత్వగుణ సంపన్నుడు, అంతర్ముఖుడైనవాడు, గురువుకు శుశ్రూష చెయ్యటంలో ఆసక్తి గలవాడికి మాత్రమే వీటిని ఉపదేశించాలి. ముముక్షువు సాధన చతుష్టయాన్ని సాధించిన తరువాత, సంసార బంధానికీ, మోక్షానికీ విద్య, అవిద్య అనేవి రెండు కళ్ళు అని తెలుసుకుని అనాత్మ పదార్థాన్ని వదలివేసి, బ్రహ్మపదార్థాన్ని మాత్రమే తీసుకుని, దేహాన్ని విడిచి ముక్తుడవుతున్నాడు. అని చెప్పబడింది.

ఆత్మనిష్ఠ కలగాలంటే సాధకుడికి నాలుగు లక్షణాలుండాలి. వాటినే సాధనా చతుష్టయము అంటారు. అవి 1. నిత్యానిత్య వివేకము 2. వైరాగ్యము 3. షట్సంపత్తి 4. ముముక్షుత్వము. వీటన్నింటినీ గతంలో మీకు వివరించాను.

అవిద్యతో కనిపించే ఈ ప్రపంచము తమోదృష్టిగలది. బ్రహ్మ మొదలు స్థావరములదాకా గల శరీర సమూహమంతా మనస్సే. ఈ లోకమనేది అంతములేని సకల బ్రహ్మాండము. సకల వేదములందు చెప్పబడిన వివిధ కర్మలయందు ప్రీతిని కలిగిస్తుంది. ఆత్మ అంధకార స్వరూపుడు కాదు. కుత్సితమైన ఈ ప్రపంచానికి

లోపల బయటా కూడా ప్రకాశింపచేసే విద్యాస్వరూపుడు. జ్యోతిర్మండల స్వరూపుడు. ఈ ఆత్మ అపరబ్రహ్మ కాదు. ప్రకాశిస్తున్న ఆదిత్యుడే బ్రహ్మ. ఈ రకంగా అజపాను సంధాన పురస్సరముగా అనులోమ విలోమ రూపాలయిన ఉఛ్వాస నిశ్వాసలచేత "హంసః స్సోహం" అని చాలాకాలం జపించాలి. ఈ రకంగా సమ్యజ్ఞానాన్ని ఆర్జించి, త్రివృత్ స్వరూపమయిన బ్రహ్మను ధ్యానించాలి. అప్పుడు సచ్చిదానంద స్వరూప మయిన పరమాత్మ స్వయంగా ఆవిర్భవిస్తాడు.

ఈ రకంగా ఆర్జించిన జ్ఞానము ఒక్కసారిగా ఉదయించిన వేలాది సూర్యుల కాంతితో సమానంగా ఉంటుంది. పరిపూర్ణమైన సముద్రంలాగా బ్రహ్మస్వరూప రసముతో పరిపూర్ణమైనందువల్ల నశింపనిదిగా ఉన్నది. ఈ స్థితి సమాధికాదు. యోగసిద్ధి అంతకన్నా కాదు. మనోవలయము అనటానికి వీలులేదు. ఇది ప్రత్యక్ బ్రహ్మైక్యము. విద్వాంసుడు సమస్త రూపాలు, నామాలు మాయామయని తెలుసుకుని, వదలివేసి, ఏ బ్రహ్మన్ని కోరుతున్నాడో, అది అంధకారాంతర మందు ఆదిత్యవర్ణ రూపముగా ఉంటుంది. అనేక వేల సూర్యకాంతులతో ప్రకాశిస్తుంటుంది.

ఈ విషయం తెలుసుకున్నవాడు అమృతస్వరూపుడు. మహావాక్యాలకు అర్థం తెలుసుకున్నవాడు పరం జ్యోతిసు అనే ఆ జ్యోతిస్సే ఆదిత్యరూపంలో ఉన్న నేను అవుతున్నాను. ఏదైతే అర్కజ్యోతిసు, శివార్క జ్యోతిసు అని పరమాత్మ స్వరూపంగా చెప్పబడుతున్నదో అటువంటి పరంజ్యోతిసుడను నేనే. అని భావించగలుగుతాడు. ఇదే ముక్తికి మార్గము.

ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు తనకుమారుడైన శ్వేతకేతువుకు ఆత్మజ్ఞానాన్ని బోధిస్తూ 'తత్త్వంఅసి' అనే మహావాక్యాన్ని వివరిస్తాడు.

నాయనా ! శ్వేతకేతూ ! మానవుడు నిద్రించేటప్పుడు తాత్కాలికంగా ఆత్మలో లీనమవుతాడు. మరణకాలంలో వాక్కు మనసులో లీనమవుతుంది. మనస్సు ప్రాణంలో లీనమవుతుంది. ప్రాణం తేజస్సులో కలిసిపోతుంది. చివరకు అది పరమశక్తిలో కలిసిపోతుంది. ఆ శక్తి అతిసూక్ష్మమైనది. కాని విశ్వమంతా వ్యాపించి ఉన్నది. అదే సత్యము. అదే నిత్యము. అదే ఆత్మ. అదే నీవు.

జీవి అనేది ఏ రూపంలో ఉన్నప్పటికీ అంటే పులి, సింహము, మనిషి ఏదైనా కాని అనంత చైతన్య సముద్రంలో కలిసిపోయిన తరువాత తనరూపాన్ని

పోగొట్టుకుంటుంది. జీవులు వాటి నామరూపాలను పోగొట్టుకుంటాయి. అవి అన్నీ ఏ తత్త్వంలో కలిసిపోతాయో, అదే బ్రహ్మ. అద్వితీయమైనది. సూక్ష్మమైనది. సర్వవ్యాపకమైనది. అదే నీవు. శ్వేతకేతూ ! అదే నీవు. శ్వేతకేతూ ! ఆకాశంలో ఉన్న సూర్యునిలో ఏ తేజస్సయితే ఉన్నదో, అదే నీలోనూ ఉన్నది. అదే నీవు. అగ్నిలో ఏ తేజస్సయితే ఉన్నదో అదే నీలోనూ ఉన్నది. శ్వేతకేతూ ! అదే నీవు.

చంద్రునిలో ఏ చల్లదనమున్నదో, అదే నీలోనూ ఉన్నది. శ్వేతకేతూ ! అదే నీవు. అని చెబుతాడు.

ఈ రకంగా పరమేశ్వర స్వరూపం తనలోనే ఉన్నది. తానే సాక్షాత్తూ పరబ్రహ్మ అని భావించినవాడు ముక్తిని పొందుతాడు.

పైంగలోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు మహావాక్యాలను వివరిస్తూ ఆ బ్రహ్మము నీవే అయి ఉన్నావు. నీవు బ్రహ్మవై ఉన్నావు. నేనుకూడా బ్రహ్మనై ఉన్నాను అని ఈ రకంగా మహావాక్యానుసంధానం చెయ్యాలి. మహావాక్యంలో పరోక్ష శబలుడై ఉన్నవాడు, సర్వజ్ఞాది లక్షణాలు గలవాడు, మాయయే ఉపాధిగా ఉన్నవాడు, సచ్చిదానంద స్వరూపుడు జగత్కర్త అయిన ఆ పరమేశ్వరుడే తత్ అనే పదానికి అర్థం. ఆ ఈశ్వరుడే అంతఃకరణ సహితుడై 'నేను' అనే అజ్ఞానానికి విషయమైనవాడై నీవు అనే పదానికి అర్థం అవుతున్నాడు. ఈశ్వరజీవుల యొక్క శరీరములైన మాయ, అవిద్యలను విడిచిపెట్టి తత్, త్వం అనే పదాలకు లక్ష్యమై ఉన్న ప్రత్యగాత్మ బ్రహ్మమే అవుతున్నది.

తత్త్వమసి, అహంబ్రహ్మాస్మి అనే మహావాక్యాల అర్థం విచారణ చెయ్యటమే, శ్రవణము, ఏకాంతంలో విన్నటువంటి దాన్ని అనుసంధానము చెయ్యటం మననము. శ్రవణ మననాలవలన సంశయాలు లేకుండా ఏకాగ్రముగా మనసును నిలిపి ఉంచటం నిధిధ్యానము. ధ్యాతృధ్యానాలను విడిచిపెట్టి, నివాతస్థిత దీపము రీతిగా ధ్యేయైక గోచరమగు చిత్తము కలిగి ఉండటమే సమాధి. అటువంటి సమాధి సమయంలో సంచితకర్మ అంతా నశించిపోతుంది. ఆ తరువాత అభ్యాస బలమువలన వేలకొలది అమృతధారలు వర్షిస్తాయి. అందుకే యోగవేత్తలు సమాధిని 'ధర్మమేఘము' అంటారు. సమాధివల్ల అన్ని వాసనలు నశించగా, కర్మసంచయము (పుణ్యపాపాలు)

నశించిపోగా, వేదాంతవాక్యము కరతలామలకమైనట్లుగా, అపరోక్ష సాక్షాత్కారము సంభవిస్తుంది. అప్పుడు ఆత్మజ్ఞాని జీవన్ముక్తుడవుతాడు.

పంచీకృత మహాభూతాలను ఈశ్వరుడు అపంచీకృతం చెయ్యాలనుకున్నాడు. అంటే సృష్టి ఆరంభంలో పంచభూతాలు పంచీకృతం చెంది జగత్తు ఆవిర్భవించింది. ఇప్పుడు లయం కావాలి. అందుకే పంచభూతాలను అపంచీకృతం చేస్తున్నాడు. లోకాలు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, అంతఃకరణ చతుష్టయములన్నింటినీ పంచభూతాలలో లీనంచేసి, భూమిని జలములో, జలమును అగ్నిలో, అగ్నిని వాయువులో, వాయువును ఆకాశంలో, ఆకాశాన్ని అహంకారంలో, అహంకారాన్ని మహత్తత్త్వములో, మహత్తత్త్వాన్ని అవ్యక్తమందు, అవ్యక్తాన్ని పరమాత్మయందు లీనం చేస్తున్నాడు. విరాట్టు, హిరణ్యగర్భుడు, ఈశ్వరుడు ఉపాధులు లీనమైపోయినందు వల్ల పరమాత్మలో లీనమవుతున్నారు. అంటే అజ్ఞానం నశించటంవల్ల పరమాత్మలో లీనమవుతున్నారు.

పంచీకృత మహాభూతాలవల్ల సంభవించిన కర్మచేత సంపాదించబడ్డ స్థూలదేహము కర్మక్షయంవల్ల, సత్కర్మపాలనవల్ల అపంచీకృతము పొంది, అనగా సూక్ష్మరూపం ధరించి, సూక్ష్మతత్త్వములో ఐక్యము పొంది, తరువాత కారణరూపమత్వం పొందుతుంది. అంటే కారణంలో లీనమవుతుంది. ఆ తరువాత కారణత్వము కూటస్థమైన ప్రత్యగాత్మలో లీనమవుతుంది. విశ్వతైజస ప్రాజ్ఞులుకూడా తమ ఉపాధులు లయమవటంతో పరమాత్మలో లీనమవుతారు. జ్ఞానాగ్నితో బ్రహ్మాండమంతా దహింపబడి, అది పరమాత్మలో లీనమవుతుంది. అందువల్ల బ్రాహ్మణుడు సమాహితుడై సర్వదా తత్, త్వం పదార్థాల విజ్ఞానాన్ని అనుసంధానం చెయ్యాలి. అప్పుడు మేఘాలు విడిపోయిన సూర్యునిలాగా, అజ్ఞానము తొలగిపోయి ఆత్మ ఆవిర్భవిస్తుంది.

అందువల్ల హృదయంలో పొగలేని దీపపుశిఖలాగా ఉన్న అంగుష్ఠ మాత్రమైన ఆత్మను ధ్యానం చెయ్యాలి. తనలో ప్రకాశిస్తున్న ఆ పరమాత్మను నిరంతరము, జీవితకాలమంతా ధ్యానం చెయ్యాలి. అటువంటివాడు జీవించి ఉన్నప్పటికీ ముక్తుడై, జీవన్ముక్తుడుగా కృతార్థుడవుతాడు. ప్రాప్తించిన ఆయువు తీరిన తరువాత విదేహముక్తుడవుతాడు. అంటూ మహావాక్యాలను వివరించాడు రత్నాకరుడు.

20. మహావాక్యానుసంధానము (ఆత్మబోధోపనిషత్తు)

గురువుగారూ ! మహావాక్యాలు మొత్తం నాలుగు ఉన్నాయి. వీటిలో 'తత్ త్వం అసి' అనే మహావాక్యానికి అర్థం తెలుసుకున్నట్లైతే మిగిలిన వాటికి అర్థం చాలా తేలికగా తెలుస్తుంది. శంకర భగవత్పాదులవారు వ్రాసిన 'మహావాక్య దర్పణం'లో కూడా 'తత్ త్వం అసి' అనే దాన్నే వివరించారు. అంతవరకూ బాగానే ఉన్నది. మోక్షప్రాప్తి కలగాలంటే మహావాక్యాలను అనుసంధానం చెయ్యాలి అన్నారు కదా ! ఈ అనుసంధానాన్ని గురించి వివరించండి" అన్నాడు నారాయణభట్టు చెప్పటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

ఈ మహావాక్యాలకన్నింటికీ ఇంచుమించుగా అర్థం ఒక్కటే.

ప్రజ్ఞానం బ్రహ్మ	- జ్ఞానమే పరబ్రహ్మ
అహంబ్రహ్మాస్మి	- నేనే పరబ్రహ్మనై ఉన్నాను
అయమాత్మాబ్రహ్మ	- నా ఆత్మయే పరబ్రహ్మ
తత్ త్వం అసి	- అది నీవు ఒక్కటే

అది అంటే – పరమేశ్వరుడు, ఇది అంటే – జీవేశ్వరుడు. ఈ రెండూ ఒక్కటే.

వీటి అర్థాలు తెలుసుకున్నంత మాత్రాన చాలదు. వీటిని అనుసంధానం చెయ్యాలి.

అనాత్మగా ఉన్న ఈ దేహాదులన్నింటి యందు ఉన్నటువంటి 'అహం', 'మమ' అనే భావానికి 'అధ్యాసము' అని పేరు. అధ్యాసము అంటే–తప్పుగా తెలుసుకోవటము, మిథ్యాజ్ఞానము అని అర్థం. విద్వాంసుడు ఈ మిథ్యాజ్ఞానాన్ని నిరస్త (తొలగింపబడినది, త్రోసివేయబడినది, వెళ్ళగొట్టబడినది) రూపంలో బ్రహ్మనిష్ఠతో జయించాలి. అంటే అహంకార మమకారాలు మిథ్య. కాబట్టి ఆ మిథ్యాజ్ఞానాన్ని బ్రహ్మజ్ఞానంతో జయించాలి. శరీరము, ఇంద్రియాలు వీటికన్న వేరైనదే ప్రత్యగాత్మ. అందుచేత ఈ ప్రత్యగాత్మ బుద్ధి మొదలైన వ్యాపారాలన్నింటినీ సాక్షిగా గ్రహించి, ఆ ప్రత్యగాత్మయే నేను అని తెలుసుకోవాలి. దేహము, ఇంద్రియాలే నేను అనే భ్రాంతిని వదలివెయ్యాలి. లోకానువర్తనము అంటే – లోకాన్ననుసరించి సంచరించటం. దేహానువర్తనము

అంటే దేహాన్ననుసరించి చరించటం, శాస్త్రానువర్తనము అంటే – శాస్త్రాలలో చెప్పిన విధంగా నడచుకోవటం వీటిని వదలి, ఈ శరీరమే నేను అనే భ్రాంతిని వదలి వెయ్యాలి. లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన, దేహభ్రాంతులను పూర్తిగా పరిత్యజించాలి.

సాధకుడు స్వాత్మలో అంటే అతని ఆత్మలోనే స్థితుడై ఉండాలి. ఆత్మలో నివసించే వారికి మనస్సు నశించిపోతుంది. ఈ విషయం యుక్తి (తెలివి) స్వానుభూతి (తనయొక్క అనుభవము) శ్రుతులు (వేదమంత్రాలు, వేదవిజ్ఞానము) ద్వారా తెలుసుకోవాలి. శబ్దాదులను గౌరవించరాదు. ఆత్మను విస్మరించరాదు. అముక్త మార్గంలో నిద్రించరాదు. లోకవ్యవహారాలలో చిక్కుకోరాదు. సర్వదా ఆత్మధ్యానం మాత్రమే చెయ్యాలి. దీనివల్ల అనాత్మ (ఆత్మకానిది) బహిష్కరింపబడుతుంది. తల్లిదండ్రుల మలినాలతో పుట్టి, మలమూత్రములతో కూడిన ఈ దేహము అపరిశుభ్రమైనది. అందుచేత అసహ్యకరమైన ఈ శరీరాన్ని దూరము చేసి (తనకన్న వేరుగా చేసి) బ్రహ్మను నేను అని భావించి కృతకృత్యుడు కావాలి. జీవాత్మ పరమాత్మలు వేరు అనే భావం కలిగినట్లైతే అది అజ్ఞానము. ఘటాకాశాన్ని మహదాకాశంలో లయం చేసినట్లుగా, అఖండ భావనతో జీవాత్మను పరమాత్మయందు లయం చెయ్యాలి. అప్పుడు స్వయంప్రకాశముగా ఉన్న ఆత్మ తానే అవుతాడు. అందువలన తనచే, తననే తెలుసుకుని దేహరూపంలో ఉన్న పిండాండాన్ని, సృష్టి రూపంలో ఉన్న బ్రహ్మాండాన్ని మలభాండములాగా త్యజిస్తాడు. అనాదియైన అజ్ఞానముతో, దేహమే ఆత్మ అనే భావముతో దుఃఖము పొందుతున్నాడు. అందుచేత దేహాదులయందున్న అహం అనే బుద్ధిని ఆత్మయందు నిలిపి, సర్వదా కేవలము అద్వితీయ పరబ్రహ్మ అయి ఉంటాడు.

అద్దమునందు కనిపించే అంతఃపుర ప్రతిబింబములాగా, ఏ పరబ్రహ్మయందు మిథ్యాజగత్తు కనిపిస్తున్నదో, ఆ బ్రహ్మమే నేను. అని నిశ్చయించుకుని, కృతకృత్యుడు కావాలి. అహంకారం లేనివాడికి అఖండస్థితి చేకూరుతుంది. స్వయంప్రభుడైన అతడు చంద్రునిలాగా విమలుడై, సంపూర్ణమైన ఆనందము పొందుతాడు. క్రియ గనక నశిస్తే చింతకూడ నశిస్తుంది. అప్పుడే వాసనాక్షయమవుతుంది. ఈ రకంగా వాసనా ప్రక్షాళనయే మోక్షము. అటువంటి స్థితే జీవన్ముక్తి. అన్ని ప్రదేశాలలోను,

ఈ జగత్తునందంతటా, బ్రహ్మమాత్రముగా దర్శించటమే పరబ్రహ్మ సాక్షాత్కారము. ఇటువంటి భావనతోనే మనసులోపల ఉన్న వాసనలను జయించాలి. సర్వదా బ్రహ్మనిష్ఠయందు కొంచెము కూడా ప్రమాదం కలుగరాదు. ఈ ప్రమాదాన్ని బ్రహ్మవాదులైన మహర్షులు మృత్యువుగా పరిగణిస్తారు.

నీటిని ఆవరించి ఉన్న నాచును ప్రక్కకు నెట్టి వేసినప్పటికీ అది మళ్ళీ తానున్న చోటికే వచ్చి చేరుతుంది. అలాగే ప్రాజ్ఞుడు మాయను బయటకు పంపించినప్పటికీ, అతడు గనక బ్రహ్మనిష్ఠ నుంచి క్రిందికి జారినట్లైతే, ఆ మాయవచ్చి మళ్ళీ చేరుతుంది. దీనివల్ల అతని యోగనిష్ఠ భ్రష్టమవుతుంది. ఈ రకంగా ఎల్లప్పుడూ ఆత్మానుసంధానం చేస్తూ, జీవించినట్లైతే, అతడు బ్రహ్మజ్ఞానాన్ని పొందుతాడు. అటువంటివాడు జీవన్ముక్తుడు. అతడు ఈ శరీరం వదలిన తరువాత కూడా ఆత్మస్వరూపుడై ఉంటాడు. భ్రాంతి లేనటువంటి సమాధిచేత ఆత్మసాక్షాత్కారము కలిగినప్పుడు, అజ్ఞానము పూర్తిగా నాశనమవుతుంది. అప్పుడు 'అఖండ సచ్చిదానందమే తాను' అని ధృవీకరించుకుని, అహంకారము మొ॥వి తాను అని భావించకుండా, వాటన్నింటినీ ఘటపటాదులలాగా ఉదాసీన భావంతో దర్శించాలి. పిపీలికాది బ్రహ్మపర్యంతము, ఈ ఉపాధులన్నీ మిథ్యా మాత్రములు కాబట్టి వాటన్నింటినీ ఉదాసీన భావంతో దర్శించటం మంచిది. ఈ రకంగా చేసి పూర్ణముగా ఆత్మని మాత్రమే తెలుసుకోవాలి. బ్రహ్మ, ఈశ్వరుడు, రుద్రుడు మొదలు ఈ విశాల విశ్వంలో ఉన్న ఉపాధి అంతా కూడా ఆత్మయే. ఆత్మకన్న వేరే తత్త్వము లేదు.

ఈ ప్రపంచమంతా అసత్య పదార్థమే. అదంతా తనయందే ఆరోపించబడి ఉన్నది. అటువంటి ఆరోపిత ప్రపంచాన్ని నిరసించగా, పూర్ణుడు, అద్వయుడు, క్రియారహితుడు అయిన పరబ్రహ్మ తానే అవుతాడు. ఈ విశ్వమంతా అసత్కల్పము, అవికల్పము అయిన ఉన్నది. వస్తువు ఒక్కటే అది అవికారము. అవిశేషము. నీ రూపం కూడా అదే. అందులో నీపేరు ఉండదు. దర్శించేవాడు, దర్శింపబడినది, దర్శనము. ఈ త్రిపుటి ఆ పరబ్రహ్మయందు లేదు. ఆ పరబ్రహ్మము నిరామయమై, నిర్విశేషమై ఉన్నది. పరిపూర్ణము, చిద్రూపము, శివము, అవిద్యారహితము, అద్వితీయము అయి ఉన్నది. నిర్విశేషమైన పరతత్త్వంలో నీ నామము (వస్తు భిన్న ప్రపంచము) ఎక్కడ ఉంది ? ఏకాత్మక పరతత్త్వంలో భేదం చూసే వారెవరు ?

బ్రహ్మము అఖండమైనది. అందులో భేదాన్ని దర్శించేవాడు లేడు. ఈ భ్రాంతికంతటికీ మూలకారణము చిత్తము. ఆ చిత్తము గనక లేకపోయినట్లైతే ఈ జగత్తే లేదు. అందుచేత చిత్తాన్ని నిశ్చలమైన స్థితిలో ఉంచాలి. అప్పుడు ప్రత్యగ్రూప పరమాత్మ యందు ఐక్యమవటం జరుగుతుంది.

అఖండానంద స్వరూపమైన పరమాత్మ తనకన్నా వేరుగా లేదని అనుభవంలో ఉన్న బ్రహ్మజ్ఞానికి బహిరంతరములందు సదానంద రసాస్వాదనము కలుగుతుంది. వైరాగ్యానికి ఫలము జ్ఞానము. దీనివల్ల ఉపరతి ఫలము కలుగుతుంది. ఉపరతి అంటే కర్మలను పరిత్యజించటం. బాహ్యావిషయాలను చిత్తవృత్తులతో ఆశ్రయించకుండా ఉండటం. ఉపరతివల్ల "స్వానందానుభవ మహాశాంతి" అనే ఫలము లభిస్తుంది. వైరాగ్యము కలిగికూడా జ్ఞానం రాని పక్షంలో, ఆ వైరాగ్యము నిష్ఫలమవుతుంది. వైరాగ్యము, జ్ఞానము రెండూ కలిగి ఉపరతి కలగకపోతే, ఆ రెండూ నిష్ఫలమవుతాయి. వైరాగ్యము, జ్ఞానము, ఉపరతి మూడూ కలిగి శాంతిని పొందకపోతే – సర్వమూ నిష్ప్రయోజనమవుతుంది. మాయోపాదికత్వము, జగత్కారణత్వము, సర్వజ్ఞత్వము, పరోక్షధర్మ విశిష్ఠత్వము, స్వరూప లక్షణాలవుతాయి. అటువంటి లక్షణాలు గల పరమాత్మయే మహావాక్యంలోని 'తత్' పదానికి అర్ధం.. అంతఃకరణగలవాడై, అహం అనే తత్త్వానికి ఆధారంగా జీవుడు ప్రకాశిస్తున్నాడు. 'త్వమ్' అంటే చిదాభాసుడైన జీవుడే. జీవుడు ఆ బ్రహ్మముయొక్క ప్రతిబింబమే. ఈశ్వరుడు మాయాశరీరం గలవాడు. జీవుడు అవిద్యా శరీరం గలవాడు. ఇక్కడ ఈశ్వరుడికి ఉపాధి అయిన మాయను, జీవుడికి ఉపాధి అయిన అవిద్యను వదలి వేసినట్లైతే, జీవుడు ఈశ్వరుడు ఒకటే అవుతారు. అప్పుడు అఖండ సచ్చిదానంద రూపమైన పరబ్రహ్మ దర్శనమవుతుంది.

ఈ రకంగా మహావాక్యాన్ని అనుసంధానం చెయ్యటమే 'శ్రవణము'. విన్న విషయాన్ని యుక్తితో అనుసంధించటమే 'మననము'. వేదాంతార్థాన్ని శ్రవణం చేసి, మననం చేసినప్పుడు నిస్సంశయంగా తెలిసిన వస్తువునందు ప్రీతిని నిలిపి, దానియందు మనస్సు నిలిపి, తదేక ధ్యానం చెయ్యటమే 'నిధిధ్యానము' అనబడుతుంది. ధ్యాతను మరచి ధ్యానమును వర్జించి, ధ్యేయమైన గోచరమగు చిత్తాన్ని గాలిలేనిచోట ఉంచిన దీపంలాగా ఉంచటమే 'సమాధి. నిర్వికల్ప సమాధిలో

ఆత్మగోచరాలయిన అజ్ఞానవృత్తులు ఉంటాయి. కాని అవి ఆ సమయంలో తెలియబడవు. సమాధి నుంచి బయటకు వచ్చినప్పుడు, వారికి స్మృతి రూపంలో ఉన్న అనుభవాన్ని బట్టి, వృత్తులను ఊహించటానికి వీలవుతుంది. అనాదిగా ఉన్న ఈ సంసారంలో కోట్లకొలది సంచితకర్మలున్నాయి. అయినప్పటికీ పైన చెప్పిన సమాధివల్ల ఆ కర్మలన్నీ నశించిపోతాయి. పరిశుద్ధమైన ఆత్మధర్మము అభివృద్ధి చెందుతుంది.

ఈ నిర్వికల్ప సమాధి వేలకొలది ధర్మరూపామృతధారలను వర్షిస్తుంది. కాబట్టి యోగవేత్తలు ఈ సమాధిని 'ధర్మమేఘము' అంటారు. వాసనలే కర్మకు కారణం. నిర్వకల్ప సమాధివల్ల శుభాశుభవాసనలన్నీ పూర్తిగా నశించిపోతాయి. వాసనాక్షయం అవటంచేత పాపకర్మలు, పుణ్యకర్మలు అన్నీ నశించిపోతాయి. 'తత్ త్వం అసి' అనే మహావాక్యం సమాధి స్థితి లభించిన తరువాత అపరోక్షమైన ఆత్మసాక్షాత్కారాన్ని ప్రసాదిస్తుంది. అనుభవించదగిన విషయ సుఖములయందు గల అపేక్షలు నశించి, అవి మళ్ళీ పుట్టకుండా ఉన్నట్లైతే, అటువంటి స్థితిని వైరాగ్యము అంటారు. ఆత్మయందు దాగి ఉన్న చిత్తవృత్తి బయటకు రాకపోయినట్లైతే, ఉపరతి ప్రాప్తించిందని భావించాలి. అలాకాకుండా పాండిత్యముతో వైరాగ్యము ప్రాప్తిస్తుందనుకోవటం కేవలం భ్రాంతి మాత్రమే. వైరాగ్యం లేకపోతే జ్ఞానం కలగదు. ప్రజ్ఞగలవాడే స్థిత ప్రజ్ఞుడు. ఎవడు ఆనందాన్ని అనుభవిస్తున్నాడో, ఎవడు బ్రహ్మయందు ఆత్మను విలీనం చేస్తున్నాడో, ఎవడు నిర్వికారుడో, నిష్క్రియుడో, అటువంటి యతి స్థితప్రజ్ఞుడు.

ఈశ్వరుడు తత్ పదార్ధమని, జీవుడు త్వమ్ పదార్ధమని లక్ష్యార్ధ భావంతో శోధించినట్లైతే జీవబ్రహ్మల ఏకీభావం కలుగుతుంది. అటువంటి ఏకరూప జ్ఞానరూపంలో ఉన్న చిన్మాత్ర వృత్తిని 'ప్రజ్ఞ' అంటారు. జీవాత్మ పరమాత్మల ఏకత్వ రూపజ్ఞానమే ఆకారముగా ఉన్న ప్రజ్ఞగలవాడే జీవన్ముక్తుడు. దేహము, ఇంద్రియాలే నేను అనే భావాన్ని విడిచిపెట్టి, ఆత్మ స్థితుడైనవాణ్ణి జీవన్ముక్తుడు అంటారు. తనకన్న పరబ్రహ్మ వేరుగాలేదని, మాయాకల్పిత జగన్నిర్మాణము పరబ్రహ్మ కన్న వేరుగా లేదని, ప్రజ్ఞతో తెలుసుకున్నవాడు జీవన్ముక్తుడు. సాధువులు పూజించేటప్పుడు, దుర్మార్గులు పీడించేటప్పుడు కూడా సమభావంతో ఉన్నవాడే జీవన్ముక్తుడు. బ్రహ్మతత్త్వము తెలిసిన వ్యక్తి అందరిలాగానే సంసారమందున్నప్పటికీ, రాగద్వేషాలకు

వశం కాకుండా బహిర్ముఖుడై ఉంటాడు. ఈ విషయం బ్రహ్మవేత్తలకు మాత్రమే తెలుసు. ఇప్పుడు అనుభవించే సుఖదుఃఖాల అనుభవమంతా ప్రారబ్ధానికి సంబంధించినది. ఈ ప్రారబ్ధాన్ని జ్ఞానికూడా అనుభవిస్తాడు.

కలనుండి మెలకువ వచ్చిన వెంటనే కలకరిగిపోతుంది. అలాగే మహావాక్యార్థానుభవ జ్ఞానంతో అనేక కోట్ల జన్మలయందు కూడబెట్టిన సంచితకర్మ పూర్తిగా నశిస్తుంది. ఆకాశానికి ఏ వస్తువుతోనూ సంబంధము లేదు. అలాగే తాను కూడా ఆకాశంలాగా ఉదాసీనుడను, అసంగుడను (సంబంధం లేనివాడను) అని తెలిసికొన్న యతికి కర్మలతో ఏ రకమైన సంబంధము ఉండదు. ఆ యతి ఆగామికర్మ (ప్రాప్తించేది) రహితుడు. ఆకాశానికి కుండతో సంబంధము ఉన్నప్పటికీ, అందులోని సారాయితో సంబంధం లేదు. అలాగే ఆత్మదేహమందున్నప్పటికీ, దేహధర్మాలతో దానికి సంబంధంలేదు. విడువబడిన బాణము తన లక్ష్యాన్ని భేదించకుండా వదలదు. అలాగే జ్ఞానం రాకముందు ప్రారంభమైన ప్రారబ్ధకర్మను అనుభవించి తీరాలి. అది జ్ఞానంతో నశించదు. పులి అనుకొని బాణం వదిలాడు. కాని అది ఆవు. ఆవు బాణం తగిలి మరణిస్తుంది. అలాగే ప్రారబ్ధకర్మని అనుభవించాల్సిందే. అజరుడను, అమరుడను అనే స్థిరమైన బుద్ధి గలవాడికి ప్రారబ్ధకల్పన నిజంకాదు. బ్రహ్మనిష్ఠుడైన వాడికి ప్రారబ్ధ భోగాల అనుభవం సత్యంకాదు.

దేహమే ఆత్మ అనే భ్రాంతి ఉన్నవాడికి ప్రారబ్ధం ఉంటుంది. ఈ దేహము తాను కాదు అని నిశ్చయంగా తెలుసుకున్నవాడు తానే ఆత్మ అవుతాడు. మాయా కల్పితమైన ఈ దేహానికి ప్రారబ్ధకల్పన భ్రాంతి అవుతుంది. సత్యమైన దానికి జన్మము లేదు. నాశనములేదు. లేనటువంటి శరీరానికి ప్రారబ్ధం ఎలా వస్తుంది ? అందువల్ల పరమార్థంలో ప్రారబ్ధంలేదు. జ్ఞానంవల్ల అజ్ఞాన కార్యాలన్నీ నశించినప్పుడు జ్ఞానియొక్క దేహము మాత్రము ఏ రకంగా స్థిరంగా ఉంటుంది ? అందువల్ల ప్రారబ్ధమనేది వ్యావహారిక సత్యమే గాని పారమార్థిక సత్యంకాదు. పరబ్రహ్మము పరిపూర్ణము, అనాది, అనంతము, అప్రమేయము, అవిక్రియము, సద్ఘనము, చిద్ఘనము, నిత్యము, ఆనందఘనము, అవ్యయము, ప్రత్యగేకరసము, పూర్ణము, అనంతము, అనుపాధేయము, అనాధేయము, ఆశ్రయశూన్యము అవుతుంది.

ఆ పరబ్రహ్మ నిర్గుణము, క్రియారహితము, సూక్ష్మము, నిర్వికల్పము, నిరంజనము, అనిరూప్య స్వరూపము, మనోవాచామగోచరము, సత్ సమృద్ధము, స్వతఃసిద్ధము, శుద్ధము, బుద్ధము, అనీదృశము. ఆ బ్రహ్మము ఒక్కటిగా అద్వయముగా ఉన్నది. పరబ్రహ్మకన్న వేరైనది ఏదీలేదు.

మహావాక్యాలను శ్రద్ధగా విని వాటిని అర్థం తెలుసుకుని మననం చేసి వాటిని గనక అనుసంధానం చేసినట్లైతే సాధకుడు తానే సంగరహితుడు, అంగరహితుడు, లింగరహితుడు, ప్రశాంతుడు, అనంతుడు, పరిపూర్ణుడు, చిరంతరుడు, అకర్త, అభోక్త, అవికారుడు, అవ్యయుడు, శుద్ధ బుద్ధ స్వరూపుడు అయిన పరమాత్మ అవుతాడు. అంటూ మహావాక్యానుసంధానాన్ని వివరించాడు రత్నాకరుడు.

21. అఖండైకరసచిన్మాత్ర స్వరూపము

(తేజోబిందూపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు)

"గురువుగారూ ! పరమేశ్వరుడు అఖండైకరస చిన్మాత్ర స్వరూపుడు అంటారు కదా ! ఆ స్వరూపం ఏమిటో వివరించండి" అన్నాడు నారాయణభట్టు. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

అఖండైక రసము అంటే సంపూర్ణమైన ఒకే ఆనందరసము గలది. అని అర్థం. ఈ ఆనందము ఖండఖండాలుగా కాకుండా సంపూర్ణంగా ఉంటుంది. ఈ లోకంలో శిష్టాచార సంపన్నుడు, సిరిసంపదలు, భోగభాగ్యాలు ఉన్నవాడు, వేదవేదాంగవిదుడు, మంచి యౌవ్వనంలో ఉన్న మానవుడు పొందే ఆనందము మానుషానందము. దానికి ఒకటి ప్రక్కన పదిహేడు సున్నాలు పెడితే ఎంత అవుతుందో, అన్ని రెట్లుంటుంది బ్రహ్మానందం. అటువంటి సంపూర్ణమైన, అఖండైక రసమైన ఆనంద డోలికలలో విహరించేవాడు చిన్మాత్ర స్వరూపుడు. అతడే పరబ్రహ్మ.

దృశ్యమానమైన ఈ జగత్తు అఖండైక రసము. తాను అఖండైక రసమే. మంత్రము, క్రియ, జ్ఞానము, జలము, భూమి, ఆకాశము, శాస్త్రము, త్రయీవిద్య, బ్రహ్మ, జీవుడు, అన్నీ అఖండైక రసాలే. సృష్టికర్త అయిన బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, అహం అనబడే నేను (జీవుడు) తత్ అనబడే పరమేశ్వరుడు, గురువు, శిష్యుడు,

మనస్సు, దేహము, బుద్ధి, చిత్తము, అహంకారము, విద్య, సుఖము, పరము అన్నీ అఖండైక రసాలే. అఖండైక రసముకన్న వేరైనది ఏదీలేదు. నేను, నువ్వు, స్థూలము, సూక్ష్మము, జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము, తల్లి, తండ్రి, భ్రాత, పతి, పత్ని అన్నీ అఖండైక రసాలే.

శాంతము, గుణము, సాక్షి, స్నేహితుడు, బంధువు, మిత్రుడు, రాజు, రాజ్యము, పురము, ప్రజలు, జపము, ధ్యానము, పదము, గ్రాహ్యము, మహత్తు, జ్యోతిస్సు, హవిస్సు, హోమము, జపము, స్వర్గము, నరకము, ఘనము, భోజ్యము, తాను అన్నీ అఖండైక రసమైన చిన్మాత్ర స్వరూపాలే. ఈ సర్వము చిన్మాత్రయే. అఖండైక రసమే. ఈ లోకమంతా చిన్మాత్ర స్వరూపమే. నువ్వు, నేను, ఆకాశము, భూమి, వాయువు, అగ్ని, జలము, త్రిమూర్తులు, మూర్తామూర్తములు (రూపముగలవి, రూపము లేనివి) అంతా చిన్మాత్రయే. భూతము, భవ్యము, భవిష్యత్తు అంతా చిన్మాత్రయే. ద్రవ్యము, కాలము చిన్మాత్ర. జ్ఞానము, జ్ఞేయము చిన్మాత్ర. జ్ఞాతచిన్మాత్ర. సంభాషణ ఏదైతే ఉన్నదో అదంతా చిన్మాత్ర. సత్తు అసత్తు. ఆది అంతము, చిన్మాత్రయే. గురుశిష్యులు, దృక్కు దృశ్యము అన్నీ చిన్మాత్రయే.

లోకంలో దృశ్యమానమైన సర్వవస్తువులు, స్థూలదేహము, సూక్ష్మదేహము, కారణదేహము, అంతా చిన్మాత్రయే. పాపపుణ్యాలుకూడా చిన్మాత్రయే. చిన్మాత్రకన్న వేరైనది లేదు. చిన్మాత్రకన్న సంకల్పము లేదు. వేదనము (తెలివి) లేదు. మంత్రం లేదు, దేవతలేదు, వ్యావహారికము లేదు. పరబ్రహ్మ లేడు. ఏదీలేదు. ఎవడూ లేడు.

చిన్మాత్రకన్న మాయలేదు. పూజనము లేదు. మంతవ్యము (ఆలోచింపదగినది, ఊహించతగినది) లేదు. మౌనము లేదు, అమౌనము లేదు. వైరాగ్యము లేదు. సర్వమూ చిన్మాత్రయే. కంటికి కనిపించనిది చిన్మాత్రయే. వేదాంతమంతా చిన్మాత్రయే. చిన్మాత్ర కన్న గమనము లేదు. మోక్షము లేదు. లక్ష్యము అంతకన్నా లేదు. సర్వము చిన్మాత్రయే. అఖండైక రసమైన పరబ్రహ్మ చిన్మాత్రకన్న వేరుకాదు. శాస్త్రమునందు, నాయందు, నీయందు, ఈశ్వరునియందు, అఖండైకరసుడనైన నేను ఉన్నాను అని తెలుసుకున్నవాడు సకృత్ (వెంటనే) అద్వైత సిద్ధాంత జ్ఞానముతో ముక్తి పొందుతాడు. బ్రహ్మజ్ఞానము రాగానే స్వయముగా తానే గురువవుతాడు.

చిన్మాత్ర అంటే పరబ్రహ్మకన్న వేరు కాదు. ఛాందోగ్యోపనిషత్తులో బ్రహ్మతత్త్వ విజ్ఞానము నాలుగు పాదములుగా ఉన్నది. అంటూ ఈ విశాల విశ్వంలో నాలుగు దిక్కులూ బ్రహ్మతత్త్వములో ఒక భాగము.

భూమి, ఆకాశము, సముద్రాలు, నదులు, పర్వతాలు అన్నీ రెండవ భాగము.

సూర్యుడు, చంద్రుడు, విద్యుల్లతలు, అగ్ని మూడవ భాగము. ఇక నాల్గవ భాగం. ప్రాణం బ్రహ్మ, దృష్టి బ్రహ్మ, శ్రవణం బ్రహ్మ. మనస్సు బ్రహ్మ అని చెప్పబడింది. అంతేకాదు.

భూమి, సూర్యుడు, చంద్రుడు, ఆ పరబ్రహ్మయొక్క రూపాంతరాలే. సూర్యునిలోను, చంద్రునిలోనూ నీలోనూ ఉన్న తత్త్వము ఒక్కటే. దశదిశలు, నక్షత్రాలు, నేల, నీరు, నింగి, వీటిలో ఉన్న తత్త్వమంతా ఒక్కటే. ఆకాశంలోని మెరుపులో ఏ తత్త్వమైతే ఉన్నదో అదే నీలోనూ, నాలోనూ, చరాచర జగత్తంతా వ్యాపించి ఉన్నది. అదే పరబ్రహ్మ తత్త్వము. చిన్మాత్ర స్వరూపము. అఖండైక రసము. దీనిని తెలుసుకున్నవాడే మహాజ్ఞాని అంటూ అఖండైక రసచిన్మాత్ర స్వరూపాన్ని వివరించాడు రత్నాకరుడు.

22. ఆత్మసాక్షాత్కారము (మహోపనిషత్తు)

గురుదేవా ! ఆత్మ సాక్షాత్కారము అంటే ఏమిటి ? అది ఎలా సిద్ధిస్తుంది ? ఈ విషయాన్ని వివరించండి అన్నాడు నారాయణభట్టు. వివరించటం మొదలు పెట్టాడు రత్నాకరుడు.

సాధకుడు తనను తాను తెలుసుకోవటాన్నే స్వరూప జ్ఞానము అంటారు. సాధకుడు జగత్తంతా నాలోనే ఉన్నది. నేనే సాక్షాత్తూ పరబ్రహ్మను. సృష్టి స్థితి లయాలకు కారకుడను నేనే. ఈ జగత్తులో నేను తప్ప వేరే ఏదీలేదు. ఉన్నది ఒక్కటే అదే పరబ్రహ్మ. నేనే ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని జగత్తు అంతా నానుండే సృష్టించబడుతోంది. తిరిగి నాలోనే లయమవుతున్నది. నేనే పరమేశ్వరుడను అనే విషయాన్ని తెలుసుకోవటమే ఆత్మసాక్షాత్కారము. ఈ విషయాన్ని అనుభవం ద్వారా తెలుసుకోవాలి.

ఆత్మసాక్షాత్కారము కావాలంటే మనోమాలిన్యము తొలగిపోవాలి. భ్రమలు నశించి పోవాలి. మోక్షద్వారానికి 1. శమము 2. విచారణ 3. సంతుష్టి 4. సజ్జన సాంగత్యము అనబడే నలుగురు ద్వారపాలకులు. వీరిలో ఏ ఒక్కరిని గట్టిగా పట్టుకున్నా సరే, మిగిలిన ముగ్గురూ వశమవుతారు. అందుకని వీరిలో ఏ ఒక్కరినైనా సర్వప్రయత్నాలచేత, సమస్తాన్ని త్యజించి అయినా సరే గట్టిగా ఆశ్రయించాలి. శాస్త్రాభ్యాసము, సజ్జన సంపర్కము, అనే తపస్సుచేత, దమముచేత ముందుగా సంసారబంధ విముక్తి కోసం ప్రజ్ఞను గట్టిగా అభివృద్ధి చెయ్యాలి. అభ్యాసమువల్ల శాస్త్రవాక్యము, స్వానుభవము, సద్గురువాక్యము అనే మూడూ సమన్వయముతో ఎవరి ఆత్మలో నిరంతరమూ దర్శనమిస్తాయో అతనికి పరమాత్మ దర్శనమిస్తాడు.

ప్రతిక్షణము సంకల్పము, ఆశ, విషయములు అనే ఈ మూడింటినీ పరిత్యజిస్తూ ఉన్నట్లైతే పరమపావనమైన అమనస్కస్థితి సాధించినవాడవుతాడు. మనస్సు అకర్తగా ఉండే తూష్ణీంస్థితియే సమాధి.

అదే కేవల భావస్థితి. అది శుభప్రదమైన ఉత్తమ నిర్వాణము. మనస్సుతో సంకల్పాలను పరిత్యజించి, మూగవాడిలాగా, అంధుడిలాగా, జడునిలాగా సంచరించాలి. ఈ సర్వమూ ప్రశాంతము, అజము, ఏకము, ఆది మధ్యాంత రహితము. ప్రకాశ స్వరూపము, దృశ్యభావములేని అనుభవ రూపము. సమస్తము ఓంకార రూపము అని చెప్పటంకూడా భ్రాంతియే. ఈ సకల దృశ్య ప్రపంచమంతా చిద్వస్తువే. ఇక్కడ చైతన్యము తప్ప ఇంకొకటిలేదు అనే భావన చెయ్యాలి.

ఈ రకంగా సర్వదా జాగరూకతతో, నిండు మనసుతో, ఆత్మ అద్వితీయము అని తెలుసుకుని, జగత్కార్యాన్ని ఆరాధిస్తూ, తరంగాలు లేని సముద్రంలాగా నిశ్చలుడై ఉండాలి. వాసనలన్నింటికీ తృణానికి అగ్నివంటిదైన ఆత్మతత్త్వబోధయే సమాధి. అంతేకాని సమాధి అంటే తూష్ణీంస్థితి (మౌనస్థితి) కాదు. జాతిరత్నము ఇచ్ఛా శూన్యమైనప్పటికీ దానినుంచి కాంతులు వెదజల్లునట్లుగా, పరబ్రహ్మ తత్త్వము సత్తా మాత్రమైనప్పటికీ, బ్రహ్మాభావముగా ఈ జగత్తు సర్వము ప్రకటమవుతున్నది. ఆత్మయందు కర్తృత్వమున్నది. అయితే ఇచ్ఛ లేకుండా ఉంది కాబట్టి అకర్త, సన్నిధాన మాత్రమున కర్త కూడా అయి ఉన్నది. ఈ రకంగా పరస్పర విరోధంగల కర్తృత్వ రూపంలో ఉన్న ఈ చమత్కారము ఏ పరబ్రహ్మములో ఉన్నదో తెలుసుకుని, ఆ

బ్రహ్మమునే ఆశ్రయించి, ఆ బ్రహ్మలోకంలోనే స్థిరంగా ఉండాలి. 'నేను నిత్యము అకర్తనై ఉన్నాను' అనే భావంతో ఒప్పునది, పరమామృతము అనబడేది, అయిన సమత్వమే జ్ఞానికి శేషించి మిగిలేది. సత్తా మాత్రస్థితిలో ఉన్నవారే మహాగుణవంతులు. వారి స్థితి శాశ్వతమైనది. మహోన్నతమైనది. అటువంటివాడు ఆకాశంలో పూర్ణచంద్రునిలాగా ప్రసన్నవదనముతో ఉంటాడు. అతడే శాంతి, సుఖము, సమభావము సిద్ధించిన మహాత్ముడు. వారు రాత్రిపూట పద్మంలాగా ఆపదలందు కృశించిపోరు. శిష్టాచారులు పోయే మార్గంలో సత్ప్రవర్తనతో సంతోషంగా ఉంటారు. అటువంటివారి దేహములు మైత్రి మొదలైన సద్గుణాలతో శోభిల్లుతుంటాయి. వారు సమత్వభావం గలవారై, సర్వదా సాధువృత్తి గలవారై, సమరసులై మార్పు లేకుండా ఉంటారు. నిర్మలాత్ములైన మహాత్ములు సముద్రంలాగా మర్యాదను అతిక్రమించకుండా ఉంటారు. సూర్యునిలాగా నియమాలను విడిచిపెట్టకుండా ఉంటారు. నేను ఎవరిని ? ఈ సంసార మాలిన్యము ఏ రకంగా వ్యాపించి ఉన్నది ? అని ప్రాజ్ఞుడు, సాధువు అయినమహాత్మునిసన్నిధిలో చక్కగా విచారణ చెయ్యాలి. నిషిద్ధకర్మలు చేయరాదు. ఆచార్యులతో కలిసి నివసించరాదు సర్వసంహార సంహర్త అయిన మృత్యువును హేళన చేయరాదు. ఈ దేహము ఎముకలు, మాంసము, రక్తము మొదలైన అశోభన పదార్థాల సమూహమే అనిగ్రహించి, దేహంమీద మమకారాన్ని విడిచిపెట్టి, సకల జీవులను ముత్యాల హారములోనిదారములాగా చిన్మాత్ర పరమాత్మగా దర్శించాలి.

ఇది కావాలి అనుకోవటం, ఇది వద్దు అని ద్వేషించటం ఇదే మనసుయొక్క స్వరూపము. ఆత్మ అటువంటి మనసుకన్న వేరుగా ఉన్నది. సద్గురువులు, శాస్త్రాలు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ, స్వానుభవంలో "నేను చిద్గగనుడైన బ్రహ్మనే అయి ఉన్నాను" అని తెలుసుకుని, శోకము లేనివాడు కావాలి. జీవన్ముక్తుని దుఃఖాతీత శక్తి అద్భుతమైనది. పదునైన కత్తితో నరుకుతున్నప్పటికీ కలువపూలు పైన చల్లిన రీతిగా భావిస్తాడు. అగ్నితో కాల్చేటప్పుడు మంచు బిందువులు మీద చల్లుతున్నట్లుగా భావిస్తాడు. నిప్పులలో త్రిప్పుతున్నప్పుడు మంచి గంధపు చల్లదనాన్ని అనుభవిస్తాడు. బాణవర్షము కురిపించినప్పుడు ఎండలో నిర్మించిన జలయంత్రం నీళ్ళు జల్లుతున్నది అనుకుంటాడు. శిరచ్ఛేదన చేసినప్పుడు సుఖముగా నిద్రిస్తాడు. వాగ్బంధనము చేస్తే మౌనముద్రగా భావిస్తాడు. శ్రోత్రాన్ని బంధిస్తే నిశ్శబ్దస్థితి అనుభవిస్తాడు.

అటువంటి మహోన్నతమైన స్థితి ఉపేక్షతో ప్రాప్తించదు. దృఢవైరాగ్య సాధనతో అట్టి స్థితి సిద్ధిస్తుంది. గురువాక్యంచేత, వచ్చిన స్వానుభవముతో, పరిశుద్ధ బుద్ధితో నిరంతరము అభ్యాసం చెయ్యటంచేత ఆత్మను చక్కగా దర్శించవచ్చు. ఆత్మసాక్షాత్కారం పొందవచ్చు.

దిగ్భ్రమ పూర్తిగా పోయినప్పటికీ, గతంలో లాగానే దిక్కులయొక్క జ్ఞానము ఉంటుంది. అలాగే బ్రహ్మజ్ఞానంవల్ల ఈ జగత్తులేదు అని తెలిసినా కూడా, జగత్తు కనిపిస్తూనే ఉంటుంది. అలా కనిపించినప్పటికీ జగత్తులేదనే భావించాలి. ఆత్మసాక్షాత్కారానికి సిరిసంపదలు సాయం చెయ్యలేవు. స్నేహితులు, బంధువులు, శరీర కష్టము, తీర్థాలు సేవించటము, సాయపడవు. కేవలము పరమాత్మలో తన్మయత్వం పొందే మనసు కలవాడే ఆత్మసాక్షాత్కారం పొందగలడు. దుఃఖాలు, తృష్ణ, భరించలేని చింతలు, అన్నీ మహాత్ములకు సూర్యకిరణములవల్ల అంధకారం నశించినట్లుగా నశిస్తాయి. క్రూరజంతువులు, సౌమ్యజంతువులు అన్నీ శమముగల మహాత్ముని కన్నతల్లిని చేరునట్లుగా, విశ్వాసముతో సమీపిస్తాయి. మానవుడు శమమువల్ల పరమసుఖము అనుభవిస్తాడు. అటువంటి పరమసుఖము అమృతపానం వల్ల కూడా సిద్ధించదు. లక్ష్మీదేవి అనుగ్రహంతో లభించదు. శుభాశుభాలను విని, అనుభవించి, దర్శించి, తెలుసుకొని, సంతోషము, దుఃఖము పొందనివాడు శాంతస్వరూపుడు.

ఎవరి మనసైతే మరణకాలమందు, ఉత్సవసమయమందు, యుద్ధమందు కూడా వ్యాకులత చెందకుండా స్వచ్ఛంగా ఉంటుందో, అటువంటివాడు శాంతుడు. తపస్సంపన్నులయందు, బుద్ధిశాలులయందు, యజ్ఞములు చేసిన వారియందు, చక్రవర్తులయందు, బలవంతులయందు, సద్గుణ సంపన్నులయందు, శమము (అంతరింద్రియ నిగ్రహము) కలిగి ఉండేవాడే ప్రశస్తిని పొందుతాడు. సంతోషామృత పానంతో ఎవరు శాంతచిత్తులవుతారో, అట్టివారే పరమపదమును పొందుతారు. ప్రాప్తించని వాటికోసందుఃఖించనివాడు, ప్రాప్తించినవాటితో తృప్తి చెందేవాడు, భేదభావాలు లేనివాడు, సంతుష్టుడు. అంతఃపురంలో నివసించే సాధ్వి ఏ రకంగా లభించినవాటితో తృప్తి చెంది ఆనందంగా ఉంటుందో, అలాగే ప్రాప్తమైన వాటితో సంతృప్తి చెందేవాడు జీవన్ముక్తునిస్థితి పొందుతాడు. అదే స్వస్వరూపానందము.

ప్రాజ్ఞుడు శాస్త్రాలను, దేశకాలమానాలను అనుసరించి, ఏది సుఖమో, అది ఎలా దొరుకుతుందో, విచారిస్తుంటాడు. ఈ రకంగా ఆత్మలో విశ్రాంతి దొరికేదాకా మోక్షపదానికి దారి వెతుకుతూ ఉండాలి. సంసారార్ణవమునుండి బయటపడి, తురీయస్థితిలో విశ్రాంతి పొందేవాడు గృహస్థుగాని, సన్యాసిగాని, జీవించి ఉన్నా, మరణించినా అతడు కృతకృత్యుడు. అటువంటి జీవన్ముక్తుడు కర్మలు చేసినందువల్ల ప్రయోజనంలేదు. చెయ్యకపోతే అపకారంలేదు. మందరపర్వత రహితుడు, క్షోభిరహితుడు అయిన క్షీరసాగరంలాగా ఆత్మస్థితుడు ఆనందంగానే ఉంటాడు. దృశ్యపదార్థాలన్నీ పరమాత్మగానే దర్శించే జ్ఞానము కలిగినప్పుడు, దేశకాలవస్తు పరిచ్ఛేద, శూన్యము, శుద్ధ చిద్రూపము అయిన స్వస్వరూపము ప్రకాశిస్తుంది. అదే ఆత్మసాక్షాత్కారము. ఈ రకంగా నువ్వు భావించిన రూపంలో ఆత్మ ప్రత్యక్షమవుతుంది. స్థావరజంగమాత్మకమైన సమస్త దృశ్య ప్రపంచము, గాఢనిద్రలో స్వప్నంలాగా, ప్రళయకాలంలో నశించిపోతుంది. ఆత్మ, ఋతము, సత్యము, పరబ్రహ్మము అనే పదాలు పరబ్రహ్మకు వ్యవహారసంజ్ఞలు.

కంకణము అంటే బంగారమే కాని ఇంకొకటి కాదు.కడియము అన్నా బంగారమే. అలాగే ఈ జగత్తు అంటే పరమాత్మయే అవుతుంది. జగత్తే బ్రహ్మ, బ్రహ్మయే జగత్తు. ఆ చిత్ బ్రహ్మనుండే ఈ జగత్తుగా కనిపించే ఇంద్రజాలము విస్తారముగా ఉన్నది. దృశ్యముయొక్క స్థితే ద్రష్ట అయిన ఆత్మకు బంధము. ద్రష్ట (చూసేవాడు) దృశ్యపదార్థములవలన బద్ధుడవుతున్నాడు. దృశ్యముయొక్క అభావముతో జీవన్ముక్తుడవుతున్నాడు. నేను, నీవు అనే బాధలతో ఉన్నదే జగత్తు. మనస్సు వల్లనే జగత్తు అనే ఇంద్రజాలము విస్తరించి ఉన్నది. ఈ మనస్సు అనే కల్పితభావము ఎంతకాలం ఉంటుందో, అంతకాలం మోక్షంరాదు. స్వయంభువయిన పరమేశ్వరుడే ఈ జగత్తును సృష్టించాడు. అతనియొక్క మానసిక సృష్టియే ఈ జగత్తు. అందుచేతనే నామరూపాలుగల దృశ్యమాన జగత్తంతా మనస్సే అయి ఉన్నది. మనస్సులేనప్పుడు ఈ జగత్తులేదు. మనస్సు అనేది హృదయంయొక్క లోపలగాని, బయటగాని, ఇంకోచోటగాని లేదు. దానికి సత్యమైన ఉనికిలేదు. విషయ సంకల్పమే మనస్సు. సంకల్పమే మనస్సుయొక్క రూపము. ఎక్కడ

మనస్సుంటుందో అక్కడ సంకల్పముంటుంది. సంకల్పము, మనసూ రెండూ వేరుకాదు. సంకల్పాలన్నీ నశించినప్పుడు పరమాత్మస్వరూపమే మిగులుతుంది.

నేను, నువ్వు, జగత్తు మొదలైన దృశ్యభ్రమ శమింపగా, దృశ్యమంతా అసత్తు కాగా, మిగిలిన స్థితే కైవల్యము. అదే ఆత్మస్థితి మహాప్రళయం సమయంలో సకల దృశ్యజగత్తు సత్తాశూన్యమై పోతుంది. అప్పుడు సృష్టికి పూర్వములో ఉన్న శాంతి రూపమైన అద్వితీయ పరమాత్మే మిగులుతుంది. ఈ సృష్టికి పూర్వము ఏదిఉన్నదోఅదే ప్రళయము. అటువంటి ఆత్మభానుడు ఎప్పుడూ అస్తమించడు. సర్వదా తేజోవంతుడై ఉంటాడు. ఆ పరమాత్మ అజుడు (జన్మలేనివాడు) దేవుడు, సమస్త దోషరహితుడు. అతడే సర్వకర్త. సర్వస్వరూపుడు. ఎక్కడినుండి వాక్కులు వెనక్కి తిరిగి వస్తుంటాయో, దేనిని ముక్తపురుషులు తెలుసుకుంటున్నారో, దాన్నే ఆత్మ అంటారు. ఆకాశములు మూడున్నాయి. 1. చిత్తాకాశము 2. చిదాకాశము 3. దహరాకాశము. వీటిలో చిదాకాశము అత్యంత సూక్ష్మమైనది. మనసు ఒకచోటినుండి ఇంకొక చోటికి పోయేటప్పుడు, ఆ మధ్య సమయంలో రెప్పపాటు కాలంలో అనుభవమయ్యే ఆనందమే చిదాకాశము. రెండు దృశ్యముల మధ్యనున్న ఉనికియే చిదాకాశము.

సర్వసంకల్పాలు త్రోసి పుచ్చిన స్థితిలో స్థిరముగా ఉన్నప్పుడు సర్వాత్మక శాంతపదము పొందగలడు. ఔదార్యము, సౌందర్యము, వైరాగ్యములతో కూడిన పరమపద ఆనందస్థితియే సమాధి. దృశ్యము లేనే లేదు అనే భావనతో రాగద్వేషాలు నశిస్తాయి. ఆ సమయంలో మహత్తరమైన స్వరూపానందం కలుగుతుంది. అటువంటి స్థితియే సమాధి. దృశ్యము లేదనే భావనే నిజమైన జ్ఞానము. అదే కేవల భావము. చిదాత్మక విజ్ఞేయము. అదే కైవల్యస్థితి. అంతకన్న మిగిలినదంతా మిథ్య, మదించిన ఏనుగు ఆవగింజలో బంధింపబడినది. చిన్నదైన చెట్టు తొర్రలో ఒక దోమ సింహాల గుంపుతో యుద్ధం చేసింది. తామరపూసలో మేరుపర్వతము పెట్టబడినది. ఆ తామరపూసను తుమ్మెద మ్రింగివేసింది. ఇవన్నీ అసంభవాలు. భ్రమతో కూడిన వాక్యాలు. ఈజగత్తుకూడా అలాంటిదే. ఈ జగత్తుకు అస్థిత్వము లేదు. రాగద్వేషాలతో దూషితమైన చిత్తమే సంసారము. ఆ చిత్తము ఎప్పుడు రాగద్వేష రహితం అవుతుందో, అప్పుడు సంసారం నివృత్తి జరిగి మోక్షం సిద్ధిస్తుంది.

మనసుతో భావింపబడినవాడై జీవుడు దేహవాసన కలిగి ఉంటాడు. దేహవాసన పోయిన తరువాత, అతడు దేహధర్మాలకు అంటుకోడు. మనస్సుకు గొప్పశక్తి ఉన్నది. అది ఒక కల్పము కాలాన్ని ఒక క్షణంగా చేస్తుంది. అలాగే ఒక్క క్షణకాలాన్ని కల్పంగా చేస్తుంది. ఈ సంసారమంతా మనోవిలాసం మాత్రమే. దుష్ప్రవర్తన విడిచి పెట్టనివాడు, అశాంతుడు, కేవలము ప్రజ్ఞాబలంతో ఆత్మసాక్షాత్కారము పొందలేడు. ద్వంద్వరహితమై, నిర్గుణమై, సత్యమై, చిద్ఘనమైనట్టి బ్రహ్మానందాన్ని తన ఆత్మరూపంగా తెలుసుకున్నవాడు ఎన్నటికీ భయపడడు. ఉత్తమోత్తమమైనది, మహత్తరమైనది, తేజోమయమైనది, కళ్యాణకారకమైనది, శాశ్వతమైనది, సర్వజ్ఞము, పురాణము, సనాతనము, సకల దేవతలచేత ఆరాధింపబడునది అయిన సర్వేశ్వర రూపాన్ని గురించి తెలుసుకున్నవాడు దేనికీ భయపడడు. అతడికి భయంలేదు.

'మమ', 'నమమ', ఈ రెండు పదాలే బంధమోక్షాలకు హేతువులు. మమ అనుకొన్న జీవుడు బద్ధుడవుతాడు. నమమ అనుకున్నవాడు ముక్తుడవుతాడు. చేతనాచేతనాత్మకమగు ఈ జగత్తు జీవేశ్వరాది రూపంలో ప్రకాశిస్తున్నది. ఈ సృష్టి అంతా పరమేశ్వర సంకల్పమైనది. జాగ్రదవస్థ నుండి మోక్షము వచ్చేదాకా, సంసారము జీవకల్పితమై ఉన్నది. నాచికేతాగ్ని మొదలు యోగమువరకు ఉన్న మతాలన్నీ ఈశ్వరుని విషయంలో భ్రాంతిని ఆశ్రయించి ఉన్నాయి. పొరపాటు పడుతున్నాయి. చార్వాకుల నుండి, సాంఖ్యులదాకా జీవభ్రాంతిని ఆశ్రయించి ఉన్నాయి. అందువల్ల ముముక్షువులు జీవేశ్వర సిద్ధాంతంలో బుద్ధిని ప్రవేశింపనీయరాదు. నిశ్చలబుద్ధితో బ్రహ్మతత్త్వ విచారణ చెయ్యాలి. అన్వయ వ్యతిరేక సిద్ధాంతాలద్వారా ఈతడు సాక్షాత్తు జ్ఞాని. అతడే శివుడు. అతడే హరి, అతడే బ్రహ్మ. సద్గురువు యొక్క కరుణ లేకపోతే విషయత్యాగం చాలాకష్టం. తత్త్వదర్శనము దుర్లభము. సహజావస్థ మరీ దుర్లభము.

ఈశ్వరుడే ఈ జగత్తును సృష్టించాడు అనే జ్ఞానంగలవాడు, సర్వకర్మలను త్యాగం చేసినవాడు, అయిన యోగికి ఆత్మస్థితి సహజంగానే కలుగుతుంది. మానవుడు ఈ జగత్తులో భేదభావం గనక దర్శించినట్లైతే, అతడికి భయం కలుగుతుంది. సచ్చిదానందమనే జ్ఞాననేత్రము సర్వవ్యాపకమైనది. ప్రకాశించే సూర్యుణ్ణి గ్రుడ్డివాడు చూడలేడు. అలాగే అజ్ఞాని సచ్చిదానందాన్ని దర్శించలేడు. ప్రజ్ఞానమే బ్రహ్మ. ఆ

బ్రహ్మము సత్యజ్ఞానాది లక్షణాలు గలది. అటువంటి బ్రహ్మను గూర్చిన జ్ఞానంవల్లనే మానవుడు అమృతుడవుతున్నాడు. పరాపర రూపమైన పరబ్రహ్మసాక్షాత్కారమైన తరువాత, మానవుని యొక్క హృదయగ్రంథులు విడిపోతాయి. సర్వసంశయాలు నశించిపోతాయి. అన్ని కర్మలు క్షీణిస్తాయి. కాబట్టి అనాత్మ అనే సంకల్పాన్ని పరిత్యజించాలి. జగత్తు విషయంలో నిర్వికారుడై ఉండాలి. అంతర్ముఖుడై కేవలము సంవిన్మాత్రపరుడై (అన్నీ తెలిసినవాడవై) ఉండాలి. భ్రమవల్ల ఎడారులలో నీటిగుంటలు కనిపిస్తాయి. కాని అవి మృగతృష్ణలు. అలాగే జాగ్రస్వప్నసుషుప్తులకు సంబంధించిన జగత్తంతా ఆత్మస్వరూపం దక్క వేరుకాదు.

లక్ష్యా లక్ష్యబుద్ధులను త్యజించి కేవలము ఆత్మమాత్రుడుగా ఎవడు ఉంటాడో, అతడు సాక్షాత్తూ ఈశ్వరుడే అయి ఉన్నాడు. అతడే ఉత్తముడైన బ్రహ్మజ్ఞాని. సర్వానికీ అధిష్ఠానము పరబ్రహ్మయే. ఉపమానము లేనిది అవాఙ్మానస గోచరము, నిత్యము, సర్వగతము, సూక్ష్మాతిసూక్ష్మము, అవ్యయము అయి ఉన్నది. ఈ జగత్తు సర్వశక్తి మయుడగు పరమేశ్వరుని విలాసముగా ఉన్నది. సంశయము, అసంశయాలతో, ఈ సంసారము శాంతి పొందుతున్నది. మనోవ్యాధికి చికిత్స కోసం ఒక్కటే ఉపాయం ఉన్నది. ఏ వస్తువుమీద ప్రీతి ఎక్కువ ఉంటుందో, దాన్ని త్యజిస్తూ వెళ్ళాలి. అప్పుడే మోక్షం సిద్ధిస్తుంది. స్వాధీనములో ఉన్నది. ఏకాంతహితమైనది, అయిన ఇష్టమైన వస్తువును పరిత్యజించటానికి ఇష్టపడనివాడు కీటకంతో సమానము.

అసంకల్పము అనే శస్త్రంతో ఈ చిత్తాన్ని ఛేదించాలి. అప్పుడే స్వరూపము, సర్వగతము, శాంతము, అయిన పరబ్రహ్మ ప్రాప్తిస్తుంది. లోకవిషయభావనను పూర్తిగా విడిచి పెట్టెయ్యాలి. పరబ్రహ్మను గురించే ఆలోచించాలి. మనోనిగ్రహము కలిగి ఉండాలి. శాంతమనస్కుడై ఉండాలి. మనస్సు మ్రింగి వేయబడిన స్థితి అదే అమనస్క స్థితి. అదే బ్రహ్మపదము. పరమమయిన పురుషయత్నాన్ని ఆశ్రయించి, చిత్తాన్ని అచిత్తముగా చేసి, హృదయాకాశంలో ఆత్మను ధ్యానించాలి. జ్ఞానము అనే చక్రాయుధంతో మనస్సును సంకోచం లేకుండా ఛేదించాలి. అప్పుడు కోరికల రూపంలో ఉన్న శత్రువులు నిన్ను బంధించలేరు. నేను నాది అనే సంకల్పమే మనస్సు. అటువంటి సంకల్పాలు లేకుండా చేసి, నిస్సంకల్పము అనే కొడవలితో మనస్సును ఛేదించాలి. శరత్కాలంలో ఆకాశంలో పట్టిన మేఘాలు, వేగంగా వీచిన

గాలులవల్ల చిన్నాభిన్నమై పోయినట్లుగా, చక్కని ఆత్మవిచారంతో మనస్సు అమనస్సు కావాలి. అదే మనస్సు అంతర్ధానమైన స్థితి. అమనస్కము.

ప్రళయకాల పవనాలు వీచినప్పటికీ, సముద్రాలన్నీ ఏకమైనప్పటికీ, ద్వాదశాదిత్యులు ఒక్కసారే ప్రకాశించినప్పటికీ, మనోనాశనమైన వారికి ఏ విధమైన చింత ఉండదు. మోక్షసామ్రాజ్యము సంకల్ప రాహిత్యం చేతనే సిద్ధిస్తుంది. మనసు ఎప్పుడూ చలనం లేకుండా ఉండదు. అగ్నికి ఉష్ణము ధర్మములాగానే మనసుకు చంచలత్వము ధర్మము. చిత్తాన్ని ఆధారంగా చేసుకుని ఉన్నది, చంచలముగా ఉన్నది, అయిన స్పందనశక్తియే మనోసంబంధమైన చిత్తశక్తి. ఈ జగదాడంబరము అంతా మనసుకు సంబంధించినదే. చలనరహితమైన మనస్సు అమృతమయము. అది తపస్సు, దాన్నే మోక్షము అంటారు. మనస్సుయొక్క చంచలత్వమే వాసనారూప మయిన అవిద్య. దీన్నివిచారణద్వారా నశించిపచెయ్యాలి.

పురుష ప్రయత్నాన్ని ఆశ్రయించి, శుద్ధచిత్తముతో మలిన చిత్తాన్ని జయించాలి. మనసును నిగ్రహించాలి అంటే దానికి మనస్సే సమర్ధవంతమైనది. రాజును జయించటానికి రాజే సమర్థుడు. ఇంకొకడు సమర్థుడు కాదు. సంసారమనే సాగరంలో చిక్కి, ఆశ అనే గ్రహంతో పట్టుకోబడిన వాడికి అతనియొక్క శుద్ధ మనస్సే నావగా ఉన్నది. వివేకమైన మనస్సుతో బంధరూపంలో ఉన్న పాశాన్ని ఖండించి, సంసార సాగరం నుంచి నిన్ను నువ్వే రక్షించుకోవాలి. సాధకుడు తనను తానే ఉద్ధరించుకోవాలి. ఇతరులెవరూ కాపాడలేరు. తనలోపల జనించిన ఇష్టాన్ని ప్రాజ్ఞుడు నశింపచేసుకోవాలి. దానితో అవిద్య నశిస్తుంది. భోగవాసనను విడిచి, భేదవాసనను త్యజించి, భావాభావములను పరిత్యజించి, నిర్వికల్పుడైనవాడు సుఖిస్తాడు. అనుభవానికి వచ్చే వేటికీ నీలోపల అవకాశ మియ్యవద్దు. ఇదే మనోనాశనము. అవిద్యానాశనము.

దృశ్యములందు విశ్వాసముప్రీతి విడిచిపెట్టి ఉండటమే మోక్షము. దృశ్యములందు విశ్వాసముప్రీతి కలిగి ఉండటమే దుఃఖము. అవిద్య అనేది లేనేలేదు. అయినప్పటికీ అష్టప్రజ్ఞలయందు అవిద్య కనిపిస్తోంది. నామమాత్రంగా ఉన్న ఈ అవిద్య సమ్యక్ ప్రజ్ఞగలవారియందు అసలుండదు. సమ్యక్ ప్రజ్ఞ సిద్ధించేదాకా ఈ అవిద్య అమాయకుడైన జీవిని తనవెంట తీసుకుపోయి దుఃఖాలనే ముళ్ళపొదలలో

పడవేస్తుంది. సమ్యక్ ప్రజ్ఞ గలవారిని ఈ అవిద్య ఏమీ చెయ్యలేదు. మోహకారకమైన కోరికలున్నంతవరకూ, ఈ అవిద్య వెంటాడుతూనే ఉంటుంది. పరతత్త్వాన్ని అవలోకించిన వెంటనే ఈ అవిద్య నాశనమవుతుంది. సర్వగతమైన జ్ఞానాన్ని దర్శించినట్లైతే అవిద్య తనకు తానే నశించిపోతుంది. అవిద్య నశిస్తే ఆత్మసాక్షాత్కారము జరుగుతుంది. ఆ స్థితి రావాలంటే సంకల్పాలు పూర్తిగా నశించాలి.

చిత్తాకాశములో వాసనారూపంలో ఉన్న రాత్రి నశించిన తరువాత, చిదాదిత్య ప్రకాశమువల్ల చంద్రకళ (జీవభావము) వెలవెలపోతున్నది. విషయములు అనే దృశ్యసంబంధాలు లేనట్టిది, సామాన్యరూపంలో సర్వవ్యాపకము, అనిర్వచనీయము అయిన చైతన్యమే ఆత్మ. అదే పరమేశ్వరుడు. ఈ సమస్తము నిత్యమై, సత్యమై, అక్షయమైన బ్రహ్మమే అయి ఉన్నది. మనస్సు అనే పేరుగల కల్పన ఇంకొకటి ఏదీలేదు. ఈ జగత్తులో ఏదీ జన్మించటంలేదు. మరణించటంలేదు. అందువల్ల షడ్భావ వికారాలు కనిపిస్తున్న వీటన్నింటికీ అస్థిత్వము కొంచెముకూడా లేదు. ఏకముగా ఉన్నది, తేజోరూపము, స్వరూపము, సర్వసామ్రాజ్యము, అవ్యయము, చైతన్యానుపాతరహితము, చిన్మాత్రము అయిన బ్రహ్మమే ఇక్కడ ఉన్నది. అటువంటి నిత్యమైన వ్యాపకముగాఉన్న, శుద్ధమైన, చిన్మాత్రముగాఉన్న, నిరుపద్రవమైన శాంతశమ పూర్ణ నిర్వికారమైన చిదాత్మయందు మనసు విహరిస్తుంది. మనసు తన స్వభావానికి అనుగుణ్యమైన దానిని కల్పించుకుని, అన్ని దిక్కులకు పరుగుపెడుతుంది. ఎప్పుడూ మననము చేస్తుంది కాబట్టే దీన్ని మనస్సు అంటారు. ఈ మనస్సు సంకల్పము చేతనే సిద్ధిస్తుంది.

'నేను బ్రహ్మముకాదు' అనే ఆలోచనతో మనసు బంధింపబడుతున్నది. సర్వమూ బ్రహ్మమయమే అనే దృఢసంకల్పంతో మనస్సు విముక్తమవుతుంది. నేను కృశించినవాడను. దుఃఖించినవాడను. కోరికలతో బంధింపబడినవాడను, కాలు చేతులు గలవాడను అనే భావంతో వ్యవహరిస్తూ జీవుడు బద్ధుడవుతున్నాడు. నేను దుఃఖినికాదు. నాకు దేహములేదు. బంధములేదు. అనే భావాలతో జీవి విముక్తుడవుతున్నాడు. నేను మాంసమును కాను. ఎముకలు కాను. దేహముకన్న వేరైనవాడను, నేను పరతత్త్వమును అని అంతరంగంలో నిశ్చయించుకున్నవాడు అవిద్యారహితుడై ఆత్మసాక్షాత్కారము పొందుతాడు. అనాత్మయందు ఆత్మభావన

చెయ్యటంచేత అవిద్య కల్పించబడింది. పురుషప్రయత్నం తీవ్రం చేసి, భోగేచ్ఛను దూరంగా వదలి, నిర్వికల్పుడై, సుఖవంతుడు కావాలి. ఈ రకంగా అమనస్కుడైన జ్ఞానికే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. అంటూ వివరించాడు రత్నాకరుడు.

23. ఆత్మానుభవము (తేజోబిందూపనిషత్తు)

"గురుదేవా ! ఆత్మానుభవాన్ని వివరించండి" అని అడిగాడు. నారాయణభట్టు వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

ఆత్మదర్శనమైనవాడు ఈ విధంగా ఆలోచిస్తాడు. అతని అనుభవం ఈ రకంగా ఉంటుంది. నేను పరబ్రహ్మ స్వరూపుడను. జ్ఞానరూపుడను. పరముడను, కేవలము శాంతరూపుడను. చిన్మయుడను. నిత్యరూపుడను, శాశ్వతుడను, సత్యరూపుడను, నేను కలిసిఉన్నాను. నేను విడిచిఉన్నాను. సర్వజీవస్వరూపుడను, చిదాకాశమయుడను.

నేను సత్పరానందరూపుడను చిత్పరానందరూపుడను. వాక్కుకు, మనస్సుకు గోచరము కానివాడను. ఆత్మానందరూపుడను. సత్యానందరూపుడను. ఆత్మారామ స్వరూపుడను. ఆత్మను, సదాశివుడను. ఆత్మప్రకాశరూపుడను. ఆత్మజ్యోతిని, రసమును, ఆదిమధ్యాంత రహితుడను, ఆకాశ సదృశుడను. నిత్యశుద్ధుడను, చిదానందుడను, సత్తామాత్రుడను, నిత్యబుద్ధుడను, ఏకసచ్చిదానందమును, సర్వాతీతుడను, రూపాతీతుడను. పరమైన ఆకాశ విగ్రహుడను భూమానందస్వరూపుడను, భాషాహీనుడను, సర్వాధిష్ఠాన రూపుడను, దేహభావ హీనుడను, చింతాహీనుడను, చిత్తవృత్తి హీనుడను. చిదాత్మైకరసుడను, ద్రుగ్రూపుడను. పూర్ణరూపుడను, నిత్యతృప్తుడను. నేనే బ్రహ్మను. సర్వమూనేనే. చైతన్యము నేనే జడము నేనే. గొప్పదైన ఆకాశ స్వరూపిని నేనే. నేనే ఆత్మను. పరాత్పరుడను. నేను ఎవరోలాగా ప్రకాశిస్తుంటాను. నేను శరీరములాగా భాసిస్తాను.

నేను శిష్యునిలాగా భాసిస్తాను. లోకత్రయాశ్రయుడను. త్రికాలములకు అతీతుడను. వేదములచే ఉపాసింపదగినవాడను నేనే. శాస్త్రంతో నిర్ణయింపబడే వాడను. చిత్తములో ఉన్నవాడను. నేను లేనిది ఎక్కడా లేదు. భూమికూడా లేదు. దానికన్న అతిరిక్తమైనది ఏదీలేదు. నేను బ్రహ్మను, సిద్ధుడను, నిత్యశుద్ధుడను,

నిర్గుణుడను, కేవలము ఆత్మరూపిని, నిరాకారుడను, కేవలము బ్రహ్మమాత్రుడను అజరుడను, అమరుడను.

నాకు నేనే ప్రకాశిస్తాను. నాకు నేనే సదాత్మకుడను. స్వయముగా ఆత్మయందున్నాను. నాకు పరాగతి నేనే. స్వయముగానే భుజిస్తాను. స్వయముగానే క్రీడిస్తాను. స్వయముగా జ్యోతిస్సు రూపాన్ని. స్వయముగానే మహారూపాన్ని నా ఆత్మయందు నేను క్రీడిస్తాను. నా ఆత్మయందే అన్నీ చూస్తాను. స్వాత్మయందు సుఖాసీనుడనై, స్వాత్మమాత్రాశిష్టుడనై ఉంటాను. స్వచైతన్యమునందు స్వయముగా ఉంటాను. స్వాత్మ రాజ్యమందు సుఖమందు రమిస్తాను. స్వాత్మ సింహాసనమునుండి స్వాత్మకన్న ఇతరమైన దానిని చింతించను.

చిద్రూపమాత్రమైన బ్రహ్మను. సచ్చిదానంద స్వరూపుడను. అద్వయుడను. నేను ఆనందఘనుడను. నేను కేవలము బ్రహ్మను. నేను ఎప్పుడూ సర్వశూన్యుడను. ఆనందవంతుడను, నిత్యానందస్వరూపుడను, ఆత్మాకాశుడను. హృదయాకాశమున చిదాదిత్య స్వరూపుడను నేనే. ఆత్మచే, ఆత్మయందు తృప్తుడను. అరూపుడను. అవ్యయుడను. ఏకసంఖ్యావిహీనుడను, నిత్యము ముక్త స్వరూపుడను. ఆకాశముకన్న సూక్ష్మమైన వాడిని. ఆద్యంతములు లేనివాడను. సర్వప్రకాశరూపుడను. సత్తా మాత్రస్వరూపుడను. శుద్ధమోక్ష స్వరూపుడను. సత్యానంద స్వరూపుడను. జ్ఞానానంద ఘనుడను. విజ్ఞానమాత్ర రూపుడను. సచ్చిదానంద లక్షణుడను. ఈ సర్వజగత్తు బ్రహ్మమాత్రమే. బ్రహ్మ కన్న వేరైనది ఏదీలేదు. అదే నేను. సదానంద స్వరూపుడను, సనాతనమైన బ్రహ్మను నేనే. నీవు అనేది అతడు అనేది నాకన్న వేరుగా ఏదీలేదు. నేనే పరమశివుడను.

నేను అతిభావ స్వరూపుడను. సుఖాత్మకుడను. నాకు సాక్షిత్వములేదు. నేనే సనాతనమైన ఆత్మను. ఆదిశేషుడు నేనే. నామరూపాలు లేనివాడను. ఆనందవిగ్రహుడను నేనే. ఇంద్రియాభావ రూపుడను. సర్వాభావరూపుడను. బంధ విముక్తిహీనుడను. శాశ్వతానంద విగ్రహుడను.

ఆది చైతన్యమాత్రుడను. అఖండైకరసుడను. వాక్కుకు, మనస్సుకు అగోచరుడను సుఖవంతుడను. అన్ని ప్రదేశాలయందు పూర్ణుడను. భూమానందమయుడను. తృప్తి

రూపుడను. ఉత్కృష్టమైన అమృతరసుడను. అద్వితీయుడను. సత్తును అసత్తును. నేనే బ్రహ్మను. సంశయములేదు. సర్వశూన్య స్వరూపుడను. సకలాగమములందు గోచరుడను. ముక్తుడను. మోక్షరూపుడను నిర్వాణ (మోక్ష) సుఖరూపుడను.

సత్యవిజ్ఞానమాత్రుడను. సన్మాత్రుడను. ఆనందముకలవాడను. తురీయాతీత రూపుడను. నిర్వికల్పరూపుడను. అజుడను. రాగములేనివాడను. నిరంజనుడను. శుద్ధుడను, బుద్ధుడను. నిత్యుడను. విభుడను. ఓంకారానికి అర్థరూపమైనవాడను. నిష్కళంకమయుడను చిదాకార స్వరూపుడను. నేను లేదు. అతడు నేను కాదు. నేను ఏ స్వరూపముకాను. నిర్వ్యాపార స్వరూపుడను. నిరంజనుడను. నిరాభాసుడను. మనస్సునుకాను. ఇంద్రియాలు కాను. బుద్ధినికాను. వికల్పముకాను. దేహత్రయమును కాను. (స్థూల సూక్ష్మ కారణదేహాలు) స్వప్నరూపముకాను. సుషుప్తి అంతకన్నా కాను. తాపత్రయరూపము కాను. ఈషణత్రయముకాను. నాకు శ్రవణము లేదు. చిదాత్మ విషయకమైన మననము సిద్ధికై నాకులేదు. నాకు సజాతీయ పదార్థము లేదు. విజాతీయ పదార్థములేదు. స్వగతము లేదు.

మనోరూపము అసత్యము. బుద్ధి రూపము అసత్యము. అహంకారము అసత్యము. నేను నిత్యుడను. శాశ్వతుడను. దేహత్రయము, కాలత్రయము, గుణత్రయము అంతా అసత్తే. నేను సత్యాత్మకుడను. శుచియైనవాడను. శ్రుతము, వేదము, శాస్త్రము, అంతా అసత్తే. నేనొక్కడనే చిదాత్మకుడను. సత్యము, మూర్తిత్రయము అసత్తు. సర్వభూతములు అసత్తు. సర్వతత్త్వములు అసత్తు. నేను. సర్వమూ వ్యాపించినవాడను. నేనే శివుడను.

గురువులేదు. శిష్యుడులేదు. మంత్రములేదు. దృశ్యములేదు. దృక్కులేదు. నేను మాత్రమే ఉన్నాను. చింత్యమైనది, న్యాయమైనది, హితమైనది, ఏదీలేదు. ప్రాణములన్నీ అసత్తే. భోగములన్నీ అసత్తే. చూడబడేది, వినబడేది అంతా అసత్తే. కార్యము అకార్యము అసత్తే. నష్టమైనది ప్రాప్తమైనది కూడా అసత్తే.

సుఖము, దుఃఖము రెండూ అసత్తు. (లేవు) సర్వమూ అసన్మయము. పూర్ణము. ఆ పూర్ణము కూడా లేదు. ధర్మము అసత్తే అధర్మమూ అసత్తే. స్వరూపము అసత్తే. సర్వరసము అసన్మయము, సర్వగంధము, సర్వఅజ్ఞానము, అంతా అసత్తే. సన్మాత్రము

నేను. ఆత్మసాక్షాత్కారము పొందినవాడు ఈవిధంగా ఆత్మానుభవము పొందుతాడు. జ్ఞానియైనవాడు ఎప్పుడూ స్వాత్మమంత్రాన్నే చూడాలి. స్వాత్మమంత్రాన్నే అభ్యసించాలి. 'అహం బ్రహ్మాస్మి' (నేనే బ్రహ్మను) అనే మంత్రము కనిపించే పాపాన్ని నశింపచేస్తుంది. ఇతర మంత్రాలను నాశనం చేస్తుంది. దేహదోషాలను నశింపచేస్తుంది. జన్మపాపాన్ని నశింపచేస్తుంది. మృత్యుపాశాన్ని, ద్వైతదుఃఖాన్నీ నశింపచేస్తుంది ఈ మంత్రము.

'అహం బ్రహ్మాస్మి' అనే మంత్రం భేదబుద్ధిని, చింతను, దుఃఖములను నశింప చేస్తుంది. బుద్ధివ్యాధిని, చిత్తబంధాన్ని నశింపచేస్తుంది. సర్వశోకాలను నశింపచేస్తుంది. కామాదులను, క్రోధవృత్తిని, సంకల్పాలను, కోటిదోషాలను, సర్వతంత్రాలను నశింపచేస్తుంది.

ఈ మంత్రం అజ్ఞానాన్ని నశింపచేస్తుంది. ఆత్మలోకజయాన్నిస్తుంది. ఇది ఊహింపశక్యము కాని సుఖాన్నిస్తుంది. ఈ మంత్రం అనాత్మజ్ఞానమనే రాక్షసుణ్ణి సంహరిస్తుంది. అనాత్మగిరులను ఎగరగొడుతుంది. అనాత్మాసురులను హరించి వేస్తుంది. ఈ మంత్రము జ్ఞానానందాన్ని కలిగిస్తుంది. మోక్షాన్నిస్తుంది. ఇది సప్తకోటి మంత్రాలకన్న అధికమైనది. కోటిజన్మలలో చేసిన పాపాలను పోగొడుతుంది.

ఈ రకంగా 'అహంబ్రహ్మాస్మి' (నేనే పరబ్రహ్మను) అని భావించినవాడు సర్వపాపాలనుంచి, సర్వరోగాల నుంచి, సర్వదోషాలనుంచి, విముక్తుడై శాశ్వతమైన ఆనందాన్ని పొందుతాడు, అంటూ ఆత్మానుభవాన్ని వివరించాడు రత్నాకరుడు.

24. సాయుజ్యము (కైవల్యోపనిషత్తు, స్కందోపనిషత్తు)

"గురువుగారూ ! ఆత్మసాక్షాత్కారం పొందినవారు సాయుజ్యం పొందుతారు అన్నారు కదా. సాయుజ్యం అంటే ఏమిటి ? సాధకుడు ఆ స్థితికి ఎలా చేరుకుంటాడో వివరించండి" అన్నాడు కృష్ణశర్మ. వివరించటం మొదలుపెట్టాడు రత్నాకరుడు.

పరమపదము, కైవల్యము, సాయుజ్యము, మోక్షము, ముక్తి ఇవన్నీ పర్యాయపదాలే. వీటన్నింటి అర్థం ఒక్కటే. జీవాత్మ పరమాత్మల ఏకీభావం. అసలు ముక్తి అంటే విముక్తి అని అర్థం. అరిషడ్వర్గాల నుంచి విముక్తి. వీటిలో ముఖ్యమైనవి రెండు. అవే రాగద్వేషాలు. వీటిని జయిస్తే అన్నింటినీ జయించినట్లే. 'మమ'

అంటే బంధము 'నమమ' అంటే మోక్షము అని గతంలో వివరించటం జరిగింది. ముక్తి అనేక రకాలుగా ఉన్నది. బాహ్యపూజ చేసేవారికి ముక్తితో పనిలేదు. కాని అంతరారాధన చేసేవారి ధ్యేయం మాత్రం ముక్తి. ఈ ముక్తి ఐదురకాలుగా ఉన్నది.

1. సార్ష్టిరూపముక్తి : మణిపూరచక్రంలో పరమేశ్వరుని అర్చించేవారు పరమేశ్వరుడు ఉండే పురానికి దగ్గరగా ఇంకొక పురం నిర్మించుకుని అందులో ఉంటారు.

2. సాలోక్యముక్తి : అనాహత పద్మంలో పరమేశ్వరుని అర్చించేవారు పరమేశ్వరుడుండే పట్టణంలోనే నివసించగలుగుతారు.

3. సామీప్యముక్తి : విశుద్ధి చక్రంలో పరమేశ్వరుని సేవించేవారు ఆయనకు అతిదగ్గరగా సేవకులుగా ఉంటారు.

4. సారూప్యముక్తి : ఆజ్ఞా చక్రంలో పరమేశ్వరుని సేవించేవారు వేరే దేహంతో పరమేశ్వరునికి అతిసమీపంగా ఉండగలుగుతారు.

ఈ నాలుగు రకాల వారియందు ఇంకా అజ్ఞానమున్నది. వారు పరమేశ్వరునికి ఒక ఆకారముందని విశ్వసిస్తారు. వీరికి పునర్జన్మ ఉంటుంది.

5. సాయుజ్యము : ఇది అసలైన ముక్తి. సహస్రారంలో పరమేశ్వరుని అర్చించేవారు, ఆత్మసాక్షాత్కారం పొందిన వారు, సాయుజ్యం పొందుతారు. ఇది శాశ్వతమైన ముక్తి. ఇదే పరమపదము. కైవల్యము, మోక్షము. జీవాత్మ, పరమాత్మల ఏకీభావము. ఈ స్థితికి చేరినవారికి పునర్జన్మ ఉండదు.

పరబ్రహ్మ తత్త్వాన్ని భక్తి, శ్రద్ధ, యోగము, ధ్యానము, జ్ఞానములద్వారానే తెలుసుకోవాలి. అంతేకాని కర్మద్వారాగాని, సంతానము, ధనము మొదలైన వాటిద్వారా గాని ఎవరూ బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోలేరు. అమరత్వాన్ని పొందలేరు. అమరత్వానికి రూపమే మోక్షము. దాన్ని త్యాగంద్వారా మాత్రమే పొందాలి. త్యాగమంటే దానధర్మాలు చెయ్యటంకాదు. మనకున్నవన్నీ వదిలెయ్యాలి. రాగద్వేషాలు, కామ్యకర్మలు, అహంకార మమకారాలు ఇవన్నీ త్యాగం చెయ్యాలి. ఆ పరతత్త్వమనేది ఎక్కడో లేదు. నీలోనే ఉన్నది. ఇంద్రియ నిగ్రహంగలవారు, అమనస్కులు, మాత్రమే దాన్ని చేరగలరు.

వేదాంత ప్రవచనాలు వినటంవల్ల అపరోక్ష జ్ఞానం కలుగుతుంది. దానివల్ల పరతత్త్వాన్ని గూర్చిన అవగాహన కలుగుతుంది. నిష్కల్మషమైన హృదయము, అపరోక్ష జ్ఞానము కలిగి నియమనిష్ఠలు ఆచరించేవారు సన్యాసయోగంద్వారా బ్రహ్మలోకం చేరి, కల్పాంతంలో అమరత్వం పొందుతారు. అంటే జనన మరణాల నుండి విముక్తి పొందుతారు. ఇదే క్రమముక్తి. వేదాంత ప్రవచనాలు వినటం, బ్రహ్మను గూర్చి నిశ్చయజ్ఞానం కలగటం, తపస్సు, సన్యాసదీక్ష, ఇవన్నీ ఒక క్రమాన్ని తెలుపుతాయి.

అందుచేత సన్యాసాశ్రమంలో ఉన్నవాడు పవిత్రుడై, నిర్జనప్రదేశంలో సుఖాశీనుడై, మెడ, తల, శరీరము తిన్నగా నిలుపుకుని, గురువుకు నమస్కరించి, బాహ్యేంద్రియాలను నిరోధించి, అంతరింద్రియాలను అదుపులో ఉంచి స్థిరంగా ఉండాలి. మనస్సుకూడా నశించిన తరువాత, హృదయకమలంలో ఉన్న అవాగ్మానస గోచరుడు, ఇంద్రియాలకు అతీతుడు, శాంతుడు, అవ్యయుడు, ఆదిమధ్యాంత రహితుడు, కళ్యాణపురుషుడు అయిన పరమాత్మను ధ్యానించినట్లైతే, అర్హత గలవాడు సంసారబంధనాల నుండి విముక్తుడవుతాడు. మునీశ్వరులందరూ అద్వితీయుడు, సచ్చిదానంద రూపుడు, ప్రశాంతుడు, సర్వసాక్షి, అయిన పరమేశ్వరుణ్ణి ధ్యానిస్తారు. అతడే బ్రహ్మ. అతడే విష్ణువు, అతడే శివుడు. అతడే ఇంద్రుడు, అతడే సమస్త దేవతా స్వరూపుడు, నాశరహితుడు, అతడే హిరణ్యగర్భుడు, కాలము, అగ్ని, పంచభూతాలు, చంద్రుడు, సూర్యుడు, దిక్పాలకులు అన్నీ అతడే. ఈ రకంగా సర్వదేవతా స్వరూపుడు, సర్వజగద్రూపుడు అతడే. భూతభవిష్యద్వర్తమానాలలో ఉన్నవాడు, సనాతనుడు అయిన బ్రహ్మను అనుభవంలోకి తెచ్చుకున్నవాడు మృత్యువును జయిస్తాడు. ఈ విధంగా ఆత్మ, పరమాత్మ రెండూ ఒక్కటే అనే అనుభవమే మోక్షానికి మార్గం.

పొల్లుచేత కప్పబడిన ధాన్యపుగింజ 'వడ్లగింజ' అనబడుతుంది. ఆ పొల్లు లేదా ఊక పోతే అది బియ్యపు గింజ అవుతుంది. అలాగే మాయాబద్ధుడు జీవుడు. మాయారహితుడు శివుడు. మాయ అంటే కర్మ. కర్మ గనక నాశనం అయితే జీవుడే దేవుడవుతాడు. జాతిమతాల తేడా లేకుండా అభేదముగా చూడటమే జ్ఞానము. మనస్సును విషయాలలోకి చేరనీయకుండటమే ధ్యానము. మనసులోని దోషాలను, మాలిన్యాలను పోగొట్టటమే స్నానము. ఇంద్రియాలను ఇష్టానుసారము పోనీక

నిగ్రహించటమే శౌచము. బ్రహ్మామృతమే ఆచమనము. కాబట్టి ఎప్పుడూ బ్రహ్మామృతపానమే చెయ్యాలి. జ్ఞాని అయినవాడు ఎల్లప్పుడూ ఏకాంత ప్రదేశంలో ఒంటరిగానే ఉండాలి. రెండవవారు తోడు ఉండరాదు. ఎప్పుడూ బ్రహ్మనే దర్శించాలి. ఇలాటి బ్రహ్మజ్ఞానికి మాత్రమే ముక్తి లభిస్తుంది.

అన్నింటియందు సమభావంతో చూసేవాడు సమస్త భూతాలలోను తన ఆత్మనే చూడగలుగుతాడు. ఆత్మను క్రింద ఉండే అరణిగాను, ప్రణవాన్ని పైన ఉన్న అరణిగాను చేసుకుని, నిరంతరము ధ్యానము అనే అభ్యాసం చెయ్యటంవల్ల కలిగే తత్త్వజ్ఞానం ద్వారా విద్వాంసుడు తన పాపాలను దహించివేస్తాడు.

అజ్ఞాని దేహాన్నే ఆత్మగా భావిస్తాడు. స్త్రీ సుఖము, అన్నపానాదులు మొదలైన వాటిచేత ఇంద్రియాలను తృప్తిపరుస్తూ ఇదే సుఖము అనుకుంటాడు.

మాయాకల్పిత సంసారంలో జీవుడే భోక్త. సుఖదుఃఖాలను అతడే అనుభవిస్తాడు. అజ్ఞానాంధకారంలో ఉన్న జీవుడు గాఢనిద్రలో ఆత్మలో లీనమై అవిద్యచేత ఆచ్ఛాదింపబడిన స్వరూప సుఖాన్ని అనుభవిస్తాడు. సుషుప్తిలో నిద్రపోతున్న జీవుడు జన్మాంతర కర్మసంబంధంచేత తాను చేసిన కర్మ ఫలాన్ని అనుభవించటానికి మళ్ళీ మేల్కొంటాడు. ఈ రకంగా జాగ్రస్వప్న సుషుప్తులలో క్రీడిస్తూ ఉంటాడు. అయితే జాగ్రస్వప్న సుషుప్తులు, స్థూల సూక్ష్మ కారణశరీరాలు, వీటికి అభిమాని అయిన జీవుడు లయమై పోతే, అతడే పరమాత్మ. ఈ విశ్వానికి మూలకారకుడు. అఖండజ్ఞాన స్వరూపుడు. అతనివల్లనే పంచభూతాలు, తన్మాత్రలు, ఇంద్రియాలు, ఈ జగత్తు అంతా పుడుతున్నాయి.

ఏ పరబ్రహ్మ అందరికీ ఆత్మ అయినాడో, ఏ పరమాత్మ ఈ సృష్టికి ఆధారమైనాడో, ఆ పరమేశ్వరుడవునీవే. అవస్థాత్రయాన్ని ప్రకాశింపచేస్తూ, వాటికి సాక్షీభూతమైన పరమాత్మను నేనే అని తెలుసుకున్నవాడు సమస్త బంధనాలనుంచీ విముక్తుడవుతాడు.

సచ్చిదానంద రూపుడను నేనే. నానుండే ఈ జగత్తంతా ఆవిర్భవిస్తున్నది. నాలోనే అన్నీ ఉన్నాయి. అన్నీ నాలోనే లయమవుతున్నాయి. అద్వితీయుడైన పరబ్రహ్మను నేనే. సూక్ష్మాతి సూక్ష్మమైనవాడను నేనే. మహత్తులలో కెల్లా మహత్తరమైన

వాడను నేనే. పురాతనుడనునేనే ఈ విశ్వానికి కారకుడను, హిరణ్మయ స్వరూపుడను, కళ్యాణ పురుషుడను నేనే. అవయవాలు లేనివాడను, ఊహకు కూడా అందనిశక్తి స్వరూపుడను, నేనే. కళ్ళు లేకపోయినా చూడగలను. చెవులు లేకపోయినా వినగలను. నేను అద్వితీయుడను. నేను అనంగుడను కాని అందరినీ ఎరుగుదును. నన్ను గుర్తించగలవారు మాత్రం ఎవరూ లేరు. వేదములద్వారా మాత్రమే తెలుసుకోదగిన వాడను. జ్ఞానముద్వారా మాత్రమే పొందదగినవాడను. వేదాంతకర్తను. వేదవేత్తను. నాకు పాపపుణ్యాలు, జనన మరణాలు, ధర్మాధర్మాలు లేవు. దేహము, బుద్ధి, ఇంద్రియాలు లేవు. పంచభూతాలు నాచేతనే నిర్మించబడినాయి. నన్ను తెలుసుకున్న వారు బంధవిముక్తులవుతారు. అని త్రికరణశుద్ధిగా భావించిన సాధకుడు సాయుజ్యం పొందుతాడు. అతడికి పునర్జన్మ ఉండదు.

ప్రియశిష్యులారా ! ఇప్పటిదాకా చరాచర జగత్తుయొక్క సృష్టి నుండి ఆత్మ సాక్షాత్కారము, సాయుజ్యముదాకా అనేక విషయాలు వివరించాను.

ఈ విషయాలన్నింటినీ మననం చేసుకుంటూ, అమనస్కయోగం సాధించి జీవన్ముక్తులు కండి. అంటూ శిష్యులిద్దరినీ ఆశీర్వదించాడు రత్నాకరుడు. శిష్యులిద్దరూ గురువుగారు చెప్పిన విషయాలను అతిశ్రద్ధగా విన్నవారై, వారికి ముమ్మారు ప్రదక్షిణ చేసి, సాష్టాంగ దండ ప్రణామాలాచరించి, గురువుగారిని పరిపరివిధాల సత్కరించి శెలవు తీసుకున్నారు.

హరితసగోత్రీకుడు, శ్రీ క్రోవి పురుషోత్తమశర్మ శ్రీమతి లక్ష్మీనరసమ్మగార్ల
పౌత్రుడు, శ్రీ క్రోవి కృష్ణమూర్తి, శ్రీమతి సత్యపర్వతవర్ధనమ్మగార్ల జ్యేష్ఠపుత్రుడు
'పరమానందనాథ' *దీక్షానామధేయుడు అయిన* ***'క్రోవి పార్థసారథి'***
స్వర్వజనామోదము పొందునట్లుగా అత్యంత సులభశైలిలో వ్రాసిన
'ఆత్మసాక్షాత్కారము' *అను గ్రంథము సమాప్తము*
ఓం తత్సత్